Date: 11th May 2024
23:28 PM Dubai
West Zone Apartments

ప్రథమాధ్యాయము

1. కురుక్షేత్ర రణరంగమున సైనిక పరిశీలనము

(1) ధృతరాష్ట్రుడు ఇట్లు పలికెను: ఓ సంజయా! ధర్మక్షేత్రమైన కురుక్షేత్రము నందు నా తనయులు
మరియు పాండురాజు తనయులు యుద్ధము నందు చేయు గోరువారై సమకూడిన పిమ్మట
ఏమి చేసిరి? (2) సంజయుడు పలికెను: ఓ రాజా! పాండు తనయులచే వ్యూహముగా ఏర్పాటు
చేయ బడిన సైన్యమును గాంచిన పిమ్మట దుర్యోధనుడు తన గురువు చెంతకు చేరి ఈ క్రింది
విధముగా పలికెను. (3) ఓ ఆచార్యా! మీ బుద్ధి కుశలుడైన శిష్యుడగు ద్రుపద తనయునితో
దక్షతగా ఏర్పాటు చేయబడిన పాండు సుతుల గొప్ప సేనను గాంచుము. (4) ఈ సైన్యము నందు
భీమార్జునులతో సమానముగా యుద్ధము చేయగల శూరులైన ధనుర్ధరులు పెక్కురు గలరు.
యుయుధానుడు, విరాటుడు, ద్రుపదుడు మొదలగు వారు అటువంటి మహాయోధులు.
(5) ధృష్టకేతువు, చేకితానుడు, కాశీరాజు, పురుజిత్తుడు, కుంతిభోజుడు, శైబ్యుడు వంటి శూరులైన
మహాయోధులు అందున్నారు. (6) పరాక్రమవంతుడైన యుధామన్యుడు, శక్తిశాలియైన ఉత్తమౌజుడు,
సుభద్రా తనయుడు, ద్రౌపది కుమారులును అందున్నారు. ఈ వీరులందరును మహారథులు.
(7) కాని ఓ బ్రాహ్మణోత్తమా! నా సేనాబలమును నడుపుటకై ప్రత్యేకముగా యోగ్యులైనట్టి నాయకులను గూర్చి
మీ కొరకై నేను తెలియజేసెదను. (8) యుద్ధము నందు ఎల్లప్పుడును విజయమును సాధించు మీరు, భీష్ముడు,
కర్ణుడు, కృపుడు, అశ్వత్థామ, వికర్ణుడు మరియు సోమదత్తుని తనయుడైన భూరిశ్రవుడు వంటి వారు
మన సైన్యము నందున్నారు. (9) నా కొరకు తమ జీవితములను త్యాగము చేయుటకు సిద్ధపడియున్న
వీరులు ఇంకను పలువురు కలరు. వారందరును పలువిధములైన ఆయుధములను దాల్చిన వారును
మరియు యుద్ధనైపుణ్యతను కలిగిన వారును అయి ఉన్నారు. (10) మన సైన్యబలము లెక్కింప వీలులేనిదిగా
ఉన్నది మరియు మనము పితామహుడైన భీష్మునిచే సంపూర్ణముగా రక్షింపబడుచున్నాము. కాని
భీమునిచే జాగరూకతతో రక్షింపబడుచున్న పాండవ సైన్యము పరిమితముగా ఉన్నది.
(11) సేనావ్యూహ ద్వారము నందలి మీ ముఖ్యస్థానములలో నిలిచి ఉండి మీరు పితామహులైన
భీష్మదేవునకు సంపూర్ణ రక్షణమును కూర్చవలసి ఉన్నది (12) అప్పుడు కురువృద్ధుడును, యోధుల
పితామహుడును అగు భీష్ముడు దుర్యోధనునకు ఆనందమును గూర్చుచు సింహగర్జన వంటి ధ్వని
కలుగునట్లుగా తన శంఖమును బిగ్గరగా పూరించెను. (13) అటు పిమ్మట శంఖములు, పణవానకములు,
భేరులు, కొమ్ములు ఆదివి అన్నియు ఒక్కసారిగా ప్రయోగింపబడెను. ఆ సంఘటిత ధ్వని అతి భీకరముగా
ఉండెను (14) ఎదుటి పక్షమున శ్రీకృష్ణ భగవానుడు, అర్జునుడు ఇరువురును తెల్లని గుర్రములు
పూన్చబడిన మహారథము నందు ఆసీనులైన వారై తమ దివ్య శంఖములను పూరించిరి.
(15) శ్రీకృష్ణ భగవానుడు పాంచజన్యమనెడి తన శంఖమును పూరించెను; అర్జునుడు దేవదత్తమనెడి
తన శంఖమును పూరించెను; భోజన ప్రియుడును, ఘన కార్యములను చేయువాడును అగు భీముడు
పౌండ్రమనెడి తన మహాశంఖమును ఊదెను. (16-18) ఓ రాజా! కుంతీపుత్రుడైన యుధిష్ఠిరుడు
అనంత విజయమనెడి తన శంఖమును పూరించగా, నకులుడు సుఘోషమనెడి శంఖమును,

Date: 12th May 2024

సహదేవుడు మణిపుష్పక మనెడి శంఖమును పూరించిరి. గొప్ప విలుకాడైన కాశీరాజు, యోధుడైన
శిఖండి, ధృష్టద్యుమ్నుడు, విరాటుడు, జయింప రానటువంటి సాత్యకి, ద్రుపదుడు, ద్రౌపది తనయులు
గొప్ప బాహుబలులు కలిగిన సుభద్రా తనయుడు మున్నగు వీరులందరును తమ తమ శంఖములను
పూరించిరి. (19) ఆ వివిధ శంఖముల ధ్వని అతి భీకరమయ్యెను. భూమ్యాకాశములు రెండింటిని
కంపించుచు అది ధృతరాష్ట్ర తనయుల హృదయములను బ్రద్దలు చేసెను. (20) ఆ సమయమున
పాండుసుతుడైన అర్జునుడు కపిధ్వజము కూర్చబడిన రథము నందు నిలిచి, ధనస్సును చేపట్టి బాణము-
లను వేయుటకు సిద్ధపడెను. ఓ రాజా! వ్యూహముగా నిలిచి ఉన్న ధృతరాష్ట్ర తనయులను గాంచి అతడు
శ్రీకృష్ణ భగవానునితో ఈ వాక్యములను పలికెను. (21-22) అర్జునుడు పలికెను: ఓ అచ్యుతా! దయ చేసి
రెండు సేనల నడుమ నా రథమును నిలుపుము. తద్వారా యుద్ధము చేయగోరి ఇచ్చట ఉపస్థితులైన
వారిని మరియు ఈ మహా సంగ్రామమున నేను తలపడవలసిన వారిని గాంచగలుగుదును.
(23) దుష్ట బుద్ధి గల ధృతరాష్ట్ర తనయునికి ప్రియమును కూర్చుటకై యుద్ధము చేయుటకు ఇచ్చటకు
విచ్చేసిన వారిని నేను చూచెదను. (24) సంజయుడు పలికెను: ఓ భరతవంశీయుడా! అర్జునునిచే
ఆ విధముగా సంబోధింప బడిన వాడై శ్రీకృష్ణ భగవానుడు ఉత్తమమైన రథమును ఇరుపక్షపు సేనల
నడుమ నిలిపెను. (25) భీష్ముడు, ద్రోణుడు మరియు ఇతర భూపాలకుల సమక్షమున శ్రీకృష్ణుడు
"ఓ పార్థా! ఇచ్చట కూడి ఉన్నటువంటి కురువంశీయులందరిని గాంచుము" అని పలికెను.
(26) ఇరుపక్షపు సేనల నడుమ నిలిచిన అర్జునుడు అచ్చట తండ్రులను, తాతలను, గురువులను,
మేనమామలను, సోదరులను, పుత్రులను, మనుమలను, స్నేహితులను, మామలను, శ్రేయోభిలాషులను
గాంచెను (27) నానావిధ బంధువులను స్నేహితులను చూచినంతట కుంతీ తనయుడైన అర్జునుడు
కరుణను కూడిన వాడై ఈ విధముగా పలికెను. (28) అర్జునుడు పలికెను: ఓ కృష్ణా! యుద్ధోత్సాహమున
నా ఎదుట నిలిచి ఉన్న మిత్రులను మరియు బంధువులను చూచి నా శరీర అవయవములు
కంపించు చున్నవి. నోరు ఎండి పోవుచున్నది. (29) నా దేహమంతయు కంపించుచున్నది. నాకు
రోమాంచ మగుచున్నది. గాండీవ ధనస్సు నా చేతి నుండి జారి పోవుచున్నది. నా చర్మము
మండి పోవు చున్నది. (30) నేను ఇప్పుడు ఏ మాత్రము నిలబడ లేక పోవుచున్నాను. నన్ను నేను
మరచి పోవుచున్నాను. నా మనస్సు చలించు చున్నది. ఓ కృష్ణా! కేశిసంహారి! కేవలము
విపరీతములనే నేను చూచు చున్నాను. (31) ఓ కృష్ణా! ఈ యుద్ధము నందు నా స్వజనమును
చంపుట ద్వారా ఏ విధముగా శ్రేయస్సు కలుగగలదో నేను చూడ లేకున్నాను. తదనంతర విజయమును
గాని, రాజ్యమును గాని, సుఖమును గాని నేను వాంఛింప లేకున్నాను. (32-35) ఓ గోవిందా! మేమెవరి కొరకు
రాజ్యమును, సుఖమును, చివరకు జీవనమును సైతము కోరుచున్నామో వారందరును ఈ యుద్ధరంగమున
నిలిచి యుండగా ఆ రాజ్యాదుల వలన మాకు కలుగు ప్రయోజనమేమి? ఓ మధుసూదనా! ఆచార్యులు,
తండ్రులు, పుత్రులు, తాతలు, మేనమామలు, మామలు, మనుమలు, బావమరుదులు, ఇతర బంధువులందరును
తమ ఆస్తులను మరియు ప్రాణములను విడిచి పెట్టుటకు సంసిద్ధులై నా ఎదుట నిలిచి నన్ను
చంపకోరినను నేనెందులకు వారిని చంపకోరవలెను? ఓ జనార్దనా! ఈ ధరిత్రి విషయము మాటుంచి

ముల్లోకములను పొందినను నేను వారితో యుద్ధము చేయుటకు సిద్ధముగా లేను. ధృతరాష్ట్రుని
తనయులను వధించుట వలన మేమెట్టి ఆనందమును పొందగలము? (36) ఇట్టి దుర్మార్గులను
చంపినచో మాకు కలుగు లాభమేమి? ఆ కార్యముచే మేమెట్లు సుఖమును పొందగలము?
(37/38) ఓ జనార్ధనా! లోభపూర్ణ చిత్తము కలిగిన వీరందరును కులసంహారమునందుగాని, బంధువులతో
కలహమునందుగాని దోషమును కాంచకున్నను, వంశనాశనమునందు దోషమును కాంచగలిగిన మేమెందు
లకు ఇట్టి పాపకర్మమునందు నియుక్తులము కావలెను? (39) కులక్షయము వలన శాశ్వతమైన వంశాచారము
నశించిపోవును. ఆ విధముగా వంశమున మిగిలినవారు అధర్మవర్తనులగుదురు. (40) ఓ కృష్ణా! వంశము
నందు అధర్మము ప్రబలమగుట వలన స్త్రీలు కులస్త్రీలు చెడిపోవుదురు. ఓ వృష్ణివంశసంజాతుడా! అట్టి
కులస్త్రీ పతనము వలన అవాంఛనీయ సంతానము వృద్ధినొందును. (41) అవాంఛిత సంతానము వృద్ధి అగుట
వలన కుటుంబము వారు మరియు కుటుంబ ఆచారమును నష్టపరచినవారు ఇరువురికిని నరకము
సంప్రాప్తించును. పిండోదక క్రియలు సంపూర్ణముగా ఆపివేయబడుటచే అట్టి అధర్మ కుటుంబములకు
చెందిన పితరులు పతనము నొందుదురు. (42) వంశాచారమును నశింపచేసి దుష్ట సంతానమునకు
కారణమగు వారి పాపకర్మల వలన కులధర్మములు మరియు జాతిధర్మములు నాశనమగును.
(43) ఓ కృష్ణా! జనార్ధనా! కులధర్మములను నాశనము చేయువారు శాశ్వతముగా నరకవాసము
చేయుదురని గురుశిష్య పరంపరానుగతముగా నేను వినియుంటిని. (44) అహో! ఘోరమైన పాపకర్మలను
చేయుటకు మేము సిద్ధపడుట ఎంత విచిత్రము! రాజ్యసుఖములను అనుభవింపవలెనను కోరికతో
మేము స్వజనమును చంపగోరుచున్నాము. (45) నిరాయుధుడను మరియు ప్రతీకారము చేయనివాడను
అగు నన్ను శస్త్రధారులైన ధృతరాష్ట్రుని పుత్రులు రణరంగమందు వధించినచో అది నాకు క్షేమకరమే
కాగలదు (46) సంజయుడు పలికెను: రణరంగమునందు అర్జునుడు ఆ విధముగా పలికి ధనుర్బాణము
లను పడవేసి దుఃఖముచే కల్లోలితమైన మనస్సు కలవాడై రథమునందు కూర్చుండిపోయెను.

2. ద్వితీయ అధ్యాయము - గీతాసారము

(1) సంజయుడు పలికెను: చింతాక్రాంతుడై కనులయందు అశ్రువులను నిల్పి కృపాపూర్ణుడైనట్టి అర్జునుని
గాంచిన మధుసూదనుడు ఈ క్రింది విధముగా వాక్యములను పలికెను. (2) శ్రీకృష్ణభగవానుడు పలికెను:
ఓ అర్జునా! నీకీ కల్మషము ఎచట నుండి ప్రాప్తించినది? జీవితపు విలువ నెరిగిన మనుజునకు ఇది అర్హము
కానట్టిది. ఇది ఉన్నత లోకములను లభింపచేయదు. పైగా అపకీర్తిని కలిగించును. (3) ఓ పృథాకుమారా!
పతనకారక నపుంసకత్వమునకు లొంగకుము. ఇది నీకు తగదు. ఓ పరంతపా! ఇట్టి హృదయదుర్బలత్వను
విడనాడి వెంటనే లెమ్ము. (4) అర్జునుడు పలికెను: ఓ శత్రుసంహారా! ఓ మధుసూదనా! పూజార్హులైన భీష్మ
ద్రోణుల వంటి వారిని నేనెట్లు బాణములతో యుద్ధమునందు ఎదుర్కొనగలను? (5) గురువులైన మహాత్ముల
జీవితములను పణముగా పెట్టి జీవించుట కన్నను భిక్షమెత్తి జీవించుట ఈ జగమున ఉత్తమమైనది.
ప్రాపంచిక లాభమును కోరుచున్నప్పటికిని వారందరును పెద్దలే. వారిని వధించినచో మేము అనుభవించు
సమస్తమును రక్తపంకిలమగును. (6) వారిని జయించుట ఉత్తమమో లేక వారిచే జయింపబడుట
ఉత్తమమో మేము తెలియకున్నాము. ధృతరాష్ట్రుని తనయులను చంపినచో మేమిక జీవించియుండుట

వ్యర్థము. అయినప్పటికిని వారిప్పుడు యుద్ధరంగమున మా ఎదుట నిలిచి ఉన్నారు. (7) కార్పణ్య దోష
కారణమున నేనిప్పుడు నా స్వధర్మ విషయమున మోహము చెంది శాంతిని కోల్పోయితిని. ఏది నాకు
ఉత్తమమో నిశ్చయముగా తెలుపుమని నిన్ను నేను అడుగుచున్నాను. నేనిప్పుడు నీకు శిష్యుడను మరియు
శరణాగతుడను. దయచేసి నాకు ఉపదేశము కావింపుము. (8) ఇంద్రియములను శోషింపచేయునటువంటి
ఈ శోకమును తొలగించుకొను మార్గమును నేను కాంచలేకున్నాను. దేవతల స్వర్గాధిపత్యము వలె
సంపత్సమృద్ధమును మరియు శత్రురహితమును అగు రాజ్యమును ధరిత్రిపై సాధించినను ఈ శోకమును
నేను తొలగించుకొనజాలను. (9) సంజయుడు పలికెను: శత్రువులను తపింపచేయు అర్జునుడు ఆ విధముగా
పలికి పిదప శ్రీకృష్ణునితో "గోవిందా! నేను యుద్ధమును చేయను" అని పలికి మౌనమును వహించెను.
(10) ఓ భరతవంశీయుడా! ఇరు సేనల నడుమ శ్రీకృష్ణుడు నవ్వుచున్నవాని వలె ఆ సమయమున దుఃఖితుడైన
అర్జుననితో ఇట్లు పలికెను. (11) పూర్ణ పురుషోత్తముడగు శ్రీకృష్ణ భగవానుడు పలికెను: ప్రజ్ఞను కూడిన పలుకులను
పలుకుచునే నీవు దుఃఖింపదగని విషయమును గూర్చి దుఃఖించుచున్నావు. పండితులైనవారు జీవించి
ఉన్నవారిని గూర్చి కాని, మరణించిన వారిని గూర్చి కాని దుఃఖింపరు (12) నేను కాని నీవు కాని, ఈ రాజులందరు కాని
నిలిచి ఉండని సమయమెన్నడును లేదు. అలాగుననే భవిష్యత్తునందు మనమెవ్వరము ఉండక పోము.
(13) దేహధారి దేహమునందు బాల్యము నుండి యౌవనమునకు, యౌవనము నుండి ముదుసలి ప్రాయమునకు
క్రమముగా చను రీతి మరణానంతరము వేరొక దేహమును పొందును. అట్టి మార్పు విషయమున ధీరుడైనవాడు
మోహము నొందడు (14) ఓ కౌంతేయా! తాత్కాలికములైనట్టి సుఖదుఃఖముల రాకయు, కాలక్రమమున వాటి పోకయు
శీతగ్రీష్మకాలముల రాకపోకల వంటివి. ఓ భరతవంశీయుడా! ఇంద్రియానుభవము వలన కలుగు అట్టి
ద్వంద్వములను కలత నొందక సహించుటను మనుజుడు నేర్వవలెను. (15) ఓ మానవ శ్రేష్ఠుడా! సుఖదుఃఖములచే
కలత నొందక, ఆ రెండింటి యందును ధీరుడై నిలుచువాడు నిక్కముగా మోక్షమునకు అర్హుడై ఉన్నాడు.
(16) అసత్తునకు (భౌతిక దేహము) ఉనికి లేదని మరియు నిత్యమైన దానికి (ఆత్మ) మార్పు లేదని సత్యద్రష్టలైనవారు
నిర్ధారించి ఉన్నారు. ఈ రెండింటి తత్త్వమును బాగుగా అధ్యయనము చేసి వారీ విషయమును ధ్రువీకరించిరి.
(17) శరీరమందంతటను వ్యాపించి ఉన్న ఆత్మ నశింపు లేనటువంటిదని నీవు తెలిసికొనుము. అట్టి అవినాశియైన
ఆత్మను నశింపచేయుటకు ఎవ్వడును సమర్థుడు కాడు. (18) అవినాశియును, అపరిమితుడును, నిత్యుడును అగు
జీవుని దేహము తప్పక నశించియే తీరును. కావున ఓ భరతవంశీయుడా! నీవు యుద్ధము చేయుము.
(19) జీవుడు చంపువాడని తలచువాడు కాని, చంపబడువాడని భావించువాడు కాని జ్ఞానవంతులు కారు.
ఏలయన ఆత్మ చంపదు మరియు చంపబడదు. (20) ఆత్మకు ఎన్నడును జన్మగాని, మృత్యువు కాని లేదు.
అది జన్మింపలేదు, జన్మించదు, జన్మింపబోదు, జన్మరహితమును, నిత్యమును, శాశ్వతమును, పురాతనమును
అగు అట్టి ఆత్మ దేహము చంపబడినను చంపబడదు. (21) ఓ పార్థా! ఆత్మ నాశనము లేనిదని, నిత్యమైనదని,
పుట్టుక లేనిదని, అవ్యయమైనదని తెలిసినవాడు ఎవ్వరినేని ఎట్లు చంపును? లేదా చంపించును?
(22) మనుజుడు పాత వస్త్రములను త్యజించి నూతన వస్త్రములను ధరించు రీతి, ఆత్మ జీర్ణమైన దేహములను
త్యజించి నూతన దేహములను పొందుచున్నది (23) ఆత్మ ఎట్టి ఆయుధముల చేతను ఛేదింపబడదు, అగ్నిచే
దహింపబడదు, నీటిచే తడుపబడదు, వాయువుచే శోషింపబడదు. (24) ఆత్మ ఛేదింపబడనటువంటిది మరియు

కలుగనటువంటిది. దహింప చేయుటకు కాని, శోషింప చేయుటకు కాని అది వీలు కానటువంటిది, అది
నిత్యమును, సర్వత్రా వ్యాపితమును, మార్పు రహితమును, అచలమును, సనాతనమును అయి ఉన్నది.
(25) ఆత్మ అవ్యక్తము, అచింత్యము, మార్పు రహితమని చెప్పబడినది. ఈ విషయమును తెలిసిన పిమ్మట
దేహమును గూర్చి నీవు చింతించ రాదు. (26) ఓ మహాబాహో! ఒక వేళ నీవే ఆత్మ ఎల్లప్పుడును పుట్టుచు
మరణించునని తలచినను దుఃఖించుటకు ఎట్టి కారణము లేదు. (27) పుట్టిన వానికి మరణము
తప్పదు మరియు మరణము పిదప జన్మము తప్పదు. కావున అనివార్యమైన నీ విద్యుక్త ధర్మ
నిర్వహణము నందు నీవు దుఃఖింపరాదు. (28) సృజింపబడిన జీవులందరును ఆదిలో కనబడక
మధ్యలో కనబడి, నశించిన పిమ్మట తిరిగి కనబడక ఉందురు. అట్టి ఎడ దుఃఖించుటకు అవసరమేమి
కలదు (29) కొందరు ఆత్మను అద్భుతమైనదిగా గాంచుదురు. కొందరు దానిని అద్భుతమైనదిగా
వర్ణింతురు. మరికొందరు దానిని అద్భుతమైనదిగా శ్రవణము చేయుదురు. ఇంకొందరు శ్రవణము
చేసినను దానిని గూర్చి ఏ మాత్రము తెలియకుందురు. (30) ఓ భరతవంశీయుడా! దేహమందు
వసించు దేహి ఎన్నడును చంపబడదు. కావున ఏ జీవిని గూర్చి నీవు దుఃఖించుట తగదు.
(31) క్షత్రియునికిగా స్వధర్మము ననుసరించి ధర్మము కొరకై యుద్ధము చేయుట కన్నను శ్రేయోదాయక
మైనది వేరొక్కటి లేదని నీవెరుగవలెను. కావున సంశయింపవలసిన అవసరమే లేదు. (32) ఓ పార్థా!
స్వర్గద్వారములను తెరచునటువంటి యుద్ధావకాశమును కోరకనే అప్రయత్నముగా పొందునటువంటి
క్షత్రియులు సౌఖ్యవంతులు (33) ఒక వేళ నీవు నీ స్వధర్మమైన యుద్ధమును చేయకుందువేని
ధర్మమును అలక్ష్య పరచినందులకు నిక్కముగా పాపమును పొందగలవు. ఆ విధముగా యోధుడు
వనెడి కీర్తిని పోగొట్టు కొందువు. (34) జనులు నీ అపకీర్తిని ఎల్లప్పుడును చెప్పుకొందురు. గౌరవనీయునైన
వానికి అపకీర్తి అనునది మరణము కన్నను దారుణమైనది. (35) నీ పేరు ప్రఖ్యాతుల ఎడ గొప్ప గౌరవమును
కలిగి ఉన్న సేనాధిపతులు భయము చేతనే యుద్ధరంగమును వీడినావని తలచి చులకన
చేయుదురు (36) నీ శత్రువులు నిన్ను పలు నిర్దయ వాక్యములతో వర్ణించుచు నీ సామర్థ్యమును
నిందింతురు. ఇంత కన్నను నీకు దుఃఖకరమైనది వేరేది కలదు? (37) ఓ కుంతీ తనయా! నీవు
యుద్ధరంగమున చంపబడి స్వర్గమును పొందుటయో లేక యుద్ధమును జయించి రాజ్యమును
అనుభవించుటయో జరుగగలదు. కావున కృతనిశ్చయుడవై లేచి యుద్ధము చేయుము.
(38) సుఖదుఃఖములను గాని, లాభాలాభములను గాని, జయాపజయములను గాని లెక్కింపక యుద్ధముకొరకే
యుద్ధము చేయుము. ఆ విధముగా చేయుటవలన నీవెన్నడును పాపమును పొందవు (39) ఇంత వరకు ఈ జ్ఞానమును
నేను సాంఖ్యమునను సరించి నీకు వివరించితిని. ఇప్పుడు దానిని ఫలాపేక్ష లేనటువంటి కర్మరూపమున వివరించెదను
ఆలకింపుము, ఓ పృథకుమారా! అట్టి జ్ఞానము ననుసరించి నీవు వర్తింతువేని కర్మబంధమునుండి విడివడగలవు
(40) ఈ ప్రయత్నమునందు నష్టముగాని, హాని గాని లేదు. ఈ మార్గమున స్వల్పపురోగతియు మహత్తరమైన భయమునుండి
మనుజుని రక్షించును. (41) ఈ మార్గమున ఉన్నవారు స్థిర ప్రయోజనముతో ఒకే లక్ష్యమును కలిగి ఉందురు. ఓ కురునందనా!
స్థిర ప్రయోజనము లేనివారి బుద్ధి అనేక విధములుగా ఉండును. (42-43) స్వర్గలోకప్రాప్తి, ఉత్తమ జన్మము, అధికారము వంటి
వానిని పొందుటకై వివిధములైన కర్మలను ఉపదేశించు వేదములందలి మధురమైన వాక్కుల ఎడ అల్పజ్ఞులు అనురక్తులగుదురు.

భోగము భవమును మరియు సదున్న జీవితమును కోరువారగుటచే అట్టివారు దానికి మించినది వేరొకటి లేదని పలుకుదురు.
(44) భోగానుభవము మరియు లౌకిక సంపదలకు ఆకర్షితులై, వానిచే మోహపరవశులగు వారి మనస్సునందు భగవానుని
భక్తియుక్త సేవను గూర్చిన స్థిర నిశ్చయము కలుగనే కలుగదు. (45) వేదములు ముఖ్యముగా త్రిగుణములకు సంబంధించిన
విషయములను గూర్చి చర్చించును. ఓ అర్జునా! నీవు ఈ త్రిగుణములకు అతీతుడవై, ద్వంద్వముల నుండియు మరియు
యోగక్షేమములనెడి చింతల నుండియు విడివడినవాడవై ఆత్మయందు స్థిరుడవగుము. (46) చిన్న నూతిచే
ఒనగూడు ప్రయోజనములన్నియును శీఘ్రమే పెద్ద జలాశయము నందలి జలముచే సిద్ధించురీతి, వేదముల
సమస్త ప్రయోజనములు వాని అంతరార్థమును గ్రహించిన వానికి సిద్ధించుచున్నవి. (47) విధ్యుక్త ధర్మమును
నిర్వర్తించుట యందే నీకు అధికారము కలదు గాని కర్మఫలముల నందు కాదు. నీ కర్మఫలములకు నీవే కారణమని
ఎన్నడును భావింపకుము. అలాగుననే విధ్యుక్త ధర్మమును వీడుట యందు ఆసక్తుడవు కాకుము (48) ఓ అర్జునా!
జయాపజయములందు ఆసక్తిని విడనాడి సమబుద్ధితో నీ విధ్యుక్త ధర్మమును నిర్వహింపుము. అట్టి సమభావమే
యోగమనబడును. (49) ఓ ధనంజయా! భక్తియోగముచే హీనకర్మలను దూరము చేసి ఆ భావనలోనే భగవానుని
శరణు వేడుము. కర్మఫలములను అనుభవింపగోరువారు లోభులు. (50) భక్తియోగమునందు నియుక్తుడైనవాడు
ఈ జన్మము నందే శుభాశుభ ఫలముల నుండి ముక్తుడగును. కనుక కర్మయందలి నేర్పువంటి ఆ యోగము
కొరకు యత్నింపుము (51) ఆ విధముగా భక్తియోగము నందు నియుక్తులై మహాత్ములు లేదా భక్తులు ఈ భౌతిక జగమునందు
కర్మఫలముల నుండి తమను తాము ముక్తులను కావించుకొందురు. ఆ విధముగా వారు జనన, మరణ చక్రము నుండి
విడుదలను పొంది దుఃఖరాహిత్య స్థితిని పొందుచున్నారు (52) ఎప్పుడు నీ బుద్ధి దట్టమైన మోహారణ్యమును దాటునో
అప్పుడు నీవు వినినదాని యెడ మరియు వినవలసినదాని యెడ విరక్తిని కలిగినవాడవగుదువు. (53) ఎప్పుడు నీ మనస్సు
వేదముల మధుర వాక్కులచే కలతనొందక ఆత్మానుభూతి అనెడి సమాధి యందు స్థితమగునో అప్పుడు నీవు
దివ్య చైతన్యమును పొందినవాడవగుదువు. (54) అర్జునుడు పలికెను: ఓ కృష్ణా! సమాధిమగ్నమైన చైతన్యము గలవాని
లక్షణములు ఏవి? అతడు ఏ విధముగా భాషించును, అతని భాష ఎట్టిది? అతడెట్లు కూర్చుండును, ఎట్లు నడుచును.
(55) శ్రీకృష్ణ భగవానుడు పలికెను: ఓ పార్థా! మనుజుడు ఎప్పుడు మానసిక కల్పితములైన సర్వకామములను
త్యజించునో మరియు ఆ విధముగా శుద్ధి పడిన మనస్సు ఎప్పుడు ఆత్మనందు తృప్తినొందునో అప్పుడతడు
స్థితప్రజ్ఞుడని చెప్పబడును. (56) త్రివిధ తాపములందును చలింపని మనస్సు గలవాడును, సుఖము
కలిగినప్పుడు ఉప్పొంగనివాడును, రాగము, భయము, క్రోధముల నుండి విడివడినవాడును అగు మనుజుడు
స్థిరమైన మనస్సు గల ముని అని చెప్పబడును (57) భౌతిక జగమునందు ప్రాప్తించిన మంచి, చెడులను
ప్రశంసించుట కాని, ద్వేషించుట కాని చేయక వాటిచే ప్రభావితుడు కానివాడు సంపూర్ణ జ్ఞానమునందు స్థిరుడై
నిలుచును (58) తాబేలు తన అవయవములను లోనికి ముడుచుకొనెడి రీతి, ఇంద్రియార్థముల నుండి
ఇంద్రియములను మరలించువాడు సంపూర్ణ జ్ఞానమునందు స్థిరముగా నున్నవాడగును. (59) దేహి ఇంద్రియ
భోగముల నుండి నిగ్రహించినను ఇంద్రియార్థముల పట్ల రుచి నిలిచియే ఉండును. కాని అత్యున్నత రసాస్వాదన ద్వారా
అట్టి కర్మలను అంతరింప చేసి అతడు చైతన్యము నందు స్థిరుడు కాగలడు. (60) ఓ అర్జునా! ఇంద్రియములు
బలవంతములును మరియు దృఢములును అయి ఉన్నవి. వానిని అదుపు చేయు యత్నించు విచక్షణాపూర్ణుని
మనస్సును సైతము అవి హరించివేయుచున్నవి. (61) ఇంద్రియములను పూర్ణముగా నియమించి వానిని వశము

నందుంచుకొని నాయందే చిత్తమును లగ్నము చేయు మనుజుడు స్థితప్రజ్ఞుడన బడును. (62) ఇంద్రియార్థములను ధ్యానించునప్పుడు వాని యెడ మనుజునికి ఆసక్తి కలుగును. ఆ ఆసక్తి నుండి కామము వృద్ధినొందగా, కామము నుండి క్రోధము ఉద్భవించును. (63) క్రోధము వలన అధిక మోహము కలుగగా, మోహము వలన జ్ఞాపకశక్తి భ్రమకు గురి అగును. జ్ఞాపకశక్తి భ్రమచే బుద్ధి నాశనమగును. బుద్ధి నశించినప్పుడు మనుజుడు తిరిగి సంసారగర్తమున పడిపోవును (64) కాని సమస్త రాగద్వేషముల నుండి ముక్తి పొందినవాడును మరియు విధి నియమముల ప్రకారము వర్తించుట ద్వారా ఇంద్రియములను అదుపు చేయగలిగిన వాడును అగు మనుజుడు భగవానుని సంపూర్ణ కరుణను పొందగలుగును. (65) ఈ విధముగా భగవానుని భావన యందు సంతృప్తి చెందిన వానికి త్రివిధ తాపములు కలుగవు. అట్టి సంతృప్త చిత్తము కలిగినప్పుడు మనుజుని బుద్ధి శీఘ్రమే సుస్థిరమగును. (66) భగవానునితో సంబంధమును పొందని వాడు విశుద్ధ బుద్ధినిగాని, స్థిరమైన మనస్సును కాని కలిగి ఉండజాలడు. అవి లేనిదే శాంతిని పొందుటకు అవకాశము లేదు. ఇక శాంతి లేనిదే సుఖమెట్లు కలుగును? (67) నీటి యందలి నావను బలమైన వాయువు త్రోసివేయు రీతి, మనస్సు దేని యందు లగ్నమైనప్పుడు చరించు ఇంద్రియములలో ఒక్కటైనను సరియే మనుజుని బుద్ధిని హరింపగలదు. (68) అందుచే ఓ మహాబాహో! ఎవ్వని ఇంద్రియములు వాని ఇంద్రియార్థముల నుండి నిగ్రహింపబడి ఉండునో అతడు నిశ్చయముగా స్థితప్రజ్ఞుడనబడును. (69) సకల జీవులకు ఏది రాత్రియో అదియే ఆత్మనిగ్రహము కలవారికి మేల్కొని ఉండు సమయము. సర్వజీవులు మేల్కొని ఉండు సమయము అంతర్ముఖుడైన మునికి రాత్రి సమయము (70) సదా పూరింపబడుచున్నను నిశ్చలముగా నుండు సముద్రమునందు నదులు ప్రవేశించు రీతి, తన యందు కోరికలు నిరంతరము ప్రవేశించు చున్నను ఆ ప్రవాహముచే కలత నొందనివాడే శాంతిని పొందగలడు. కోరికలను తీర్చుకొన యత్నించువాడు అట్టి శాంతిని పొందజాలడు. (71) ఇంద్రియ భోగానుభవ కోరికల అన్నింటిని త్యజించి నిష్కాముడిగా జీవించుచు, మమకారము మరియు మిథ్యాహంకారములను వదిలిపెట్టినవాడు మాత్రమే నిజమైన శాంతిని పొందగలుగును. (72) ఇదియే ఆధ్యాత్మికమును, దివ్యమును ఐన జీవనవిధానము. దీనిని పొందిన పిమ్మట మనుజుడు మోహము నొందడు. మరణ సమయమునందును ఆ విధముగా స్థితుడైనట్టి వాడు భగవద్రాజ్యమున ప్రవేశింపగలుగును.

3. కర్మ యోగము

(1) అర్జునుడు పలికెను: ఓ జనార్దనా! కేశవా! కామ్యకర్మము కన్నను బుద్ధియే ప్రశస్తమని నీవు భావించినచో ఎందులకు నన్ను ఇట్టి ఘోరమైన యుద్ధము నందు నియోగింపగోరుచున్నావు? (2) అనేకార్థములు కలిగిన నీ బోధలచే నా బుద్ధి మోహము నొందినది. కావున నాకు ఏది అత్యంత శ్రేయోదాయకమో దయతో నిశ్చయముగా తెలియ చేయుము (3) శ్రీకృష్ణుడు పలికెను: పాపరహితుడవైన ఓ అర్జునా! ఆత్మానుభూతిని పొందగోరు మానవులు రెండు రకములని ఇది వరకే నేను వివరించితిని. కొందరు దానిని సాంఖ్యము మరియు తాత్త్విక కల్పనల ద్వారా అవగతము చేసికొనగోరగా, మరికొందరు భక్తియోగము ద్వారా దానిని అర్థము చేసికొనగోరుదురు. (4) కేవలము కర్మను చేయకుండుట ద్వారా ఎవ్వరును కర్మఫలము నుండి ముక్తిని పొందలేరు. అలాగుననే కేవలము సన్న్యాసము ద్వారా ఎవ్వరును సంపూర్ణత్వమును పొందలేరు. (5) ప్రతి మానవుడును భౌతిక ప్రకృతి వలన తాను పొందినటువంటి గుణము ననుసరించి అవశ్యమై కర్మయందు ప్రేరేపింపబడును. కావున ఏదియును చేయకుండ క్షణకాలము

కర్మ ఎవ్వరును ఉండజాలరు. (6) కర్మేంద్రియములను నిగ్రహించినను మనస్సు ఇంద్రియార్థములందు
మగ్నమై ఉండువాడు నిశ్చయముగ తనను తాను మోసగించుకొనుచు మిథ్యాచారి అనబడును.
(7) అట్లుగాక మనస్సు చేత క్రియాశీలక ఇంద్రియములను నిగ్రహించుటకు యత్నించి సంగత్వము లేనివాడై
కర్మయోగమును ఆరంభించు శ్రద్ధావంతుడు అత్యుత్తముడు. (8) నీ విధ్యుక్త ధర్మమును నీవు నిర్వర్తింపుము.
ఏలయన అది అకర్మ కన్నను ఉత్తమమైనది. కర్మ ఒనరింపకుండా దేహపోషణమును సైతము మనుజుడు
చేసికొనజాలడు. (9) విష్ణువు కొరకై యజ్ఞరూపమున కర్మ ఒనరింపవలెను. లేనిచో భౌతిక జగమున కర్మ బంధ
కారకము కాగలదు. కావున ఓ కుంతీపుత్రా! నీ విధ్యుక్తధర్మములను అతని ప్రీత్యర్థమే కావింపుము. ఆ విధముగా
నీవు బంధము నుండి సదా ముక్తుడవై ఉండగలవు. (10) సృష్ట్యారంభమున సర్వజీవులకు ప్రభువైన భగవానుడు
మానవులను మరియు దేవతలను విష్ణుప్రీత్యర్థమైన యజ్ఞములతో సహా సృష్టించి "ఈ యజ్ఞములచే మీరు
సౌఖ్యవంతులు కండు. ఏలయన వీని ఆచరణము మీ సుఖజీవనమునకు మరియు ముక్తికి కావలసిన
సర్వమును ఒసంగును" అని ఆశీర్వదించెను. (11) యజ్ఞములచే సంతృప్తినొందిన దేవతలు మీకు ప్రియమును
కూర్చగలరు. ఆ విధముగా మానవులు మరియు దేవతల నడుమ కల పరస్పర సహకారముచే సర్వులకు శ్రేయస్సు
కలుగ గలదు. (12) వివిధ జీవనావశ్యకములను ఒనగూర్చు దేవతలు యజ్ఞముచే సంతృప్తినొంది మీకు
కావలసినవన్నియును ఒసంగుదురు. వాటిని ఆ దేవతలకు అర్పింపకయే తాను అనుభవించువాడు నిక్కముగా
చోరుడే అగును. (13) యజ్ఞమున అర్పింపబడిన ఆహారమును స్వీకరించుట వలన భగవద్భక్తులు సర్వవిధములైన
పాపముల నుండి ముక్తులగుదురు. తమ ప్రియము కొరకే ఆహారమును సిద్ధము చేసికొనువారు కేవలము
పాపమునే భుజింతురు. (14) జీవదేహములన్నియును వర్షము వలన ఉత్పన్నమైనట్టి ధాన్యముపై ఆధారపడి
జీవించును. వర్షములు యజ్ఞముచే కలుగగా, విహితకర్మము నుండి యజ్ఞము ఉద్భవించుచున్నది.
(15) నియమిత కర్మలు వేదములందు నిర్దేశింపబడగా, అట్టి వేదములు దేవదేవుని నుండి ప్రత్యక్షముగా
ప్రకటింపబడినవి. అందుచే సర్వవ్యాపకమైన పరబ్రహ్మము యజ్ఞకర్మలందు నిత్యముగా ప్రతిష్ఠితమై ఉండును.
(16) ఓ అర్జునా! ఈ విధముగా వేదములచే నిర్ణయింపబడిన యజ్ఞచక్రమును జీవితమున అనుసరింపనివాడు
నిక్కముగా పాపజీవనుడగును. కేవలము ఇంద్రియతృప్తి కొరకే జీవించుచు అట్టివాడు నిరర్థకముగా జీవనమును
గడుపును (17) కాని ఆత్మానుభవపూర్ణమైన జీవితముతో ఆత్మ యందే ఆనందమును గొనుచు, ఆత్మ యందే తృప్తుడై
పరిపూర్ణ సంతుష్టిని పొందినవానికి చేయవలసిన కర్మమేమియును లేదు. (18) ఆత్మానుభవమును పొందిన
మనుజుడు తన విధ్యుక్త ధర్మనిర్వహణము ద్వారా పొందవలసిన ప్రయోజనమేదియును ఉండదు. అయినను అట్టి కర్మను
నిర్వర్తింపకపోవుటకు కారణము కాని, ఇతర జీవులపై ఆధారపడవలసిన అవసరము కాని అతనికి ఉండదు.
(19) కనుక ప్రతి ఒక్కరు కర్మ ఫలముల యందు ఆసక్తిని గొనక తన విధియని భావించుచు కర్మ యందు
వర్తించ వలెను. ఏల అనగా అసంగత్వముతో కర్మ ఒనరించుట ద్వారా మనుజుడు పరమును పొందగలడు.
(20) జనకమహారాజు వంటి రాజులు కేవలము విధ్యుక్తధర్మములను నిర్వహించుట ద్వారానే సంపూర్ణత్వమును పొందిరి.
కావున జనసామాన్యమునకు బోధించు నిమిత్తమై నీవు కర్మను చేయుము. (21) మహనీయుడైన వ్యక్తి
ఎట్టి కార్యములను చేయునో వానినే సామాన్య జనులు అనుసరింతురు. తన ఆదర్శప్రాయ కర్మము ద్వారా దేనిని అతడు
ప్రమాణముగా నిర్ణయించునో దానినే లోకమంతయు అనుసరించును. (22) ఓ పార్థా! నాకు నిర్దేశింపబడిన కర్మము

ఏదియును లేదు. నేను కోరునదికాని, పొందవలసినదికాని ఏదియును లేకున్నను విహితకర్మల యందు నేను నియుక్తుడనై ఉన్నాను. (23) ఓ పార్థా! ఒకవేళ నేను విధ్యుక్తధర్మములను శ్రద్ధగా నిర్వహింపనిచో మనుజులు తప్పక నా మార్గమునే అనుసరింతురు. (24) విధ్యుక్తధర్మములను నేను నిర్వహింపనిచో లోకములన్నియును నాశనము పొందగలవు. అవాంఛనీయ ప్రజాబాహుళ్యమునకు నేను కారణుడనై తద్ద్వారా సర్వజీవుల శాంతిని నష్టపరచినవాడనగుదును.
(25) పామరులు ఫలములందు ఆసక్తిగలవారై తమ కర్మ ఒనరించునట్లు, విద్వాంసులైన వారు జనులను ధర్మమార్గమున వర్తింపచేయుటకై సంగరహితముగా కర్మ ఒనరింపవలెను. (26) విధ్యుక్తధర్మపు ఫలముల ఎడ ఆసక్తిని కలిగిన పామరుల మనస్సు కలతపడురీతిగా విద్వాంసుడు వారిని కర్మ యందు నిగ్రహింపరాదు. అందుకు భిన్నముగా అతడు భక్తి భావముతో కర్మ ఒనరించుచు వారిని వివిధకర్మలందు నియుక్తులను చేయవలెను. (27) మిథ్యాహంకారముచే మోహపరవశుడగు జీవాత్మ వాస్తవముగా ప్రకృతి త్రిగుణములచే నిర్వహింపబడు కర్మలకు తనను కర్తగా భావించును.
(29) ప్రకృతి గుణములచే మోహపరవశులైన మూఢులు భౌతికకర్మలందు సంపూర్ణముగా నియుక్తులై సంగత్వము పొందుదురు. కర్తయొక్క అజ్ఞాన కారణమున ఆ కర్మలు అధమములైనను జ్ఞానవంతుడు వారిని కలతపెట్టరాదు.
(28) ఓ మహాబాహో! పరతత్త్వజ్ఞానము కలిగినవాడు భక్తియుతకర్మము మరియు కామ్యకర్మల నడుమ గల భేదమును చక్కగా తెలిసి, ఇంద్రియములందును మరియు ఇంద్రియభోగములందును ఆసక్తుడు కాకుండును. (30) కావున ఓ అర్జునా! నన్ను గూర్చిన సంపూర్ణజ్ఞానము కలవాడవై ఫలాపేక్ష మరియు మమత్వములను వీడి, కర్మలన్నియు నాకు అర్పించి మాంద్యమును వీడి యుద్ధము చేయుము. (31) నా ఆజ్ఞానుసారము తమ కర్మలను నిర్వహించుచు శ్రద్ధతో ఈ ఉపదేశమును అసూయారహితులై అనుసరించువారు కామ్యకర్మబంధములనుండి విడివడగలరు. (32) కాని అసూయతో ఈ ఉపదేశములను మన్నింపక అనుసరింపనివారలు జ్ఞానరహితులుగను, మూఢులుగను, సంపూర్ణత్వమును పొందు యత్నములో నాశనము పొందినవారుగను భావింపబడుదురు. (33) జ్ఞానవంతుడైన మనుజుడు సైతము తన గుణము ననుసరించియే కర్మ ఒనరించును. ఏలయన ప్రతి ఒక్కరు త్రిగుణములనుండి తాము పొందిన స్వభావమునే అనుసరింతురు. అట్టి ఎడ నిగ్రహమేమి చేయగలదు? (34) ఇంద్రియములు మరియు ఇంద్రియార్థముల ఎడ కలుగు రాగద్వేషములను నియమించుటకు కొన్ని నియమములు కలవు. ఆత్మానుభవ మార్గమున ఆ రాగద్వేషములు ఆటంకములు వంటివి కావున వాటికి ఎవ్వరును వశము కాకూడదు. (35) పరధర్మమును చక్కగా నిర్వహించుట కన్నను గుణరహితమైనను స్వధర్మమును ఆచరించుట ఉత్తమము. పరధర్మపాలనము హానికరమైనది కావున దానిని పాటించుట కన్నను స్వధర్మపాలనము నందు నాశనమును పొందుట యైనను ఉత్తమమైనదే! (36) అర్జునుడు పలికెను:
ఓ వృష్ణివంశసంజాతుడా! అనిష్టముగానైనను బలవంతముగా నియుక్తమైనవానివలె మనుజుడు దేనిచే పాపకర్మలను చేయుట యందు ప్రేరేపింపబడుచున్నాడు? (37) శ్రీకృష్ణభగవానుడు పలికెను: అర్జునా! రజోగుణసంపర్కముచే ఉద్భవించి, తదుపరి క్రోధముగా పరిణమించు కామమే దానికి కారణము. అదియే ఈ ప్రపంచమునకు సర్వము కబళించునట్టి పాపభూయిష్ఠ శత్రువు. (38) పొగ చేత అగ్ని, ధూళి చేత అద్దము, మావి చేత గర్భము కప్పబడినట్లు కామము యొక్క వివిధ దశలచే జీవుడు కప్పబడి ఉండును. (39) ఈ విధముగా జ్ఞానవంతుడైన జీవుని శుద్ధచైతన్యము ఎన్నడును తృప్తి చెందనిదియు మరియు అగ్నివలె దహించునది యైన కామమనెడి నిత్యవైరిచే ఆవరింపబడును.
(40) ఇంద్రియములు, మనస్సు, బుద్ధి అనునవి ఈ కామము నివసించు స్థానములు. వాని ద్వారా కామము జీవుని నిజ జ్ఞానమును ఆవరించి అతనిని మోహింపచేయును. (41) కావున భరతవంశీయులలో శ్రేష్ఠుడవైన ఓ అర్జునా!

ఇంద్రియ నిగ్రహము ద్వారా పాప చిహ్నమైన ఈ కామమును మొట్టమొదటనే అదుపుచేసి, జ్ఞానము ద్వారా
పాప చిహ్నమైన ఈ కామమును మరియు ఆత్మానుభవములను నాశనము చేయునట్టి అద్దానిని నశింపచేయుము.
(42) జడపదార్థము కన్నను ఇంద్రియములు ఉత్తమములు; ఇంద్రియముల కన్నను మనస్సు ఉత్తమము! మనస్సు
కన్నను బుద్ధి మరింత ఉత్తమము; బుద్ధి కన్నను ఆత్మ అత్యంత ఉత్తమము. (43) ఓ గొప్ప బాహువులు గల అర్జునా!
ఈ విధముగా తనను ఇంద్రియ, మనో బుద్ధులకు పరమైనవానిగా తెలిసికొని, ఆధ్యాత్మిక బుద్ధిచే మనస్సును
స్థిరపరచి, ఈ విధముగా ఆధ్యాత్మిక బలముచే మనుజుడు కామమనెడి ఈ దుర్జయమైన శత్రువును జయింపవలెను.

4. దివ్యజ్ఞానము

(1) శ్రీకృష్ణభగవానుడు పలికెను: అవ్యయమైన ఈ యోగశాస్త్రమును నేను వివస్వానునకు ఉపదేశించితిని.
వివస్వానుడు దానిని మానవులకు పితయైన మనువునకు ఉపదేశించగా, మనువు దానిని ఇక్ష్వాకునకు ఉపదేశించెను.
(2) ఈ దివ్యజ్ఞానము ఈ విధముగా గురుశిష్యపరంపరా రూపమున స్వీకరించబడినది. రాజర్షులు దానిని ఆ రీతి
అవగతము చేసికొనిరి. కాని కాలక్రమమున పరంపర విచ్ఛిన్నమగుట వలన ఆ జ్ఞానము నశించినట్లుగా కనిపించుచున్నది.
(3) నీవు నా భక్తుడవు మరియు స్నేహితుడవు కావున ఈ శాస్త్రపు ఉత్తమమైన రహస్యమును అర్థము చేసికొనగలవని
భగవానునితో గల సంబంధమును తెలియచేయు పురాతన శాస్త్రమును నేడు నీకు తెలుపుచున్నాను.
(4) అర్జునుడు పలికెను: సూర్యదేవుడైన వివస్వానుడు జన్మచే నీ కన్నను పూర్వుడు. అట్టియెడ ఆదిలో నీవే జ్ఞానమును
అతనికి ఉపదేశించితివనుటను నేనెట్లు అర్థము చేసికొనగలను? (5) శ్రీకృష్ణభగవానుడు పలికెను: ఓ పరంతపా! నీకును
మరియు నాకును పలుజన్మలు గడచినవి. నాకు అవన్నియును జ్ఞప్తి అందున్నవి. కాని నీవు వానిని జ్ఞప్తి అందుంచు
కొనజాలవు (6) జన్మ లేనివాడనైనను, నా దివ్యదేహము ఎన్నడును నశింపనిదైనను, సకల జీవులకు ప్రభువునైనను
ఆదిరూపమైన దివ్యరూపముతో నేను ప్రతియుగము నందును అవతరింతును (7) ఓ భరతవంశీయుడా! ఎప్పుడెప్పుడు
మరియు ఎచ్చటెచ్చట ధర్మమునకు హాని కలుగునో మరియు అధర్మము వృద్ధినొందునో ఆ సమయమున నేను
అవతరింతును. (8) సాధువులను రక్షించుటకు, దుర్మార్గులను నశింపచేయుటకు మరియు ధర్మమును
పునఃస్థాపించుటకు ప్రతియుగమునందును నేను అవతరించుచుందును (9) ఓ అర్జునా నా జన్మము మరియు కర్మల
దివ్యత్వము నెరిగినవాడు శరీరత్యాగము పిమ్మట తిరిగి ఈ భౌతిక జగమున జన్మింపక నా శాశ్వతమైన ధామమునే
పొందగలడు. (10) రాగము, భయము, క్రోధము నుండి విడివడి, నా యందు సంపూర్ణముగా మగ్నులై నాకు శరణుజొచ్చిన
కారణముగా పూర్వము పలువురు నా ఒక్క జ్ఞానముచే పవిత్రులై నా దివ్య ప్రేమను పొందగలిగిరి (11) ఎవరు ఏ విధముగా
నన్ను శరణువేడుదురో వారిని ఆ విధముగా నేను అనుగ్రహింతును. ఓ పార్థా! ప్రతి ఒక్కరు అన్ని విధములా నా మార్గమునే
అనుసరింతురు. (12) లోకమున జనులు కామ్యకర్మల యందు జయమును కోరు కారణముగా దేవతలను పూజింతురు.
ఈ జగమునందు వారు కామ్యకర్మలకు శీఘ్రముగా ఫలమును పొందుచున్నారు. (13) ప్రకృతి త్రిగుణములు మరియు
తత్సంబంధిత కర్మల ననుసరించి మానవసంఘమునందలి చాతుర్వర్ణములు నాచే సృష్టింపబడినవి. ఈ విధానమునకు
నేనే కర్తనైనను అవ్యయుడనగుటచే అకర్తగానే నన్ను నీవు తెలిసికొనుము. (14) నన్ను ఏ కర్మయు ప్రభావితము
చేయజాలదు; ఎట్టి కర్మఫలమును ఆశింపను. నన్ను గూర్చిన ఈ సత్యము ఎరిగినవాడు సైతము కర్మఫలములచే
బంధింపబడడు. (15) పూర్వకాలమున ముక్తపురుషులందరును నా దివ్యతత్త్వపు ఈ అవగాహనతోనే కర్మలను

ఒనరించిరి. కావున నీవు కూడా వారిని అనుసరించుచు నీ కర్మ ఒనరింపుము. (16) కర్మ అనగా నేమో మరియు అకర్మ అనగా నేమో నిర్ణయించుట అందు బుద్ధిమంతులు సైతము భ్రాంతినొంది ఉన్నారు. కర్మ అనగా నేమో ఇప్పుడు నేను వివరింతును. దానిని తెలిసికొని నీవు అన్ని అశుభముల నుండి ముక్తుడవు కాగలవు. (17) కర్మగతులను అవగాహన చేసికొనుట అత్యంత కష్టము కనుక కర్మ అననేమో, వికర్మ అననేమో, అకర్మ అననేమో ప్రతి ఒక్కరు చక్కగా ఎరుగవలెను. (18) కర్మ అందు అకర్మను మరియు అకర్మ అందు కర్మను గాంచువాడు మనుజులలో బుద్ధిమంతుడు. అట్టివాడు అన్ని రకముల కర్మలందు నియుక్తుడైనను దివ్యస్థితి అందున్నవాడే అగును. (19) ఎవని ప్రతికర్మయు భోగవాంఛారహితముగా నుండునో అతడు సంపూర్ణ జ్ఞానము కలిగినట్టివాడు. కర్మఫలములన్నీ జ్ఞానాగ్నిచే దగ్ధమైనవిగా అతడు బుధులచే చెప్పబడును. (20) కర్మఫలముల ఎడ ఆసక్తిని విడచి నిత్యతృప్తుడును నిరాశ్రయుడును ఐ ఉండెడివాడు అన్ని రకములగు కర్మలందు నియుక్తుడైనను కామ్యకర్మలు చేయనివాడే అగును. (21) అట్టి అవగాహన కలిగిన మనుజుడు నియమిత మనోబుద్ధులచే తనకున్న వానిపై స్వామ్యభావనను విడచి, కేవలము జీవనావసరముల కొరకే కర్మ ఒనరించును. ఆ విధముగా వర్తించుచు అతడు పాపఫలములచే ప్రభావితుడు కాకుండును. (22) యాదృచ్ఛికముగా లభించిన దానితో సంతుష్టుడగువాడును, ద్వంద్వాతీతుడును, అసూయలేనివాడును, జయాపజయములందు స్థిరుడై ఉండెడివాడును అగు మనుజుడు కర్మలను ఒనరించుచున్నను ఎన్నడును బంధితుడు కాడు. (23) ప్రకృతి త్రిగుణముల ఎడ అసంగుడై దివ్యజ్ఞానమునందు సంపూర్ణముగా స్థితుడైన మనుజుని సర్వకర్మలు దివ్యత్వమునందే పూర్తిగా లీనమగును. (24) ఆధ్యాత్మిక రసభావన అందు సంపూర్ణముగా నిమగ్నుడైన మనుజుడు భగవద్ధామమును తప్పక పొందితీరును. స్వీకరించునది మరియు అర్పింపబడునది అను రెండును బ్రహ్మమే అయినటువంటి ఆధ్యాత్మికకర్మలందు అతడు తత్పరుడై ఉండుటయే అందుకు కారణము. (25) కొందరు యోగులు వివిధ యజ్ఞముల ద్వారా దేవతలను లెస్సగా పూజింతురు. మరికొందరు పరబ్రహ్మమనెడి అగ్ని అందు హోమమును చేయుదురు. (26) కొందరు శ్రవణాది కార్యములను ఇంకా ఇంద్రియములను మనోనిగ్రహమనెడి అగ్ని అందు హోమము చేయగా, మరికొందరు ఇంద్రియార్థములను ఇంద్రియములనెడి అగ్ని అందు అర్పింతురు. (27) ఇంద్రియ, మనోనియమము ద్వారా ఆత్మానుభవమును సాధించగోరు ఇంకొందరు ఇంద్రియకర్మలను ఇంకా ప్రాణవాయుకర్మలను మనోనియమమనెడి అగ్ని అందు ఆహుతులుగా అర్పింతురు. (28) కఠిన వ్రతములను చేపట్టి కొందరు తమ సంపత్తిని అర్పించుట ద్వారా ఇంకొందరు తీవ్రతపస్సులను చేయుట ద్వారా, అష్టాంగయోగ పద్ధతిని పాటించుట ద్వారా లేదా దివ్యజ్ఞానపురోగతికై వేదాధ్యయనము ఒనరించుట ద్వారా జ్ఞానవంతులగుదురు. (29) ప్రాణాయామము ద్వారా సమాధి అందు నిలువగోరు ఇంకొందరు ప్రాణమును అపానమునందు ఇంకా అపానమును ప్రాణమునందు అర్పింప యత్నించి, శ్వాసను సంపూర్ణముగా బంధించి, అంత్యమున సమాధిమగ్నులగుదురు. ఇంకొందరు ఆహారమును నియమించి ప్రాణవాయువును ప్రాణవాయువునందే యజ్ఞముగా అర్పింతురు. (30) యజ్ఞప్రయోజనము ఎరిగిన ఈ కర్తలందరును పాపఫలముల నుండి శుద్ధిపడి యజ్ఞఫలమనెడి అమృతమును ఆస్వాదించినందున నిత్యమైన భగవద్ధామము వైపుకు పురోగమింతురు. (31) ఓ కురువంశ శ్రేష్ఠుడా! యజ్ఞమును నిర్వహించకుండా ఎవ్వరును ఈ లోకమునగాని, ఈ జన్మమునందు కాని ఆనందముగా జీవింపలేరు. అట్టి ఎడ తరువాతి జన్మను గూర్చి వేరుగా చెప్పనేల? (32) ఈ వివిధ యజ్ఞములన్నియును వేదములచే ఆమోదింపబడినవి ఇంకా అవన్నియు వివిధకర్మల నుండి ఉద్భవించినవి. వానిని యథార్థరూపములో ఎరుగుట ద్వారా నీవు ముక్తిని పొందగలవు. (33) ఓ పరంతపా! జ్ఞానయజ్ఞము ద్రవ్యమయ

యజ్ఞము కన్నా మహత్తరమైనది. ఓ పార్థా! కర్మయజ్ఞములు అన్నీ చివరికి దివ్యజ్ఞానమునందే పరిసమాప్తి నొందును.
(34) గురువు దరిచేరి సత్యము ఎరుగుట కొరకై యత్నింపుము. వినయముతో ప్రశ్నలు వేసి సేవను కూర్చుము.
ఆత్మదర్శులు తత్త్వదర్శనము చేసినవారగుటచే నీకు జ్ఞానమును ఉపదేశింతురు. (35) ఆత్మదర్శులైన మహాత్ముని నుండి
నిజమైన జ్ఞానమును పొందినప్పుడు ఆ జ్ఞానముచే సమస్తజీవులు పరమాత్ముని అంశలని, అనగా నాకు సంబంధించిన
వారని గాంచగలుగుటచే నీవు తిరిగి ఎన్నడును ఇట్టి మోహమునకు గురికావు (36) ఒకవేళ నీవు పాపులందరిలోను
పరమపాపిగా భావింపబడినను దివ్యజ్ఞానమనెడి పడవయందు స్థితుడవైనచో దుఃఖసముద్రమును దాటగలవు.
(37) ఓ అర్జునా! మండుచున్న అగ్ని కట్టెలను బూడిదగా చేయునట్లు, జ్ఞానాగ్ని భౌతిక కర్మఫలములు అన్నింటిని
బూడిదగా చేసివేయును. (38) ఈ జగమునందు ఆధ్యాత్మిక జ్ఞానము వలె పవిత్రమైనది ఇంకా మహోన్నతమైనది
వేరొక్కటి లేదు. సకల యోగముల పక్వఫలమైన ఆ జ్ఞానమును భక్తియోగాభ్యాసమునందు పరిపక్వతను
సాధించినవాడు కాలక్రమమున తనయందే అనుభవించును. (39) దివ్యజ్ఞానతత్పరుడైన శ్రద్ధావంతుడు
ఇంద్రియములను నిగ్రహించి అట్టి ఆధ్యాత్మిక జ్ఞానమును పొందుటకు అర్హుడగును. దానిని సాధించి అతడు
శీఘ్రముగా పరమశాంతిని పొందును. (40) శాస్త్రములను శంకించు అజ్ఞానులు ఇంకా శ్రద్ధారహితులు
భగవత్ జ్ఞానమును పొందలేక పతనము చెందుదురు. సంశయాత్ములైనవారికి ఈ లోకమున కాని, పరలోకమున కాని
సుఖము లేదు. (41) కర్మఫలములన్నింటిని త్యజించి భక్తియోగమునందు వర్తించుచు దివ్యజ్ఞానముచే సందేహములను
నశించి ఉన్నవాడు వాస్తవముగా ఆత్మ అందే స్థితుడైనట్టివాడు. ఓ ధనంజయా! ఆ విధముగా అతడు కర్మఫలములచే
బంధితుడు కాడు. (42) కావున అజ్ఞానము వలన హృదయమునందు కలిగిన సంశయములను జ్ఞానఖడ్గముచే ఛేదించి
వేయుము. ఓ భారతా! యోగసమన్వితుడవై యుద్ధము చేయుటకు లెమ్ము!

5. కర్మ యోగము

(1) అర్జునుడు పలికెను: ఓ కృష్ణా! తొలుత నన్ను కర్మత్యాగము చేయుమని చెప్పి తిరిగి భక్తియుత కర్మను ఉపదేశించు
చున్నావు. ఈ రెండింటిలో ఏది ఎక్కువ శ్రేయోదాయకమో దయతో నాకు నిశ్చయముగా తెలియచేయుము.
(2) శ్రీకృష్ణభగవానుడు పలికెను: కర్మ పరిత్యాగము మరియు భక్తితో కూడిన కర్మము రెండును ముక్తికి
శ్రేయోదాయకములే. కాని ఆ రెండింటిలో కర్మపరిత్యాగము కన్నను భక్తియుత కర్మ ఉత్తమమైనది.
(3) కర్మఫలములను ద్వేషించుటగాని, కోరుట గాని చేయనివాడు నిత్యసన్న్యాసిగా తెలియబడును. ఓ మహాబాహువైన
అర్జునా! ద్వంద్వముల నుండి విడివడి ఉండు అట్టివాడు లౌకిక బంధములను సులభముగా దాటి సంపూర్ణముగా
ముక్తుడు కాగలడు. (4) కేవలము అజ్ఞానులే భక్తియోగమును భౌతిక జగత్తుయొక్క విశ్లేషణాత్మక
అధ్యయనమునకు భిన్నమైనదిగా పలుకుదురు. కాని ఈ రెండు మార్గములలో ఏ ఒక్కదానిని సమగ్రముగా
అనుసరించినను రెండింటి ఫలములను మనుజుడు పొందగలడని పండితులు చెప్పుదురు. (5) సాంఖ్యము ద్వారా
పొందబడు స్థానమును భక్తియోగము ద్వారాను పొందవచ్చునని ఎరిగి, తత్కారణముగా భక్తియోగము
మరియు సాంఖ్యములను ఏకస్థాయిలో ఉన్నవానిగా గాంచువాడు యథార్థదృష్టి కలిగినవాడగును.
(6) భక్తియుతసేవ యందు నియుక్తుడు కాకుండా కేవలము కర్మలను త్యజించుట ద్వారా ఎవ్వరును సుఖమును
పొందలేరు. కాని భక్తియోగమునందు నియుక్తుడైన మననశీలుడు పరబ్రహ్మమును శీఘ్రముగా పొందగలడు.

(7) భక్తియోగములో కర్మ ఒనరించువాడును, విశుద్ధాత్ముడును, ఇంద్రియ, మనస్సులను జయించిన వాడును అగు మనుజుడు సర్వులకు ప్రియుడై ఉండును. సర్వుల ఎడ అతడు ప్రేమను కలిగి ఉండును. అట్టివాడు సదా కర్మల నాచరించుచున్నను ఎన్నడును బద్ధుడు కాడు. (8-9) దివ్యచైతన్యయుక్తుడైనవాడు చూచుట, వినుట, తాకుట, వాసన చూచుట, భుజించుట, కదులుట, నిద్రించుట, శ్వాసించుట వంటివి చేయుచున్నను తాను వాస్తవముగా ఏదియును చేయనట్లుగా ఎరిగి ఉండును. ఏలయన మాట్లాడునప్పుడు, గ్రహించునప్పుడు, విసర్జించునప్పుడు, కనులు తెరచుట లేక మూయుట జరుగునప్పుడు ఆయా ఇంద్రియములు ఇంద్రియార్థములలో వర్తించుచున్నవని మరియు తాను వాని నుండి దూరముగా ఉంటిననియు అతడు సదా ఎరిగి ఉండును. (10) ఫలములన్నింటిని భగవానునకు అర్పించి సంగత్వము లేకుండా తన ధర్మమును నిర్వహించువాడు తామరాకు నీటిచే అంటబడనట్లుగా పాపకర్మలచే ప్రభావితుడు కాడు (11) యోగులైనవారు సంగత్వమును విడచి ఆత్మశుద్ధి అను ప్రయోజనము కొరకు మాత్రమే దేహము తోడను, మనస్సు తోడను, బుద్ధి తోడను ఇంకా ఇంద్రియములు తోడను కర్మ ఒనరింతురు.

(12) స్థిరమైన భక్తిని కలిగినవాడు సర్వకర్మఫలములను నాకు అర్పించుటచే నిర్మలమైన శాంతిని పొందును. కాని భగవద్భావనము లేనివాడును మరియు తన కర్మఫలముల ఆసక్తిని కలిగి ఉన్నవాడును అగు మనుజుడు బద్ధుడగును. (13) దేహమునందున్న జీవుడు తన స్వభావమును నియమించి మానసికముగా కర్మలన్నింటిని త్యజించినప్పుడు, కర్మను చేయక ఇంకా కర్మకు కారణము కాక నవద్వారపురము నందు సుఖముగా వసించును.

(14) తన దేహమనెడి పురము ఒక్క అధిపతి ఐన దేహి కర్మలను సృష్టించుటగాని, కర్మలందు జనులను ప్రేరేపించుట కాని, కర్మఫలములను సృష్టించుటగాని చేయడు. ఇది అంతా ప్రకృతి త్రిగుణముల చేతనే చేయబడుచున్నది.

(15) భగవానుడు ఎవరి పాపమును కాని, పుణ్యమును కాని గ్రహింపడు, ఐనను జీవులు వారి నిజజ్ఞానమును ఆవరించెడి అజ్ఞానముచే మోహము నొందుదురు. (16) అజ్ఞానమును నశింపచేయు జ్ఞానముచే మనుజుడు ప్రకాశవంతుడైనప్పుడు, పగటి సమయమున సూర్యుడు సర్వమును ప్రకాశింపచేయునట్లు, అతని జ్ఞానము సర్వమును వ్యక్తపరచును. (17) బుద్ధి, మనస్సు, నిష్ఠ, ఆశ్రయములన్నియును భగవానుని అందే లగ్నమైనపుడు మనుజుడు సంపూర్ణ జ్ఞానముచే కల్మష రహితుడై నేరుగా ముక్తి మార్గమున ప్రయాణించును (18) వినమ్రులైన యోగులు యథార్థమైన జ్ఞానము కలిగిన వారగుటచే విద్యావినయ సంపన్నుడైన బ్రాహ్మణుని, గోవును, ఏనుగును, శునకమును, శునకమాంసము తినువానిని సమదృష్టితో వీక్షింతురు (19) సమానత్వము మరియు ఏకత్వములందు మనస్సు నెలకొని నట్టివారు జననమరణస్థితిని జయించినట్టివారే. వారు బ్రహ్మము వలె దోషరహితులైనట్టి వారు. ఆ విధముగా వారు బ్రహ్మమునందు స్థితిని కలిగినట్టివారే అగుదురు. (20) ప్రియమైనది పొందినప్పుడు ఉప్పొంగక అప్రియమైనది ప్రాప్తించినపుడు ఉద్విగ్నత నొందనివాడును, స్థిరబుద్ధిని కలిగినవాడును, మోహపరవశుడు కానివాడును, భగవద్విజ్ఞానమును పూర్ణముగా ఎరిగినవాడును అగు మనుజుడు పరబ్రహ్మమునందు స్థితిని కలిగి ఉన్నట్టివాడే అగును.

(21) అట్టి ముక్తపురుషుడు బాహ్యేంద్రియ సుఖమునకు ఆకర్షితుడు కాక ఆత్మ అందే సౌఖ్యమనుభవించును సదా ధ్యాన మగ్నుడై ఉండును. పరబ్రహ్మమును ధ్యానించు కారణమున ఆత్మదర్శి ఆ విధముగా అనంత సౌఖ్యము అనుభవించును.

(22) బుద్ధిమంతుడైనవాడు ఇంద్రియ సంపర్కముచే కలుగు దుఃఖకారణములందు పాల్గొనడు. ఓ కౌంతేయ! ఆ సుఖములు ఆద్యంతములను కలిగి ఉన్నందువలన తెలివికలవాడు వాని అందు ప్రియమును పొందడు.

(23) దేహమును విడచుటకు పూర్వమే ఇంద్రియముల కోరికలను అదుపు చేయగలిగిన వాడు, కామక్రోధవేగమును

అణచకలిగినవాడు దివ్యస్థితి అందున్నట్టివాడై ఈ జగమునందు సుఖవంతుడగును (24) అంతరంగమందే ఆనందమును
కలిగినవాడును, ఉత్సాహవంతుడై అంతరంగమందే రమించువాడును, అంతరంగమందే లక్ష్యమును కలిగినవాడును అగు
మనుజుడే వాస్తవముగా పూర్ణుడగు యోగి అనబడును. బ్రహ్మభూతుడైన అట్టివాడు అంత్యమున పరబ్రహ్మమునే
పొందగలడు. (25) అంతరంగమందే మనస్సు సంలగ్నమై సందేహముల నుండి ఉత్పన్నమైనట్టి ద్వంద్వములకు పరమైనవారును,
సర్వజీవహితము కొరకే పనిచేయువారును, సర్వపాపదూరులైనవారును అగు ఋషులే బ్రహ్మనిర్వాణమును పొందుదురు.
(26) కామక్రోధముల నుండి విడివడినవారును, ఆత్మదర్శులును, ఆత్మసంయమనము కలిగినవారును, సంపూర్ణత్వము కొరకు
నిరంతరము యత్నించువారును అగు మహాత్ములు అచిరకాలములోనే బ్రహ్మనిర్వాణమును నిశ్చయముగా పొందుదురు.
(27-28) బాహ్యేంద్రియములన్నింటిని త్యజించి, దృష్టిని భ్రూమధ్యమున నిలిపి, ప్రాణాపాన వాయువులను నాసిక అందే సమములుగా
చేసి తద్ద్వారా మనస్సును, బుద్ధిని, ఇంద్రియములను అదుపు చేయునట్టి మోక్షవాంఛితుడు కోరిక, భయము, క్రోధముల నుండి
ముక్తుడగును. అట్టి స్థితిలో సదా నిలిచి ఉండువాడు నిశ్చయముగా ముక్తిని పొందగలడు. (29) నా సంపూర్ణ భావన యందున్నవాడు
నన్ను సర్వయజ్ఞములకు తపస్సులకు చరమ భోక్తగను, సకల లోకములకు దేవతలకు ప్రభువుగను, సకలజీవులకు లాభము
కూర్చువానిగను మరియు శ్రేయోభిలాషిగను తెలిసికొని భౌతికదుఃఖముల నుండి విడివడి పరమశాంతిని పొందును.

6. ధ్యాన యోగము

(1) శ్రీకృష్ణభగవానుడు పలికెను: కర్మఫలముల ఎడ ఆసక్తిని లేక చేయవలసిన కార్యములను నిర్వహించువాడే సన్న్యాసి కాగలడు.
అతడే నిజమైన యోగి. అంతేకాని కేవలము అగ్నిని రగిలింపక మరియు కర్మలను చేయకుండెడివాడు యోగి కాజాలడు.
(2) ఏది సన్న్యాసమని పిలువబడునో దానిని యోగమనియు నీవు తెలిసికొనుము. ఓ పాండుకుమారా! ఇంద్రియప్రీతి కోరికను
త్యాగము చేయనిదే ఎవ్వడును యోగి కాజాలడు. (3) అష్టాంగయోగ పద్ధతి అందు ఆరంభస్థితిలో ఉన్న యోగికి కర్మము సాధనముగా
చెప్పబడగా, యోగము నందు సిద్ధిని పొందినవానికి భౌతికకర్మల విరమణ సాధనముగా చెప్పబడినది. (4) విషయ కోరికలన్నింటిని
విడిచి ఇంద్రియప్రీతి కొరకు వర్తించుట కాని, కామ్యకర్మలందు నియుక్తుడగుట కాని చేయని మనుజుడు యోగారూఢుడని
చెప్పబడును. (5) ప్రతి ఒక్కరు తన మనస్సు ఒక్క సహాయముచే తనను తాను ఉద్ధరించుకొనవలెను కాని అధోగతిపాలు
చేసికొనరాదు. బద్ధజీవునికి మనస్సు అనునది మిత్రుడును, అలాగుననే శత్రువును ఐ ఉన్నది. (6) మనస్సును జయించినవానికి
మనస్సే ఉత్తమమిత్రుడు. కాని అట్లు చేయలేనివానికి అతని మనస్సు గొప్ప శత్రువుగా వర్తించును. (7) మనస్సును
జయించినవాడు శాంతిని పొంది ఉండుటచే పరమాత్మను చేరినట్టివాడే అగును. అట్టి మనుజునకు సుఖదుఃఖములు,
శీతోష్ణములు, మానావమానములు అన్నియును సమానములే ఐ ఉన్నవి. (8) మనుజుడు తాను పొందినటువంటి జ్ఞాన,
విజ్ఞానములచే సంపూర్ణముగా సంతృప్తి చెందినప్పుడు ఆత్మానుభవమునందు స్థితిని పొందినట్టివాడై యోగి అనబడును.
అట్టివాడు ఆధ్యాత్మికస్థితి అందు నెలకొని ఆత్మనిగ్రహమును కలిగి ఉండును. అతడు గులకరాళ్లనైనను, రాళ్లనైనను లేదా
బంగారమునైనను సమానముగా చూచును. (9) శ్రేయోభిలాషులను, ప్రియమైన మిత్రులను, తటస్థులను, మధ్యవర్తులను,
ద్వేషించువారలను, శత్రుమిత్రులను, పాపపుణ్యాలను సమబుద్ధితో చూచువాడు మరింత పురోభివృద్ధి నొందినవానిగా
పరిగణింపబడును. (10) యోగి ఐనవాడు తన దేహమును, మనస్సును, ఆత్మను సదా భగవానుని సంబంధములోనే
నియుక్తము చేసి, ఒంటరిగా ఏకాంతస్థలమునందు నివసించుచు సావధానముగా మనస్సును నియమింపవలెను.
అతడు కోరికల నుండి ఇంకా సమస్తమును కలిగి ఉండవలెనను భావనల నుండి ముక్తుడై ఉండవలెను.

(11-12) యోగాభ్యాసము కొరకు యోగి ఏకాంతస్థలమునకేగి నేలపై కుశగ్రాసమును పరచి, దానిని జింకచర్మము మరియు
వస్త్రముతో కప్పవలెను. అట్టి ఆసనము అతి ఎత్తుగాను లేదా అతిక్రిందుగాను ఉండక పవిత్రస్థానములో ఏర్పాటు కావలెను.
పిదప అతడు దానిపై స్థిరముగా కూర్చుండి ఇంద్రియమనోకర్మలను నియమించి, మనస్సును ఏకాగ్రపరచి హృదయశుద్ధి
కొరకు యోగము నభ్యసించవలెను. (13-14) శరీరమును, మెడను, శిరమును చక్కగా సమముగా నిలిపి దృష్టిని
నాసికాగ్రముపై కేంద్రీకరించవలెను. ఆ విధముగా కలతనొందనట్టి నియమిత మనస్సుతో, భయమును వీడి,
బ్రహ్మచర్యమును పాటించుచు యోగి యైనవాడు నన్నే హృదయమునందు ధ్యానించుచు నన్నే జీవితపరమగతిగా
చేసికొనవలెను. (15) దేహము, మనస్సు, కర్మలను ఈ విధముగా నిరంతరము నియమించుచు యోగి యైనవాడు నియమిత
మనస్సు కలవాడై భౌతికస్థితి నుండి విరమించుట ద్వారా భగవద్రాజ్యమును పొందును. (16) ఓ అర్జునా! అతిగా భుజించువానికి
లేదా అతి తక్కువ తినువానికి, అతిగా నిద్రించువానికి లేదా తగినంత నిద్రలేనివానికి యోగి అగుటకు అవకాశము లేదు.
(17) నియమితములైన ఆహారము, నిద్ర, విహారము, కర్మములు కలవాడు యోగాభ్యాసము ద్వారా భౌతికక్లేశములను
శమింపచేసికొనగలడు. (18) యోగాభ్యాసము ద్వారా యోగి తన మనోకర్మలన్నింటిని నియమించి, విషయకోరికల రహితమైన
ఆధ్యాత్మికస్థితి యందు నిలిచినపుడు యోగమునందు స్థిరుడైనట్లుగా చెప్పబడును. (19) గాలిలేని చోట దీపము నిశ్చలముగా
ఉండురీతి, నిగ్రహింపబడిన మనస్సుగల యోగి తన పరతత్త్వధ్యానమున సదా స్థిరుడై ఉండును. (20-23) సమాధి అనే
పూర్ణత్వస్థితిలో మనుజుని మనస్సు సమస్త మానసిక కలాపముల నుండి యోగాభ్యాసము చేత నిరోధింపబడి ఉండును.
శుద్ధమైన మనస్సుతో ఆత్మను వీక్షింపగలుగుట మరియు ఆత్మ యందే ఆనందమును, సుఖమును అనుభవింపగలుగుట
అను విషయమున మనుజుని సమర్థతను బట్టి అట్టి పూర్ణత్వస్థితిని నిర్ధారింపవచ్చును. అట్టి ఆనందమయస్థితిలో
పవిత్రమైన ఇంద్రియముల ద్వారా అనుభవమునకు వచ్చు అపరిమిత దివ్యానందములో మనుజుడు స్థితిని
పొంది ఉండును. ఆ విధముగా స్థితుడైన అతడు సత్యము నుండి వైదొలగక, దానికి మించిన వేరొక అధికలాభము
లేదని భావించును. అట్టి స్థితిలో నిలిచినవాడు గొప్పకష్టము నందైనను చలింపక ఉండును. భౌతిక సంపర్కముచే
ఉత్పన్నమగు సమస్త దుఃఖముల నుండి వాస్తవమైన ముక్తి ఇదియే. (24) స్థిరనిశ్చయముతో శ్రద్ధను కలిగి యోగము
అభ్యసించుచు మనుజుడు ఆ మార్గము నుండి వైదొలగక ఉండవలెను. మానసికకల్పనల నుండి ఉత్పన్నమైన
విషయకోరికల అన్నింటిని ఎటువంటి మినహాయింపు లేకుండా త్యజించి, అతడు మనస్సు ద్వారా ఇంద్రియములను
అన్ని వైపుల నుండి నియమింపవలెను. (25) నిశ్చయమైన బుద్ధితో క్రమముగా నెమ్మది నెమ్మదిగా మనుజుడు
సమాధిమగ్నుడు కావలెను. ఆ విధముగా మనస్సును ఆత్మ యందే నిలిపి అతడు ఇక దేనిని గూర్చి చింతింపరాదు.
(26) చంచలత్వము మరియు అస్థిరత్వము కారణమున మనస్సు ఎచ్చట పరిభ్రమించినను మనుజుడు దానిని
అచ్చట నుండి తప్పక నిగ్రహించి ఆత్మవశమునకు తేవలెను. (27) నా యందు మనస్సు లగ్నమైన యోగి తప్పక
ఆధ్యాత్మికానందపు అత్యున్నత పూర్ణత్వమును పొందును. రజోగుణమునకు పరముగానుండు అతడు పరబ్రహ్మముతో
తనకుగల గుణరీతి ఏకత్వము ఎరిగి పూర్వకర్మఫలములన్నింటి నుండి ముక్తుడగును. (29) నిజమైన యోగి నన్ను
సర్వజీవుల యందును ఇంకా సర్వజీవులను నా యందును చూచును. ఆత్మదర్శియైనట్టి వాడు దేవదేవుడనైన నన్నే
నిక్కముగా సర్వత్రా చూచును (30) నన్ను సర్వత్రా వీక్షించువానికి మరియు నా యందు సమస్తమును చూచువానికి నేను కనబడక
పోవుటకాని, నాకు అతడు కనబడకపోవుట కాని జరుగదు. (31) నేను మరియు హృదయస్థ పరమాత్మ ఇరువురము ఏకమేనని ఎరిగి
పరమాత్మ భజనమందు నియుక్తుడైన యోగి అన్ని పరిస్థితుల యందును నా యందే నిలిచి ఉండును. (32) ఓ అర్జునా! ఎవడు తనతో

పోల్చుకొని సమస్తజీవులను వాటి సుఖదుఃఖములందు సమముగా చూచునో అతడే ఉత్తమయోగి. (33) అర్జునుడు పలికెను: ఓ మధుసూదనా! మనస్సు చంచలమును మరియు అస్థిరమును ఐ ఉన్నందున నీవు సంగ్రహముగా తెలిపినటువంటి యోగపద్ధతి ఆచరణకు అసాధ్యమైనదిగను మరియు ఓర్వరానిదిగను నాకు తోచుచున్నది. (34) ఓ కృష్ణా! మనస్సు చంచలమును, కల్లోలపూర్ణమును, దృఢమును, మిగుల బలవత్తరమును ఐ ఉన్నది. దీనిని నిగ్రహించుట వాయువును నిగ్రహించుట కన్నను కష్టతరమని నేను భావించుచున్నాను. (35) శ్రీకృష్ణభగవానుడు పలికెను: ఓ గొప్పభుజములు కలిగిన కుంతీపుత్రా! చంచలమైన మనస్సును నిగ్రహించుట నిస్సందేహముగా మిగుల కష్టతరమైనను దానిని తగిన అభ్యాసము మరియు వైరాగ్యములచే సాధించవచ్చును. (36) మనస్సు నిగ్రహింపబడని వానికి ఆత్మానుభవము అతికష్టకార్యము. కాని మనోనిగ్రహము కలిగి, తగిన పద్ధతుల ద్వారా యత్నించువానికి జయము తప్పక సిద్ధించును. ఇది నా అభిప్రాయము. (37) అర్జునుడు పలికెను: ఓ కృష్ణా! తొలుత ఆత్మానుభవ విధానమును శ్రద్ధతో అనుసరించి, పిదప లౌకిక భావన కారణముగా దానిని త్యజించి, యోగమునందు పూర్ణత్వమును పొందలేని విఫలయోగి గమ్యమేమిటి? (38) ఓ మహాబాహో శ్రీకృష్ణా! ఆధ్యాత్మికమార్గము నుండి వైదొలగిన అట్టి మనుజుడు ఆధ్యాత్మికజయమును మరియు లౌకిక జయమును రెండింటిని పొందనివాడై ఎచ్చోటను స్థానము లేకుండా గాలిచే చెదరిన మేఘము వలె నశింపడా? (39) ఓ కృష్ణా! ఈ నా సందేహమును సంపూర్ణముగా తొలగించుమని నిన్ను వేడుచున్నాను. నీవు తప్ప ఈ సందేహమును తీర్చువారు వేరెవ్వరును లేరు. (40) శ్రీకృష్ణభగవానుడు పలికెను: ఓ పార్థా! శుభకార్యముల యందు నియుక్తుడైనవాడు ఈ లోకమున కాని, పరలోకమున కాని వినాశనమును పొందడు. మిత్రమా! మంచి చేయువాడెన్నడును చెడుచే పరాజితుడు కాడు. (41) యోగభ్రష్టుడైనవాడు పుణ్యజీవులు వసించు పుణ్యలోకములందు అనేకానేక సంవత్సరములు సుఖములను అనుభవించిన పిదప పవిత్ర కుటుంబమున కాని లేదా శ్రీమంతుల గృహమున కాని జన్మించును. (42) లేదా అతడు జ్ఞానవంతులైన యోగుల ఇంట జన్మము పొందును. కాని ఈ జగములో అట్టి జన్మము నిశ్చయముగా అరుదుగా ఉండును. (43) ఓ కురునందనా! అట్టి జన్మను పొందిన పిమ్మట అతడు గతజన్మపు దివ్యచైతన్యమును పునరుద్ధరించుకొని పూర్ణవిజయమును సాధించుటకు తిరిగి యత్నము కావించును. (44) పూర్వజన్మపు దివ్యచైతన్యము కారణముగా అతడు కోరకనే అప్రయత్నముగా యోగము వైపునకు ఆకర్షితుడగును. జిజ్ఞాసువైన అట్టి యోగి శాస్త్రములందు తెలుపబడిన కర్మనియమములకు సదా అతీతుడై ఉండును. (45) సమస్త కల్మషముల నుండి శుద్ధిపడిన యోగి మరింత పురోగతి కొరకు శ్రద్ధతో యత్నించినపుడు బహుజన్మల అభ్యాసము పిదప పూర్ణత్వమును పొంది అంత్యమున పరమగతిని పొందును. (46) యోగి అయినవాడు తపస్వి కన్నను, జ్ఞాని కన్నను, కామ్యకర్మరతుని కన్నను అధికుడైనట్టివాడు. కనుక ఓ అర్జునా! అన్ని పరిస్థితుల యందును నీవు యోగివి కమ్ము. (47) అత్యంత శ్రద్ధతో నా భావన యందే సదా నిలిచి ఉండువాడును, నన్నే తన యందు సదా స్మరించువాడును మరియు నాకు దివ్యమైన ప్రేమయుత సేవను ఒనరించువాడును అగు యోగి యోగులందరి కన్నను అత్యంత సన్నిహితముగా నాతో యోగమునందు ఉన్నట్టివాడై ఉన్నాడు. సర్వులలో అతడే అత్యున్నతుడు. ఇదియే నా అభిప్రాయము.

7. భగవద్విజ్ఞానము

(1) శ్రీకృష్ణభగవానుడు పలికెను: ఓ పార్థా! మనస్సును నా యందే సంలగ్నము చేసి నా సంపూర్ణభావనలో యోగమభ్యసించుట ద్వారా నీవు నిస్సందేహముగా నన్నెట్లు సమగ్రముగా తెలియగలవో ఇప్పుడు ఆలకింపుము.

(2) జ్ఞానము మరియు విజ్ఞానములను కూడిన సంపూర్ణ జ్ఞానమును నీకిప్పుడు నేను సంపూర్ణముగా వివరింపెదను. అది
తెలిసిన పిమ్మట నీవు తెలుసుకొనవలసినది ఏదియును మిగిలి ఉండదు. (3) వేలాది మనుష్యులలో ఒక్కడు మాత్రమే
సంపూర్ణత్వమును సాధించుటకు ప్రయత్నించును. ఆ విధముగా పూర్ణత్వమును సాధించిన వారిలో కూడా ఒకానొకడు
మాత్రమే నన్ను యథార్థముగా తెలిసికొనగలుగుచున్నాడు. (4) భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు,
బుద్ధి, అహంకారము అను ఎనిమిది అంశముల సముదాయము నా భిన్న ప్రకృతి అనబడును. (5) ఓ మహాబాహుడవైన
అర్జునా! వాటికి అన్యముగా నున్నదైన ప్రకృతిని ఉపయోగించుకొను జీవులను కూడి ఉన్న నా ఉన్నతమైన శక్తి వేరొకటి
కలదు (6) సృజించబడిన సర్వజీవులకు ఈ రెండు ప్రకృతులే కారణములై ఉన్నవి. ఈ జగత్తునందలి భౌతికమును,
ఆధ్యాత్మికమును అగు సర్వమునకు మూలమును ఇంకా ప్రళయమును నేనే అని నిశ్చయముగా ఎరుగుము. (7) ఓ ధనంజయా!
నా కన్నను శ్రేష్ఠమైన సత్యము వేరొక్కటి లేదు. దారమునందు ముత్యములు కూర్చబడినట్లు సమస్తము నాపైననే
ఆధారపడి ఉన్నది (8) ఓ కుంతీపుత్రా! నీటియందు రుచిని, సూర్యచంద్రుల యందు కాంతిని, వేదమంత్రములందు ఓంకారమును,
ఆకాశమునందు శబ్దమును, నరుని యందు సామర్థ్యమును నేనే ఐఉన్నాను. (9) భూమి యొక్క ఆద్యమైన సుగంధమును,
అగ్ని యందు ఉష్ణమును, జీవుల యందలి ప్రాణమును, తపస్వుల యందు తపస్సును నేనే ఉన్నాను. (10) ఓ పృథాకుమారా!
నేనే సర్వప్రాణులకు సనాతన బీజమునని, బుద్ధిమంతుల బుద్ధినని, శక్తిమంతుల శక్తినని తెలిసికొనుము.
(11) ఓ భరతవంశశ్రేష్ఠుడా! బలవంతులలోని కామరాగరహితమైన బలమును మరియు ధర్మనియమములకు
విరుద్ధము కానటువంటి సంభోగమును నేనే ఐఉన్నాను. (12) సత్త్వగుణమునకు కాని, రజోగుణమునకు కాని లేదా
తమోగుణమునకు కాని సంబంధించిన జీవుల భావములన్నియును నా శక్తినుండే ఉద్భవించినవని నీవు తెలిసికొనుము.
ఒక విధముగా నేనే సర్వమునైనను స్వతంత్రుడనై ఉన్నాను. ప్రకృతి త్రిగుణములు నా యందున్నను నేను వాటికి
లోబడి ఉండను. (13) సమస్త విశ్వము సత్త్వరజస్తమోగుణములనెడి త్రిగుణములచే భ్రాంతికి గురై గుణములకు
పరుడను ఇంకా అవ్యయుడను అగు నన్ను తెలియకున్నది. (14) త్రిగుణాత్మకమైన నా ఈ దైవీమాయ నిశ్చయముగా
దాటశక్యము కానిది. కాని నన్ను శరణుజొచ్చిన వారు దీనిని సులభముగా దాటగలరు. (15) దుష్టులైన మూఢులు,
నరాధములు, మాయచే జ్ఞానము హరింపబడినవారు, దానవ ప్రవృత్తిగల నాస్తిక స్వభావమును కలిగి ఉన్నవారు
నా శరణు పొందరు. (16) ఓ భరతవంశశ్రేష్ఠుడా! ఆర్తుడు, అర్థార్థి, జిజ్ఞాసువు, పరతత్త్వజ్ఞానమును అన్వేషించువాడు
అనే నాలుగు రకముల పుణ్యాత్ములు నాకు భక్తియుక్త సేవ ఒనరింతురు (17) వీరిలో సంపూర్ణ జ్ఞానము కలిగి సదా
భక్తియుక్త సేవలో నియుక్తుడై ఉండేవాడు అత్యంత ఉత్తముడు. ఏలననగా నేనతనికి మిక్కిలి ప్రియుడను ఇంకా
అతడును నాకు మిక్కిలి ప్రియతముడు. (18) ఈ భక్తులందరును నిస్సంశయముగా ఉదాత్తులైనను వీరిలో నా
జ్ఞానమునందు స్థితుడైనవానిని నన్నుగానే నేను భావింతును. నా దివ్యమైన సేవ యందు నియుక్తుడైనందున అతడు
అత్యుత్తమము మరియు పరమగతి ఐన నన్ను తప్పక పొందగలడు. (19) జ్ఞానవంతుడైనవాడు బహుజన్మమృత్యువుల
పిదప నన్నే సర్వకారణములకు కారణునిగను మరియు సమస్తముగను తెలిసికొని నన్ను శరణుపొందును. అట్టి
మహాత్ముడు అతి దుర్లభుడు. (20) విషయకోరికలచే జ్ఞానము అపహరింపబడినవారు ఇతరదేవతలకు
శరణముపొంది తమ గుణములను బట్టి ఆయా పూజావిధానములను అనుసరింతురు. (21) నేను ప్రతివారి
హృదయమునందు పరమాత్మరూపున నిలిచి ఉందును. ఎవరేని ఒక దేవతను పూజింపకోరినంతనే నేను అతని
శ్రద్ధను స్థిరము చేసి ఆ దేవతకు అతడు భక్తుడగునట్లు చేయుదును. (22) అట్టి శ్రద్ధను పొందినవాడై

మనుజుడు ఏదేని ఒక దేవతారాధనను చేపట్టి తద్వారా తన కోరికలను ఈడేర్చుకొనును. కాని వాస్తవమునకు ఆ వరములన్నియూ నా చేతనే ఒసగబడుచున్నవి. (23) అల్పబుద్ధి కలిగిన మనుజులు దేవతలను పూజింతురు. కాని వారొసగెడి ఫలములు అల్పములు,తాత్కాలికములై ఉన్నవి. దేవతలను పూజించువారు దేవతాలోకములను చేరగా, నా భక్తులు మాత్రము అంత్యమున నా దివ్యలోకమునే చేరుదురు. (24) నన్ను సంపూర్ణముగా ఎరుగని మందబుద్ధులు దేవదేవుడనైన నేను తొలుత నిరాకారుడనై ఉండి ఇప్పుడు ఈ రూపమును దాల్చితినని తలంతురు. అల్పజ్ఞత వలన వారు నాశరహితమును ఇంకా అత్యుత్తమమును అగు నా దివ్యభావమును ఎరుగలేరు. (25) మూఢులకు మరియు అజ్ఞానులకు నేనెన్నడును వ్యక్తముకాను. వారికి నేను నా అంతరంగశక్తిచే కప్పబడి ఉందును. తత్కారణముగా వారు నేను అజుడననియు, నాశనములేనివాడననియు ఎరుగరు. (26) ఓ అర్జునా! దేవదేవుడనైన నేను గతములో జరిగిన సమస్తమును, ప్రస్తుతము జరుగుచున్న సర్వమును, భవిష్యత్తులో జరుగనున్న వానినన్నింటిని ఎరుగుదును. అలాగునే జీవులందరిని నేను ఎరుగుదును. కాని నన్నెవ్వరును ఎరుగరు (27) ఓ భరతవంశీయుడా! పరంతపా! కోరిక ఇంకా ద్వేషము వలన కలిగిన ద్వంద్వములచే మోహితులై జీవులందరును మోహమునందే జన్మించుచున్నారు. (28) పూర్వజన్మములందు, ప్రస్తుత జన్మమునందు పుణ్యకర్మములను చేయుచు పాపములను పూర్తిగ నశింపచేసికొనిన మనుజులు ద్వంద్వమోహముల నుండి విడివడినవారై నా సేవ యందు దృఢవ్రతముతో నెలకొనెదరు (29) ముసలితనము మరియు మృత్యువుల నుండి ముక్తిని పొందుటకై యత్నించు బుద్ధిమంతులు భక్తియోగముతో నన్ను ఆశ్రయించుచున్నారు. దివ్యకర్మల గూర్చి సమగ్రముగా ఎరిగియుండుటచే యథార్థముగా వారు బ్రహ్మస్వరూపులై ఉన్నారు. (30) నా యందు సంలగ్నమైన చిత్తము కలిగినవారు దేవదేవుడనైన నన్నే భౌతిక జగత్తును సర్వదేవతలను, సమస్తయజ్ఞములను నియమించువానిగా తెలిసికొని మరణసమయమునందును నన్ను అవగాహనతో ఎరిగి ఉందురు.

8. భగవత్ప్రాప్తి

(1) అర్జునుడు ప్రశ్నించెను: ఓ దేవదేవా! పురుషోత్తమా! బ్రహ్మ అనగేమి? ఆత్మ అనగేమి? కామ్యకర్మలనగేమి? భౌతికసృష్టి అనగేమి? దేవతలన ఎవరు? దయతో ఇది నాకు వివరింపుము. (2) ఓ మధుసూదనా! యజ్ఞప్రభువెవ్వరు? అతడు ఏ విధముగా దేహము నందు వసించి ఉండును? భక్తియోగమునందు నిలిచినవారు మరణసమయమున నిన్నెట్లు తెలిసికొనగలరు? (3) శ్రీకృష్ణభగవానుడు పలికెను: నాశరహితమును, దివ్యమును అగు జీవుడే బ్రహ్మ అనియు మరియు అతని నిత్యస్వభావమే అధ్యాత్మమనియు చెప్పబడును. జీవుల దేహోద్భవమునకు సంబంధించిన కర్మమే కర్మము అనబడును. (4) ఓ దేహధారులలో శ్రేష్ఠుడా! నిరంతరము పరిణామశీలమైన భౌతికప్రకృతి అధిభూతమనబడును. సూర్యచంద్రుల వంటి సర్వదేవతలను కూడి ఉండెడి విశ్వరూపమే అధిదైవతమనబడును. దేహధారుల హృదయములో పరమాత్మరూపమున నిలిచి ఉండెడి దేవదేవుడనైన నేనే అధియజ్ఞుడను. (5) అంత్యకాలమున కూడా నన్నే స్మరించుచు దేహత్యాగము చేసెడివాడు తత్క్షణమే నన్ను పొందుచున్నాడు. ఈ విషయమున ఎట్టి సందేహము లేదు. (6) ఓ కౌంతేయ! దేహమును త్యజించునపుడు మనుజుడు ఏ భావమును స్మరించునో అదే భావమును అతడు నిశ్చయముగా పొందును (7) కావున ఓ అర్జునా! సర్వకాలములయందును నీవు నన్నే తలచుచు నీ విధ్యుక్తధర్మమైన యుద్ధము చేయుము. నీ కర్మలను నాకు అర్పించుట ద్వారా ఇంకా నీ మనోబుద్ధులను నా యందు నిలుపుట ద్వారా నీవు నన్ను నిస్సందేహముగా

పొందగలడు ⑧ ఓ పార్థా! మనస్సును ఎల్లవేళలా నా స్మరణమునందే నియుక్తము చేసి ఏ మాత్రము మార్గము తప్పక నన్నే
దేవదేవునిగా ధ్యానము చేసెడివాడు నన్ను తప్పక చేరగలడు. ⑨ నియమించువాడును, సూక్ష్మము కన్నను సూక్ష్మమైన
వాడును, సమస్తమును పోషించువాడును, భౌతిక భావనలకు పరమైనవాడును, అచింత్యుడును, రూపరహితుడును అగు
పరమపురుషుని సర్వజ్ఞునిగను మరియు ప్రాచీనునిగను ప్రతి ఒక్కరు ధ్యానము చేయవలెను. సూర్యునివలె తేజో
సంపన్నుడును మరియు దివ్యుడును అగు అతడు భౌతిక ప్రకృతికి అతీతుడు. ⑩ మరణ సమయమున ప్రాణవాయువును
భ్రూమధ్యమున నిలిపి, యోగశక్తిచే చలించని మనస్సుతో సంపూర్ణ భక్తి భావమున భగవానుని స్మరించెడివాడు తప్పక
ఆ పరమపురుషుని పొందగలడు. ⑪ వేదవిదులైనవారును, ఓంకారమును ఉచ్చరించువారును, సన్యాసాశ్రమమునందున్న
మహాత్ములును అగు మనుజులు బ్రహ్మమునందు ప్రవేశించుచున్నారు. అట్టి పూర్ణత్వమును కోరినవారును బ్రహ్మచర్య
వ్రతమును అభ్యసింతురు. మోక్షమును కూర్చు ఈ విధానమును ఇప్పుడు నీకు నేను సంగ్రహముగా వివరింతును.
⑫ ఇంద్రియకర్మల నుండి విడివడి ఉండుటయే యోగస్థితి అనబడును. సర్వేంద్రియ ద్వారములను మూసివేసి, మనస్సును
హృదయమునందు స్థిరము చేసి, ప్రాణవాయువును శీర్షాగ్రమునందు నిలిపి మనుజుడు యోగమునందు స్థితుడు కాగలడు.
⑬ ఈ యోగవిధానమునందు నెలకొని దివ్యాక్షరముల సమాహారమైన ఓంకారమును జపించిన పిదప మనుజుడు దేవదేవుడైన
నన్ను తలచుచు శరీరమును త్యజించినచో నిశ్చయముగా ఆధ్యాత్మికలోకములను పొందగలడు. ⑭ ఓ పార్థా! అనన్యచిత్తముతో
నన్ను స్మరించువానికి అతని నిరంతర భక్తియుతసేవ కారణమున నేను సులభముగా లభ్యుడనై ఉన్నాను. ⑮ భక్తియోగులైన
మహాత్ములు నన్ను పొందిన పిమ్మట సంపూర్ణత్వమును పొందినవారగుటచే దుఃఖాలయమైన ఈ అనిత్యజగమునకు ఎన్నడును
తిరిగిరారు ⑯ భౌతిక జగమునందలి అత్యున్నతలోకము మొదలుకొని అధమలోకము వరకుగల సర్వలోకములు జన్మమృత్యు
భరితమైన దుఃఖప్రదేశములే. కాని ఓ కౌంతేయ! నా లోకమును చేరినవాడు తిరిగి జన్మమునొందడు. ⑰ మానవపరిగణనము
ననుసరించి వేయియుగముల కాలము బ్రహ్మదేవునికి ఒక పగలు. అతని రాత్రి సైతము అంతే పరిమాణము కలిగి ఉండును.
⑱ బ్రహ్మదేవుని పగటి సమయము ఆరంభమైనంతనే జీవులందరును అవ్యక్తస్థితి నుండి వ్యక్తము చెంది, పిదప అతని
రాత్రి ప్రారంభమైనంతనే తిరిగి అవ్యక్తమునందు లీనమగుదురు. ⑲ బ్రహ్మదేవుని పగటి సమయము ఆరంభమైనప్పుడు
జీవులు మరల మరల వ్యక్తమగుచు అతని రాత్రిసమయము ప్రారంభమైనంతనే అవశులై నశింతురు ⑳ వ్యక్తావ్యక్తములు
అయినట్టి ఈ భౌతికప్రకృతికన్నను పరమైనదియు, శాశ్వతమైనదియు అగు అవ్యక్త ప్రకృతి వేరొక్కటి కలదు. అది
పరమోత్కృష్టమును, నాశరహితమును ఐ ఉన్నది. ఈ జగమునందు గల సమస్తము నశించినను అదిమాత్రము
యథాతథముగా నిలిచి ఉండును. ㉑ వేదాంతులు దేనిని అవ్యక్తము, అక్షరము అని వర్ణింతురో, ఏది పరమగమ్యస్థానముగా
తెలియబడుచున్నదో, ఏ స్థానమును పొందిన పిమ్మట మనుజుడు వెనుకకు తిరిగిరాడో అదియే నా దివ్యధామము.
㉒ సర్వులకన్నను అధికుడైన దేవదేవుడు అనన్యభక్తి చేతనే పొందబడును. అతడు తన ధామమునందు నిలిచి
ఉన్నను సర్వవ్యాపి ఐ ఉన్నాడు. ఇంకా అతని అందే సమస్తము స్థితిని కలిగి ఉన్నది. ㉓ ఓ భరతవంశశ్రేష్ఠుడా! ఏయే
కాలములందు ఈ జగమును వీడుట ద్వారా యోగి తిరిగి వచ్చుట జరుగునో లేక తిరిగిరాకుండునో నీకు నేనిప్పుడు
వివరించెదను ㉔ పరబ్రహ్మము నెరిగి బ్రహ్మవిదులు అగ్నిదేవుని ప్రభావమునందు, కాంతి యందు, పగటి యందలి
ఏదేని శుభఘడియ యందు, శుక్లపక్షము నందు లేక సూర్యుడు ఉత్తరముగా ప్రయాణించు ఉత్తరాయణపు ఆరుమాసముల
కాలమునందు ఈ జగమును వీడుట ద్వారా ఆ పరబ్రహ్మమును పొందుదురు ㉕ ధూమమునందు, రాత్రి యందు,
కృష్ణపక్షమునందు, సూర్యుడు దక్షిణముగా ప్రయాణించు దక్షిణాయన సమయమునందు మరణించు యోగి

చంద్రలోకమును పొందినను మరల వెనుకకు తిరిగి వచ్చును. (26) ఈ జగత్తును వీడుటకు వేదాభిప్రాయమును అనుసరించి శుక్ల, కృష్ణములనెడి రెండు మార్గములు కలవు. శుక్లమార్గమునందు మరణించువాడు తిరిగి రాకుండును. కాని చీకటి మార్గమున మరణించువాడు మాత్రము వెనుకకు తిరిగి వచ్చును. (27) ఓ అర్జునా! ఈ రెండు మార్గములను తెలిసినప్పటికిని ఎన్నడును మోహము పొందరు. కనుక నీవు భక్తి యందు సదా స్థిరుడవగుము. (28) వేదాధ్యయనము వలన, తీవ్ర తపస్సులతో కూడిన యజ్ఞాచరణము వలనను, దానము వలన లేదా తాత్వికకర్మలను ఇంకా కామ్యకర్మలను ఒనరించుట వలన కలుగు ఫలితములు భక్తిమార్గమును చేపట్టు మనుజునికి లభించకపోవు. కేవలము భక్తియుతసేవ ఒనరించుట ద్వారా అతడు వాటన్నింటిని పొందుటయేగాక అంత్యమున దివ్యమైన పరంధామమును సైతము చేరగలడు

9. పరమగుహ్య జ్ఞానము

(1) శ్రీకృష్ణభగవానుడు పలికెను: ఓ అర్జునా! నీవు నా యెడ ఎన్నడును అసూయ కలవాడవు కానందున ఈ గుహ్యతమ జ్ఞానమును మరియు విజ్ఞానమును నీకు తెలియచేసెదను. దీనిని తెలిసిన పిమ్మట భౌతికస్థితి వలన కలిగెడి క్లేశముల నుండి నీవు ముక్తుడవు కాగలవు (2) ఈ జ్ఞానము విద్యలకెల్ల రాజువంటిది ఇంకా సర్వరహస్యములలో పరమరహస్యమైనది. పరమపవిత్రమైన ఈ జ్ఞానము అనుభవపూర్వకముగా ఆత్మ యొక్క ప్రత్యక్ష జ్ఞానమును కలుగచేయుటచే ధర్మము యొక్క పూర్ణత్వమై ఉన్నది. ఇది శాశ్వతమైనది ఇంకా ఆచరించుటకు అత్యంత సౌఖ్యకరమైనది. (3) ఓ శత్రుజయుడా! ఈ భక్తియుత సేవ యందు శ్రద్ధ లేనివారు నన్ను పొందలేరు. కనుక వారు ఈ భౌతిక జగమునందలి జనన, మరణ మార్గమునకే తిరిగి వత్తురు. (4) సమస్త జగత్తు అవ్యక్తరూపమున నాచే ఆవరించబడి ఉన్నది. జీవులన్నియు నా యందున్నవి, కాని నేను వాని యందు లేను. (5) ఐనను సృష్టించబడిన సమస్తము నా యందు స్థితిని కలిగి ఉండదు. అచింత్యమైన నా యోగవైభవమును చూడుము. నేను సర్వజీవులను పోషించువాడను మరియు సర్వత్రా వసించువాడనైనను, సర్వసృష్టికి కారణుడనైనందున ఈ దృశ్యమానజగత్తునందలి భాగమును కాను. (6) సర్వత్రా వీచునట్టి ప్రచండవాయువు సదా ఆకాశమునందే స్థితిని కలిగి ఉండునట్లు, సృజింపబడిన సమస్త జీవులు నా యందు స్థితిని కలిగి ఉన్నవని గ్రహింపుము (7) ఓ కౌంతేయా! కల్పాంతమున సమస్త భౌతికసృష్టులు నా ప్రకృతి యందు ప్రవేశించును. తదుపరి కల్పారంభమున నేనే నా శక్తిచే వాటిని తిరిగి సృజింతును. (8) సమస్త విశ్వము నా అధీనమున కలదు. అది నా సంకల్పము చేతనే అప్రయత్నముగా మరల మరల సృష్టించబడును. నా సంకల్పము చేతనే అంత్యమున లయము నొందుచుండును. (9) ఓ ధనంజయా! ఈ కర్మ అంతయు నన్ను బంధింపదు. నేను తటస్థునివలె ఉండి ఈ భౌతికకర్మల యెడ సదా ఆసక్తి లేనివాడనై ఉందును. (10) ఓ కౌంతేయా! నా శక్తులలో ఒకటైన భౌతికప్రకృతి నా అధ్యక్షతన వర్తించుచు స్థావరజంగమములను సృష్టించుచున్నది. దాని నియమము ననుసరించియే ఈ జగత్తు మరల మరల సృష్టించబడుచు లయము నొందుచున్నది. (11) నేను మానవ రూపమున అవతరించినపుడు మూఢులు నన్ను అపహాస్యము చేయుదురు. సమస్తమునకు పరమ ప్రభువైన నా దివ్యతత్త్వమును వారు ఎరుగరు. (12) ఆ విధముగా మోహపరవశులైనవారు దానవ, నాస్తిక భావములచే విమోహితులగుదురు. అట్టి భ్రాంతి స్థితిలో వారి ముక్తికి సంబంధించిన ఆశలు, కామ్యకర్మలు, జ్ఞానసముపార్జనలు అన్నియును వ్యర్థములగును. (13) ఓ పృథాకుమారా! భ్రాంతులు కానటువంటి మహాత్ములు మాత్రము దైవీప్రకృతిని ఆశ్రయించి ఉందురు. వారు నన్ను ఆదియును, అవ్యయుడను అగు దేవదేవునిగా తెలిసియుండుటచే నా భక్తియుతసేవలో

సంపూర్ణముగా నిమగ్నులై ఉందురు. (14) ఈ మహాత్ములు దృఢ నిశ్చయముతో యత్నించువారై సదా నా మహిమలను కీర్తించుచు
నాకు నమస్కారము చేయుచు, నిత్యయుక్తులై నన్ను భక్తితో పూజింతురు (15) జ్ఞాన సముపార్జన యజ్ఞమునందు నియుక్తులైన
ఇతరులు ఏకదేవుడనైన నన్ను అద్వితీయునిగా, వివిధ రూపునిగా, విశ్వరూపునిగా పూజింతురు. (16) నేనే క్రతువును, యజ్ఞమును,
పితృలకొసగబడు ఆహుతిని, ఔషధమును, దివ్యమంత్రమును ఐ ఉన్నాను, ఆజ్యమును, అగ్నిని, హుతమును కూడా నేనే.
(17) నేను ఈ జగత్తునకు తండ్రిని, తల్లిని, పోషకుడను, పితామహుడను ఐ ఉన్నాను. జ్ఞానలక్ష్యమును, పవిత్రము చేయువాడను,
ఓంకారమును నేనే. ఋగ్వేదము, సామవేదము, యజుర్వేదములు కూడా నేనే. (18) గమ్యమును, భరించువాడను, ప్రభువును,
సాక్షిని, నివాసమును, ఆశ్రయమును, సన్నిహిత స్నేహితుడను నేనే. నేనే సృష్టిని, ప్రళయమును, సర్వమునకు స్థానమును,
నిధానమును, అవ్యయబీజమును ఐ ఉన్నాను. (19) ఓ అర్జునా! వేడినొసగువాడను, వర్షమును నిరోధించుట ఇంకా కురిపించుట
చేయువాడను నేనే. అమృతత్వమును మరియు మృత్యువును నేనే. సత్, అసత్ రెండును నా యందే ఉన్నవి.
(20) స్వర్గలోకములను కోరుచు వేదాధ్యయనము చేయువారు మరియు సోమరసమును పానము చేయువారు పరోక్షముగా
నన్నే అర్చింతురు. పాపఫలముల నుండి పవిత్రులై అట్టివారు పుణ్య ఇంద్రలోకమున జన్మించి దేవభోగములను అనుభవింతురు.
(21) విస్తృతమైన స్వర్గలోక భోగములను అనుభవించి పుణ్యము క్షీణించినంతనే వారు భూలోకమునకు తిరిగివత్తురు. ఈ విధముగా
త్రివేదముల నియమానుసరణము ద్వారా ఇంద్రియ భోగమును వాంఛించువారు కేవలము జననమరణములనే మరల,
మరల పొందుదురు. (22) నా దివ్యరూపమును ధ్యానించుచు అనన్య భక్తిచే నన్ను సదా అర్చించువారి యోగక్షేమములను
నేనే వహింతును. (23) ఓ కౌంతేయా! అన్యదేవతలకు భక్తులైవారిని శ్రద్ధతో పూజించువారు వాస్తవమునకు నన్నే పూజించు
చున్నారు (24) నేనే సర్వయజ్ఞములకు భోక్తను మరియు ప్రభువును ఐ ఉన్నాను. కావున నా వాస్తవమైన దివ్యస్వభావమును
గుర్తింపలేనివారు పతనము చెందుదురు. (25) దేవతలను పూజించువారు దేవతలలో జన్మింతురు. పితృదేవతలను
పూజించువారు పితృదేవతలను చేరగా, భూతప్రేతములను పూజించువారు వాటి యందే జన్మింతురు. కాని నన్ను
పూజించువారు నాతోనే నివసింతురు. (26) పత్రమునైనను, పుష్పమునైనను, ఫలమునైనను లేదా జలమునైనను
ప్రేమతోను, భక్తితోను ఎవరేని అర్పించినచో నేను స్వీకరింతును. (27) ఓ కౌంతేయా! నీవు ఏది ఒనరించినను, ఏది భుజించినను,
ఏది హోమము చేసినను, ఏది దానమొసగినను, ఏ తపస్సు ఆచరించినను వాటన్నింటిని నాకు అర్పణము చేయుము.
(28) ఈ విధముగా నీవు కర్మబంధముల నుండి మరియు వాని శుభాశుభ ఫలముల నుండి ముక్తుడవు కాగలవు. ఇట్టి
సన్న్యాస యోగముతో నా యందు మనస్సును స్థిరపరచుట ద్వారా నీవు ముక్తుడవై నన్ను పొందగలవు. (29) నేనెవరిని
ద్వేషింపను, ఎవరి ఎడను పక్షపాతమును కలిగి ఉండను. నేను సర్వుల ఎడ సమముగా వర్తింతును. కాని భక్తితో నాకు
సేవచేసెడివాడు నాకు మిత్రుడై నా యందుండును ఇంకా నేనును అతనికి మిత్రుడై ఉందును. (30) మిక్కిలి హేయమైన
కర్మము నొనరించినప్పటికిని మనుజుడు భక్తియుత సేవలో నియుక్తుడై ఉన్నచో, తన సంకల్పమున స్థిరనిశ్చయుడై
ఉన్నందున అతనిని సాధువుగనే పరిగణింపవలెను. (31) అతడు శీఘ్రమే ధర్మాత్ముడై శాశ్వతమైన శాంతిని పొందును.
ఓ కౌంతేయా! నా భక్తుడెన్నడును నశింపడని ధైర్యముగా ప్రకటింపుము (32) ఓ పార్థా! నా శరణుజొచ్చువారు అధమ
జన్ములైన స్త్రీలు, వైశ్యులు, శూద్రులు ఐనప్పటికిని పరమగతిని పొందగలరు. (33) ధర్మాత్ములైన బ్రాహ్మణుల గూర్చియు, భక్తుల
గూర్చియు, రాజర్షుల గూర్చియు వేరుగా చెప్పవలెనా! అందుచే అనిత్యమును, అసుఖమును అగు ఈ లోకమునకు వచ్చి
ఉన్నందున నా ప్రేమయుక్త సేవలో నియుక్తుడవగుము. (34) నీ మనస్సును సదా నా చింతన యందే నిమగ్నము
చేయుము. నా భక్తుడవగుము. నాకు నమస్కారము చేయుము, నన్ను అర్చింపుము. ఈ విధముగా నా యందు

సంపూర్ణముగ్నుడవై నీవు నన్ను తప్పక చేరగలవు.

10. భగవద్విభూతి

(1) శ్రీకృష్ణభగవానుడు పలికెను: మహాబాహువులు గల ఓ అర్జునా! మరల ఆలకింపుము. నీవు నాకు ప్రియమిత్రుడ
వగుటచే ఇంతవరకు వివరించిన జ్ఞానము కన్నను ఉత్తమమైన జ్ఞానమును నీ హితము కొరకై నేను వచించెదను.
(2) సర్వవిధముల నేనే దేవతలకు మరియు మహర్షులకు మూలమై ఉన్నందున దేవతాసమూహముగాని, మహర్షులు
గాని నా ఉత్పత్తిని లేదా విభూతులను తెలిసికొనజాలరు. (3) నన్ను పుట్టుక లేనివానిగను, అనాదిగను, సర్వలోకములకు
దివ్యప్రభువుగను తెలిసికొనిన వాడు మాత్రమే మనుజులందరిలోను భ్రాంతిరహితుడై సర్వపాపముల నుండి
ముక్తుడగును (4-5) బుద్ధి, జ్ఞానము, సంశయము గాని భ్రాంతిగాని లేకుండుట, క్షమాగుణము, సత్యము, ఇంద్రియ
నిగ్రహము, మనోనిగ్రహము, సుఖదుఃఖములు, జన్మము, మృత్యువు, భయము, భయరాహిత్యము, అహింస,
సమత్వము, సంతుష్టి, తపస్సు, దానము, యశస్సు, అపకీర్తి మున్నగు జీవుల వివిధ గుణములు నా చేతనే
సృష్టించబడినవి. (6) సప్తమహాఋషులు, వారికి పూర్వము సనక సనందనాదులు మరియు మనువులు నా మానసము నుండియే
ఉద్భవించిరి. వివిధ లోకములందలి సర్వజీవులు వారి నుండి జన్మించిరి. (7) నా ఈ దివ్యవిభూతిని, యోగశక్తిని యథార్థముగా ఎరిగినవాడు
నా విశుద్ధ భక్తియుతసేవలో నియుక్తుడు కాగలడు. ఈ విషయమున ఎట్టి సందేహము లేదు. (8) నేనే సర్వములైన ఆధ్యాత్మిక,
భౌతిక జగములకు కారణభూతుడను. సర్వము నా నుండియే ఉద్భవించుచున్నది. ఈ విషయమును సంపూర్ణముగా ఎరిగిన
బుధజనులు నా భక్తి అందు నిమగ్నులై నన్ను హృదయపూర్వకముగా అర్చింతురు. (9) నా శుద్ధభక్తుల ఆలోచనలు నా అందే
నిమగ్నమై, వారి జీవితములు సంపూర్ణముగా నా సేవకొరకే అర్పణమై ఉండును. నా గూర్చి ఒకరికొకరు బోధించుకొనుచు
మరియు చర్చించుచు వారు గొప్ప సంతృప్తిని, ఆనందమును అనుభవింతురు. (10) ప్రేమతో నా సేవ అందు నిరంతరాసక్తులైన
వారికి నన్ను చేరగల బుద్ధియోగమును నేనొసగుదును. (11) నేను వారి ఎడ ప్రత్యేక కరుణను చూపుటకొరకు వారి హృదయము
నందు వసించుచు, తేజోమయమైన జ్ఞానదీపముచే అజ్ఞానజనితమగు అంధకారమును నశింపజేయుదును.
(12-13) అర్జునుడు పలికెను: నీవు దేవదేవుడవు, పరంధాముడవు, పవిత్రుడవు, పరమతత్త్వమువు, శాశ్వతుడవు, దివ్యుడవు,
ఆదిపురుషుడవు, పుట్టుకలేనివాడవు, ఘనమైనవాడవు అయి ఉన్నావు. నారదుడు, అసితుడు, దేవలుడు, వ్యాసుడు వంటి మహా
ఋషులందరును నిన్ను గూర్చిన ఈ సత్యమునే ధ్రువపరచిరి. ఇప్పుడు స్వయముగా నీవు అదే విషయమును నాకు తెలియ
చేయుచున్నావు. (14) ఓ కృష్ణా! నీవు నాకు తెలిపినదంతయు సత్యమని సంపూర్ణముగా నేను అంగీకరించుచున్నాను. ఓ దేవదేవా!
దేవతలు కాని, దానవులు కాని నీ స్వరూపమును ఎరుగజాలరు. (15) ఓ పురుషోత్తమా! సర్వకారణా! సర్వేశ్వరుడా! దేవదేవా!
జగన్నాథా! నీవొక్కడవే నీ అంతరంగశక్తి ద్వారా నిజముగా నిన్నెరుగుదువు. (16) నీవు ఏ దివ్యవిభూతుల ద్వారా ఈ లోకములను
అన్నింటిని అందును వ్యాపించి ఉందువో వాటన్నింటిని దయతో నాకు వివరముగా తెలియజేయుము. (17) ఓ కృష్ణా!
యోగేశ్వరా! నిన్ను సర్వదా నేనెట్లు చింతించగలను మరియు నిన్నెట్లు తెలిసికొనగలను? ఓ దేవదేవా! ఏయే
రూపములందు నిన్ను స్మరింపవలెను? (18) ఓ జనార్దనా! నీ యోగవిభూతిని దయతో తిరిగి సమగ్రముగా వివరింపుము.
ఎంత అధికముగా శ్రవణము చేసినచో అంత అధికముగా నీ వచనామృతమును నేను ఆస్వాదింపకోరినందున
నిన్ను గూర్చి ఎంత శ్రవణము చేసినను తనివితీరుట లేదు. (19) శ్రీకృష్ణభగవానుడు ఇట్లు పలికెను: సరియే! నా
వైభవోపేతమైన సృష్టి విస్తారములను గూర్చి నీకు తెలియజేసెదను. కాని ఓ అర్జునా! నా విభూతి అనంతమైనందున

కేవలము వానిలో ప్రధానమైన వానినే నేను నీకు తెలుపుదును. (20) ఓ అర్జునా! నేను సర్వజీవుల హృదయములందు
వసించి ఉన్నట్టి పరమాత్మను. సర్వజీవులకు ఆదిమధ్యాంతములు నేనే అయి ఉన్నాను. (21) నేను ఆదిత్యులలో విష్ణువును,
తేజస్సులలో ప్రకాశమానమైన సూర్యుడను, మరుత్తులలో మరీచిని, నక్షత్రములలో చంద్రుడనై ఉన్నాను. (22) నేను
వేదములలో సామవేదమును, దేవతలలో స్వర్గాధిపతి అయిన ఇంద్రుడను, ఇంద్రియములలో మనస్సును, జీవుల అందలి
ప్రాణమును అయి ఉన్నాను. (23) నేను రుద్రులలో శివుడను, యక్ష, రాక్షసులలో కుబేరుడను, వసువులలో అగ్నిని, పర్వతములలో
మేరువును అయి ఉన్నాను. (24) ఓ అర్జునా! పురోహితులలో ముఖ్యుడైన బృహస్పతిగా నన్నెరుగుము. నేను సేనానాయకులలో
కార్తికేయుడను, జలనిధులలో సముద్రమునై ఉన్నాను. (25) నేను మహర్షులలో భృగువును, ధ్వనులలో దివ్యమైన
ఓంకారమును, యజ్ఞములలో జపయజ్ఞమును, స్థావరములైన వానిలో హిమాలయమును అయి ఉన్నాను. (26) నేను
వృక్షములలో రావిచెట్టును, దేవర్షులలో నారదుడను, గంధర్వులలో చిత్రరథుడను, సిద్ధులలో కపిలుడను అయి ఉన్నాను.
(27) అశ్వములలో అమృతముకొరకై సాగరమంథనము కావించిన సమయమున ఉద్భవించిన ఉచ్చైశ్రవముగా నన్నెరుగుము.
అలాగుననే నేను గజరాజులలో ఐరావతమును మరియు నరులలో రాజును అయి ఉన్నాను. (28) నేను ఆయుధములలో
వజ్రాయుధమును, గోవులలో కామధేనువును, ప్రజోత్పత్తి కారణములలో మన్మథుడను మరియు సర్పములలో వాసుకిని
అయి ఉన్నాను. (29) నేను పెక్కుపడగలుగల నాగులలో అనంతుడను, జలవాసులలో వరుణదేవుడను, పితృదేవతలలో
అర్యముడను, ధర్మనిర్వాహకులలో మృత్యుదేవతైన యముడను అయి ఉన్నాను. (30) నేను దైత్యులలో భక్తప్రహ్లాదుడను,
అణచువారిలో కాలమును, మృగములలో సింహమును, పక్షులలో గరుత్మంతుడను అయి ఉన్నాను. (31) నేను పవిత్రపరచు
వానిలో వాయువును, శస్త్రధారులలో శ్రీరాముడను, జలజంతువులలో మకరమును, నదులలో గంగానదిని అయి ఉన్నాను.
(32) ఓ అర్జునా! సమస్తసృష్టికి ఆది, అంతము, మధ్యము కూడా నేనే. అదే విధముగా నేను శాస్త్రములలో ఆత్మకు
సంబంధించిన ఆధ్యాత్మికశాస్త్రమును, తార్కికులలో కడపటి సత్యమును అయి ఉన్నాను. (33) నేను అక్షరములలో అకారమును,
సమాసములలో ద్వంద్వసమాసమును, శాశ్వతమైన కాలమును, సృష్టికర్తలలో బ్రహ్మను అయి ఉన్నాను. (34) సమస్తమును
మ్రింగివేయునటువంటి మృత్యువును మరియు సృష్టింపబడనున్న జీవులకు ఉద్భవమును నేనే అయి ఉన్నాను. స్త్రీల
అందలి యశస్సు, వైభవము, మనోహరమగు వాక్కు, జ్ఞాపకశక్తి, బుద్ధి, ధృతి, ఓర్పును నేనే. (35) నేను సామవేద
మంత్రములలో బృహత్సామమును, ఛందస్సులలో గాయత్రిని, మాసములలో మార్గశీర్షమును, ఋతువులలో
వసంతఋతువును అయి ఉన్నాను. (36) నేను మోసములలో జూదమును, తేజస్సులలో తేజస్సునై ఉన్నాను. అలాగుననే
జయమును, సాహసమును, బలవంతులలో బలమును నేనే (37) నేను వృష్ణివంశీయులలో వాసుదేవుడను,
పాండవులలో అర్జునుడను, మునులలో వ్యాసుడను, ఆలోచనాపరులలో శుక్రాచార్యుడను అయి ఉన్నాను (38) నేను
చట్టవిరుద్ధతను అణచువానిలో శిక్షను, జయమును కోరువారిలో నీతిని, రహస్యములలో మౌనమును, జ్ఞానవంతులలో
జ్ఞానమును అయి ఉన్నాను. (39) ఇంకను ఓ అర్జునా! సర్వజీవులకు జన్మకారక బీజమును నేనే. స్థావర జంగములలో
నేను లేకుండ ఏదియును స్థితిని కలిగి ఉండలేదు. (40) ఓ శత్రుంజయుడా! నా దివ్యవిభూతులకు అంతమనునది లేదు.
నేను నీకు తెలిపినదంతయును నా అనంతవిభూతుల ఒక్క సూచన మాత్రమే. (41) సంపన్నములును, సుందరములును,
వైభవోపేతములును అగు సమస్తసృష్టి విస్తారములు నా తేజోంశము నుండి ఉద్భవించినవిగా తెలిసికొనుము.
(42). కాని ఓ అర్జునా! ఈ సవిస్తరమైన జ్ఞానము ఒక్క అవసరమేమున్నది? కేవలము ఒక అంశమాత్రము చేతనే
నేను ఈ సమస్త విశ్వమును వ్యాపించి పోషించుచుందును.

11. విశ్వరూపము

(1) అర్జునుడు పలికెను: ఈ పరమరహస్యములైన ఆధ్యాత్మిక విషయములను గూర్చి నీవు కరుణచే నాకు చేసిన
ఉపదేశముల శ్రవణము ద్వారా ఇప్పుడు నా మోహము తొలగిపోయినది. (2) ఓ కమలపత్రాక్షా! సర్వజీవుల జనన
మరణముల గూర్చి వివరముగా నీ నుండి నేను శ్రవణము చేసితిని మరియు అవ్యయములైన నీ మహాత్మ్యములను
కూడా గుర్తించితిని. (3) ఓ పురుషోత్తమా! ఓ పరమేశ్వరా! నీవు వర్ణించిన రీతిగా నీ యథార్థరూపమును నేను నా ఎదుట
చూడగలిగినను, నీవు ఏ విధముగా ఈ విశ్వమునందు ప్రవేశించితివో నేను గాంచ అభిలషించుచున్నాను.
నీ యొక్క ఆ రూపమును నేను దర్శించ కోరుదును. (4) హే ప్రభూ! యోగేశ్వరా! నీ విశ్వరూపమును చూచుటకు
నేను సమర్థుడనని నీవు తలచినచో దయతో ఆ అపరిమితమైన విశ్వరూపమును నాకు చూపుము.
(5) దేవదేవుడైన శ్రీకృష్ణుడు పలికెను: ఓ అర్జునా! పృథాకుమారా! లక్షలాదిగా కల నానా విధములును, దివ్యములును,
పలువర్ణములును అగు రూపములను ఇప్పుడు చూడుము. (6) ఓ భారతా! ఇచ్చట ఆదిత్యులను, వసువులను,
రుద్రులను, అశ్వనీకుమారులను, సమస్త ఇతర దేవతలను చూడుము. అలాగునే ఇదివరకెన్నడును ఎవ్వరును కనని,
వినని పలు అద్భుతవిషయములను చూడుము. (7) ఓ అర్జునా నీవు చూడగోరు సమస్తమును నా దేహమున
ఒక్కసారిగా చూడుము. నీవు ప్రస్తుతము ఏది చూడగోరినను మరియు భవిష్యత్తున ఏది వీక్షింప-
దలచినను ఈ విశ్వరూపము నీకు చూపగలదు. స్థావర, జంగమాది సర్వము ఏకస్థానమున దీని అందే
సంపూర్ణముగా కలవు (8) ప్రస్తుత నేత్రములచే నన్ను చూడలేవు కనుక నేను నీకు దివ్యనేత్రములను
ఒసగుచున్నాను. నా యోగవైభవమును వీక్షింపుము (9) సంజయుడు పలికెను: ఓ రాజా! యోగేశ్వరుడైన
శ్రీకృష్ణభగవానుడు ఆ విధముగా పలికిన తదుపరి తన విశ్వరూపమును అర్జునునకు చూపెను.
(10) అర్జునుడు ఆ విశ్వరూపమున అనంత సంఖ్యలో ముఖములను, నేత్రములను, అద్భుత దృశ్యములను
చూచెను. ఆ రూపము పలు దివ్యాభరణములచే అలంకృతమై, ఎత్తబడి ఉన్న పలు దివ్య ఆయుధ
ము-లను కలిగి ఉండెను. అతడు దివ్యపూమాలలను మరియు వస్త్రములను దాల్చి ఉండెను. పలు
దివ్య సుగంధములు అతని దేహమునకు అలదబడి ఉండెను. అంతయు ఆశ్చర్యమయముగను,
ప్రకాశమానముగను, అనంతముగను, సర్వవ్యాపకముగను ఉండెను. (12) లక్షలాది సూర్యులు ఒక్కసారి
ఆకాశమున ఉదయించినచో వాటి కాంతి విశ్వరూపము నందలి పరమపురుషుని తేజస్సును పోలగలదు.
(13) ఆ సమయమున అర్జునుడు వేవేల సంఖ్యలో విభజింపబడి ఉన్నను ఒకేచోట నిలిచి ఉన్న విశ్వము
యొక్క అనంతరూపములను శ్రీకృష్ణభగవానుని విశ్వరూపమున చూచెను. (14) అంతట సంభ్రమమునకు
గురియైనవాడును, ఆశ్చర్యచకితుడైనవాడును, రోమాంచితుడైనవాడును అగు అర్జునుడు శిరము వంచి
నమస్కరించుచు అంజలిబద్ధుడై దేవదేవుని ప్రార్థింపదొడగెను. (15) అర్జునుడు పలికెను: హే కృష్ణా!
సమస్త దేవతలు, ఇతర సమస్త జీవులు నీ దేహమునందు సమావిష్టులై ఉండుటను నేను చూచుచున్నాను.
పద్మాసనస్థుడైన బ్రహ్మను, శివుని, ఋషులను, దివ్యసర్పములను కూడా నీ యందు నేను దర్శించుచున్నాను.
(16) హే విశ్వప్రభూ! విశ్వరూపా! నీ దేహమునందు అపరిమితముగా సర్వత్ర వ్యాపించి ఉన్న అనేక బాహువులను,
ఉదరములను, ముఖములను, నయనములను నేను చూచుచున్నాను. నీ యందు ఆది మధ్యాంతములు

నేను చూడలేకున్నాను. (17) జ్వలించు అగ్ని లేక అప్రమేయమైన సూర్యకాంతి వలె సర్వదిక్కుల యందు ప్రసరించు
తేజోమయమైన కాంతివలన నీ రూపమును చూచుట కష్టమగుచున్నది. ఐనను పెక్కు కిరీటములు, గదలు,
చక్రములచే అలంకరింపబడిన నీ ఉజ్జ్వల రూపమును సర్వత్ర నేను చూచుచున్నాను. (18) దివ్యమైన ఆది
ధ్యేయము నీవే. విశ్వమంతటికిని పరమాధారము నీవే. అవ్యయుడవు మరియు సనాతనుడవు నీవే. నీవే
శాశ్వత ధర్మమును రక్షించు దేవదేవుడవు. ఇదియే నా అభిప్రాయము. (19) నీవు ఆదిమధ్యాంతరహితుడవై
ఉన్నావు. నీ వైభవము అపరిమితమై ఉన్నది. అసంఖ్యాకములుగా భుజములను కలిగిన నీవు సూర్యచంద్రులను
నేత్రములుగా కలిగి ఉన్నావు. ముఖమునుండి తేజోమయమైన అగ్ని బయల్వెడలుచుండ స్వతేజముతో ఈ
సమస్త విశ్వమును తపింపచేయుచున్నట్లుగా నిన్ను చూచుచున్నాను. (20) నీవు ఒక్కడవే ఐనను సమస్త
ఆకాశమును, సర్వలోకములను మరియు వాని నడుమగల ప్రదేశమునంతటిని వ్యాపించి ఉన్నావు. ఓ మహానుభావా!
అద్భుతమును, భయంకరమును అగు ఈ రూపమును చూచి లోకములన్నియును కలతనొందుచున్నవి
(21) దేవతాసమూహములన్నియును నిన్ను శరణువేడి నీ యందు ప్రవేశించుచున్నవి. వారిలో కొందరు మిగుల
భయవిహ్వలులై దోసిలి ఒగ్గి ప్రార్థనలను కావించుచున్నారు. మహర్షులు, సిద్ధసమూహములు "శాంతి, శాంతి" అని
పలుకుచు వేదమంత్రములచే నిన్ను స్తుతించుచున్నారు. (22) పరమశివుని పలురూపములు, ఆదిత్యులు, వసువులు,
సాధ్యులు, విశ్వేదేవతలు, అశ్వినీకుమారులు, మరుత్తులు, పితృదేవతలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, సిద్ధులు నిన్ను
విస్మితులై చూచుచున్నారు (23) ఓ మహాబాహో! బహుముఖములను, నేత్రములను, భుజములను, ఊరువులను,
పాదములను, ఉదరములను కలిగిన నీ గొప్ప రూపమును, భయంకరమైన నీ బహుదంతములను చూచి దేవతలతో
కూడిన లోకములన్నీ వ్యథ చెందుచున్నవి. వాని వలెనే నేనును కలత చెందుచున్నాను. (24) ఓ సర్వవ్యాపక విష్ణూ!
పలు ప్రకాశవంతమైన వర్ణములతో ఆకాశమును తాకుచు, విప్పారిన వక్త్రములు, తేజోమయమైన నేత్రములు కలిగిన నిన్ను
చూచి నా మనస్సు భీతిచే కలత చెందినది. మనోస్థిరత్వమును కాని, సమత్వమును కాని నేను ఏ మాత్రము నిలుపు
కొనలేకున్నాను. (25) ఓ దేవదేవా! ప్రపంచ శరణ్యా! దయచే నా ఎడ ప్రసన్నుడవగుము. నీ మండుచున్న మృత్యువును
పోలిన ముఖములను మరియు భయంకరములైన దంతములను చూచి సమత్వమును నిలుపుకొనలేక సర్వ
విధముల నేను భ్రాంతుడనైతిని. (26-27) తమ పక్షపు రాజులందరితో సహా ధృతరాష్ట్ర తనయులు, భీష్ముడు, ద్రోణుడు,
కర్ణుడు మరియు మా పక్షపు యోధ ముఖ్యులు కూడా వేగముగా నీ భయంకరమైన నోళ్ళయందు ప్రవేశించు
చున్నారు. వారిలో కొందరు నీ దంతముల నడుమ చూర్ణిత శిరస్కులై తగుల్కొనుటయు నేను చూచుచున్నాను.
(28) నదీప్రవాహములు సముద్రము నందు ప్రవేశించు రీతి, ఈ మహాయోధులందరును నీ నోళ్ళయందు
ప్రవేశించి మండిపోవుచున్నారు (29) జ్వలించు అగ్ని యందు నాశనము కొరకై శలభములు ప్రవేశించు రీతి, జనులు
అందరును అత్యంత వేగముగా నీ వక్త్రములందు ప్రవేశించుచున్నట్లు నేను చూచుచున్నాను. (30) ఓ విష్ణూ! నీవు
సమస్త జనులను నీ మండుచున్న నోళ్ళ ద్వారా అన్ని వైపుల నుండి మ్రింగివేయుచున్నట్లు నేను చూచుచున్నాను.
విశ్వమంతటిని నీ తేజస్సుతో ఆవరించి, భయంకరములును మరియు తాపకారములును అగు కిరణములచే
నీవు వ్యక్తమగుచున్నావు. (31) ఓ దేవవర! భయంకర రూపముతో నున్న నీవెవరో నాకు దయతో తెలియజేయుము.
నీకు వందనములను అర్పించెదను. నాయెడ ప్రసన్నుడవగుము. నీవు ఆదిదేవుడవు. నీ కార్యమును తెలియ
లేకున్నందున నిన్ను గూర్చి నేను తెలిసికొనగోరుచున్నాను (32) దేవదేవుడైన శ్రీకృష్ణభగవానుడు పలికెను:

నేను ఘనమైన లోకవినాశకర కాలమును. జనులందరినీ నశింపచేయుటకే నేను ఇచ్చటకు అరుదెంచితిని.
నీవు తప్ప ఇచ్చట ఉన్న ఇరుపక్ష యోధులందరును చంపబడనున్నారు. (33) అందుచే లెమ్ము! యుద్ధ
సన్నద్ధుడవై కీర్తిని గడింపుము. శత్రువులను జయించి సమృద్ధమైన రాజ్యమును అనుభవింపుము.
ఓ సవ్యసాచీ! నా ఏర్పాటుచే వారందరును ఇదివరకే మరణించినందున ఈ యుద్ధమున నీవు కేవలము
నిమిత్తమాత్రుడవగుము. (34) ద్రోణుడు, భీష్ముడు, జయద్రథుడు, కర్ణుడు, ఇతర మహాయోధులందరును
నాచే ఇదివరకే చంపబడిరి. కావున నీవు వారిని సంహరింపుము. ఏ మాత్రము వ్యథనొందక కేవలము
యుద్ధమును ఒనరింపుము. నీవు తప్పక నీ శత్రువులను రణమున నశింపచేయగలవు. (35) ధృతరాష్ట్రునితో
సంజయుడు పలికెను : ఓ రాజా! దేవదేవుని ఈ పలుకులను వినిన పిమ్మట కంపించుచున్న అర్జునుడు
ముకుళిత హస్తుడై మరల మరల వందనములనొసగెను. భీతిని కూడినవాడై అతడు డగ్గుత్తికతో
శ్రీకృష్ణునితో ఇట్లు పలికెను. (36) అర్జునుడు పలికెను : ఓ హృషీకేశా! నీ నామమును వినినంతనే లోకమంతా
సంతోషించి, ప్రతి ఒక్కరు నీ ఎడ అనురక్తులగుచున్నారు. సిద్ధ సమూహములు నీకు గౌరవపూర్వముగా
అంజలి ఘటించుచున్నను రాక్షసులు భీతి చెందినవారై పలు దిక్కుల పలాయనమగుచున్నారు. ఇది
అంతా యుక్తముగనే ఉన్నది. (37) ఓ మహాత్మా! బ్రహ్మదేవుని కంటెను ఘనమైన వాడా! నీవే ఆది
సృష్టికర్తవు. అట్టి నీకు వారెందులకు నమస్సులు అర్పింపరు? ఓ అనంతా! దేవదేవా! జగన్నివాసా!
నీవు అక్షయమగు మూలమువు. సర్వకారణ కారణుడవు. ఈ భౌతిక సృష్టికి అతీతుడవు.
(38) నీవు ఆదిదేవుడవు, సనాతన పురుషుడవు, విశ్వమునకు ఉత్కృష్టమైన ఆశ్రయమువు. నీవే సర్వమును
ఎరిగినవాడవు, తెలియదగిన సర్వము నీవే. ప్రకృతిగుణములకు అతీతుడవైన నీవే దివ్యశరణ్యుడవు.
ఓ అనంతరూపా! ఈ సమస్త విశ్వము నీచే ఆవరింపబడి ఉన్నది. (39) వాయువును మరియు పరమ
నియామకుడను నీవే. కనుకనే వేయినమస్కారములు చేయుచు, మరల మరల వందనములను అర్పించుచున్నాను.
(40) నీకు ముందునుండి, వెనుకనుండి, సర్వదిక్కులనుండి నమస్కారములను అర్పించుచున్నాను. ఓ అనంతవీర్యా!
నీవు అమితవిక్రమ సంపన్నుడవు మరియు సర్వవ్యాపివి. కనుకనే సర్వమును నీవే ఐ ఉన్నావు. (41-42) నీ మహిమను
తెలియక నన్ను మిత్రునిగా భావించి "ఓ కృష్ణా", "ఓ యాదవా", "ఓ మిత్రమా" అని తొందరపాటుగా సంబోధించితిని. ప్రేమతో గాని
లేదా మూర్ఖత్వముతో గాని నేనొనరించిన దానినంతటిని కరుణతో క్షమింపుము. మనము విశ్రాంతి గొనునప్పుడు, ఒకే శయ్యపై
శయనించినప్పుడు, కూర్చుండినప్పుడు, కలిసి భుజించినప్పుడు ఒంటరిగా కొన్నిమార్లు మరియు పలుమిత్రుల సమక్షమున
మరికొన్నిమార్లు నిన్ను నేను వేళాకోళముగా అగౌరవపరచితిని. ఓ అచ్యుతా! ఆ అపరాధములన్నింటికిని నన్ను క్షమింపుము.
(43) స్థావర, జంగమ పూర్ణమైన ఈ సమస్త విశ్వమునకు నీవే తండ్రివి. దానికి ముఖ్యపూజనీయుడగు పరమ ఆధ్యాత్మిక
గురుడవు నీవే. నీతో సమానమైనవాడు గాని, ఏకమైనవాడు గాని మరొకడుండడు. ఓ అపరిమిత శక్తి సంపన్నుడా! అట్టి
ఎడ నీకన్నను అధికుడు ముల్లోకములలో ఎవడుండును? (44) నీవు ప్రతిజీవికిని పూజనీయుడవైన దేవదేవుడవు. కనుకనే
సాష్టాంగపడి గౌరవపూర్వక వందనములను అర్పించుచు నీ కరుణకై వేడుచున్నాను. కుమారుని మొండితనమును తండ్రి,
మిత్రుని అమర్యాదను మిత్రుడు, ప్రియురాలిని ప్రియుడు సహించునట్లు, నీ ఎడ ఒనరించిన నా తప్పులను దయతో
సహింపుము. (45) ఇదివరకెన్నడును చూడనటువంటి ఈ విశ్వరూపమును చూచి నేను మిగుల సంతోషించితిని. కాని అదే
సమయమున మనస్సు భయముతో కలత చెందినది. కనుక ఓ దేవదేవా! జగన్నివాసా! నా ఎడ కరుణను చూపి

నీ దేవదేవుని రూపమును తిరిగి నాకు చూపుము. (46) ఓ విశ్వరూపా! సహస్రబాహో! కిరీటమును ధరించి శంఖము, చక్రము, గద, పద్మములను హస్తములందు కలిగి ఉండెడి నీ చతుర్భుజ రూపమును చూడకోరుదును. నిన్ను ఆ రూపము నందు గాంచ నేను అభిలషించుచున్నాను. (47) శ్రీకృష్ణభగవానుడు పలికెను: ఓ అర్జునా! ప్రసన్నుడనైన నేను నా అంతరంగిక శక్తిచే భౌతిక జగమునందలి ఈ దివ్యమగు విశ్వరూపమును నీకు చూపితిని, తేజోమయమును, అనంతమును, ఆద్యమును అగు ఈ రూపమును నీకు ముందెవ్వరును చూచి ఉండలేదు. (48) ఓ కురుప్రవీరా! వేదాధ్యయనము చేత కాని, యజ్ఞముల చేతకాని, దానముల చేతకాని, పుణ్యకర్మల చేతకాని, ఉగ్రమగు తపస్సుల చేతకాని భౌతిక జగమున ఈ రూపములో నేను దర్శింపబడనందున నా ఈ విశ్వరూపమును నీకు పూర్వము ఎవ్వరును చూచి ఉండలేదు.
(49) నా ఈ ఘోరరూపమును చూచి కలతనొందిన వాడవు, భ్రాంతుడవు ఐతివి. అది అంతయు ఇప్పుడు అంతరించును! ఓ భక్తుడా! అన్ని కలతల నుండి విముక్తుడవై నీవు కోరిన రూపమును ప్రశాంత మనస్సుతో ఇప్పుడు చూడుము.
(50) ధృతరాష్ట్రునితో సంజయుడు పలికెను: దేవదేవుడైన శ్రీకృష్ణుడు ఆ విధముగా అర్జునునితో పలికి తన చతుర్భుజ రూపమును ప్రదర్శించెను. భీతుడైన అర్జునునకు ఆ విధముగా ఆశ్వాసమును కూర్చుచు అంత్యమున తన ద్విభుజ రూపమును చూపెను. (51) ఆ విధముగా అర్జునుడు శ్రీకృష్ణుని ఆద్యరూపమును చూచినంత ఇట్లు పలికెను: ఓ జనార్దనా! అత్యంత సుందరమైన ఈ నీ రూపము చూచి శాంతచిత్తుడనై నా సహజస్వభావమును పొందితిని.
(52) శ్రీకృష్ణభగవానుడు పలికెను: ఓ అర్జునా! నీవిప్పుడు దర్శించుచున్న నా ఈ రూపము చూచుటకు మిగుల దుర్లభమైనది. అత్యంత ప్రియమైన ఈ రూపమును దర్శించు అవకాశమునకై దేవతలు సైతము నిత్యము వేచి ఉందురు.
(53) దివ్య చక్షువులతో నీవు చూచుచున్న ఈ రూపము వేదాధ్యయనముచే కాని, తీవ్ర తపస్సులచే కాని, దానముచే కాని, పూజచే కాని అవగతము కాదు. మనుజుడు నన్ను యథార్థముగా చూచుటకు ఇవన్నియును సాధనములు కావు.
(54) ఓ అర్జునా! కేవలము అనన్యభక్తి చేతనే నేను యథార్థముగా నీ ఎదుట నిలబడినరీతి తెలియబడగలను, ప్రత్యక్షముగా దర్శింపబడుదును. ఈ విధముగనే నీవు నా అవగాహనా రహస్యములందు ప్రవేశింపగలవు
(55) ఓ అర్జునా! కామ్యకర్మలు, మనోకల్పనలనెడి కల్మషముల నుండి విడివడి నా శుద్ధభక్తి యందు నియుక్తుడయ్యెడి వాడును, నన్నే తన జీవిత పరమగమ్యముగా భావించి నా కొరకై కర్మనొనరించువాడును, సర్వజీవుల ఎడ మిత్రత్వమును కలిగినవాడును అగు మనుజుడు తప్పక నన్నే చేరగలడు.

12. భక్తి యోగము

(1) అర్జునుడు ప్రశ్నించెను: నీ భక్తియుత సేవలో సదా యుక్తముగా నియుక్తులైనవారు మరియు అవ్యక్త నిరాకార బ్రహ్మమును ధ్యానించువారు అను ఇరువురిలో ఎవరు మిగుల పరిపూర్ణులని భావింపబడుదురు? (2) శ్రీకృష్ణ భగవానుడు పలికెను: నా స్వీయ రూపమునందు లగ్నము చేసి దివ్యమును, ఘనమును అగు శ్రద్ధతో సదా నా అర్చనమునందు నియుక్తులైనవారు అత్యంత పరిపూర్ణులని నేను భావింతును (3-4) ఇంద్రియాతీతమును, సర్వవ్యాపకమును, అచింత్యమును, మార్పురహితమును, స్థిరమును, అచలమును అగు అవ్యక్త తత్త్వమును సర్వేంద్రియనిగ్రహము మరియు సర్వుల ఎడ సమభావము కలిగి పూర్ణముగా ఉపాసించు సర్వభూతహితులైనవారు సైతము అంత్యమున నన్ను పొందుదురు. (5) పరమ పురుషుని అవ్యక్త, నిరాకార తత్త్వము నందు ఆసక్తమైన చిత్తము కలవారికి పురోగతి అనునది మిగుల క్లేశకరము. ఆ విధానమున ప్రగతి సాధించుట దేహధారులకు ఎల్లప్పుడును కష్టతరము. (6-7) కాని పార్థా! సర్వకర్మలను నాకు అర్పించి అన్యచింతలేక నాకు భక్తుడవై మనస్సును

నా అందే లగ్నము చేసి సదా నన్ను ధ్యానించుచు, నా భక్తియుత సేవలో నన్ను అర్చించెడివారిని శీఘ్రమే జనన మరణమను సంసారసాగరము నుండి ఉద్ధరింతును. (8) దేవదేవుడనైన నా అందే నీ మనస్సును స్థిరముగా నిలుపుము మరియు నీ బుద్ధి నంతయును నా అందే నియుక్తము కావింపుము. ఈ విధముగా సదా నా అందే నీవు నిస్సంశయముగా నివసింతువు. (9) ఓ అర్జునా! ధనంజయా! స్థిరముగా నా యందు మనస్సును లగ్నము చేయ నీవు సమర్థుడవు కానిచో, భక్తియోగము యందలి విధివిధానములను అనుసరింపుము. ఆ రీతిని నన్ను పొందు కోరికను వృద్ధి చేసికొనుము. (10) భక్తియోగ నియమములను కూడా నీవు అభ్యసింపలేనిచో నా కొరకు కర్మ ఒనరించుటకు యత్నింపుము. ఏలనా నా కొరకు కర్మ చేయుట ద్వారా నీవు పూర్ణస్థితిని పొందగలవు (11) ఐనను ఒకవేళ నా భావనలో కర్మను చేయుట యందును నీవు అసమర్థుడవైనచో సర్వకర్మఫలములను త్యాగము చేసి ఆత్మస్థితుడవగుటకు యత్నింపుము (12) ఈ అభ్యాసమును నీవు చేయలేకపోయినచో జ్ఞాన సముపార్జనము నందు నియుక్తుడవగుము. ఐనప్పటికిని జ్ఞానముకన్నను ధ్యానము మేలైనది. కాని త్యాగము వలన మనుజుడు మనశ్శాంతిని పొందగలుగుటచే సర్వకర్మఫల త్యాగము ఆ ధ్యానముకన్నను మేలైనది. (13-14) ద్వేషమనునది లేకుండ సర్వజీవుల ఎడ మైత్రిని కలిగినవాడును, మమత్వము లేనివాడును, మిథ్యాహంకార రహితుడును, సుఖదుఃఖములు రెండింటి యందును సమభావము కలవాడును, క్షమాగుణము కలవాడును, సదా సంతుష్టుడైనవాడును, ఆత్మనిగ్రహము కలవాడును, తన మనోబుద్ధులను నా యందు లగ్నము చేసి దృఢనిశ్చయముతో నా భక్తి యందు నియుక్తుడైనట్టి వాడును అగు నా భక్తుడు నాకు అత్యంత ప్రియుడు (15) ఎవ్వరికినీ కష్టము కలిగించనివాడును, ఎవరి చేతను కలతకు గురికానివాడును, సుఖదుఃఖములందును మరియు భయోద్వేగములందును సమచిత్తునిగా ఉండువాడును అగు మనుజుడు నాకు మిక్కిలి ప్రియుడు. (16) సాధారణ కార్యకలాపములను ఆశ్రయింపనివాడును, పవిత్రుడును, సమర్థుడును, ఉదాసీనుడును, సర్వక్లేశముల నుండి ముక్తుడైనవాడును, ఏదేని ఫలము కొరకై తీవ్రకృషి చేయనివాడును అగు నా భక్తుడు నాకు మిగుల ప్రియుడు.

(17) ఉప్పొంగుటగాని దుఃఖించుటగాని తెలియనివాడు, శోకించుటగాని వాంఛించుటగాని ఎరుగనివాడు, శుభాశుభములు రెండింటిని త్యాగము చేసినవాడును అగు భక్తుడు నాకు మిక్కిలి ప్రియుడు. (18-19) శత్రుమిత్రుల ఎడ సమభావము కలిగినవాడును, మానావమానములందు, శీతోష్ణములందు, సుఖదుఃఖములందు, నిందాస్తుతులందు సమబుద్ధి కలిగినవాడును, అసత్సంగము నుండి సదా విడివడి ఉండువాడును, సదా మౌనియైనవాడును, దేని చేతనైనను సంతుష్టి పొందెడివాడును, నివాసమేదైనను లెక్కచేయనివాడును, జ్ఞానమునందు స్థితుడైనవాడును, నా భక్తియుత సేవ యందు నియుక్తుడైనట్టివాడును అగు మనుజుడు నాకు అత్యంత ప్రియుడు. (20) నన్నే పరమగమ్యముగా చేసికొని భక్తియోగము అను ఈ అమృతపథమును అనుసరించుచు శ్రద్ధతో దీని యందు సంపూర్ణముగా నియుక్తులైనవారు నాకు అత్యంత ప్రియులు.

13. ప్రకృతి, పురుషుడు, చైతన్యము

(1-2) అర్జునుడు పలికెను: ఓ కృష్ణా! ప్రకృతి మరియు పురుషుని గూర్చియు, క్షేత్రము మరియు క్షేత్రమును ఎరిగిన వానిని గూర్చియు, జ్ఞానము మరియు జ్ఞానలక్ష్యమును గూర్చియు నేను తెలియగోరుచున్నాను. శ్రీకృష్ణభగవానుడు పలికెను: ఓ కౌంతేయా! ఈ దేహము క్షేత్రమనియు మరియు ఈ దేహమును ఎరిగినవాడు క్షేత్రజ్ఞుడని పిలువబడును. (3) ఓ భరతవంశీయుడా! సర్వదేహములందును నేను కూడా క్షేత్రజ్ఞుడనని నీవు తెలిసికొనుము. దేహమును మరియు దానిని ఎరిగిన క్షేత్రజ్ఞుని అవగాహన చేసికొనుటయే జ్ఞానమని నా అభిప్రాయము. (4) ఇప్పుడు క్షేత్రమును, అది నిర్మింపబడిన

విధానమును, దాని అందలి మార్పులను, దేని నుండి అది ఉత్పన్నమైనదనెడి విషయమును, క్షేత్రజ్ఞుడు మరియు అతని
ప్రభావములను గూర్చిన నా సంక్షిప్తవర్ణనను ఆలకింపుము (5) క్షేత్రము, క్షేత్రజ్ఞులను గూర్చిన ఆ జ్ఞానము పలువురు
ఋషులచే వివిధ వేదగ్రంథములందు వర్ణింపబడినది. అట్టి జ్ఞానము విశేషముగా వేదాంతసూత్రములందు కార్య
కారణములతో హేతుబద్ధముగా ప్రకటింపబడినది. (6-7) పంచమహాభూతములు, మిథ్యాహంకారము, బుద్ధి,
అవ్యక్తము, దశేంద్రియములు, మనస్సు, ఐదు ఇంద్రియార్థములు, కోరిక, ద్వేషము, సుఖము, దుఃఖము, సముదాయము,
జీవలక్షణములు, విశ్వాసము అనునవి సంగ్రహముగా కర్మక్షేత్రముగను, దాని అంతర్ప్రక్రియలుగను భావింప
బడుచున్నవి. (8-12) వినమ్రత, గర్వరాహిత్యము, అహింస, సహనము, సరళత్వము, ప్రామాణికగురువును ఆశ్రయించుట,
శుచిత్వము, స్థిరత్వము, ఆత్మనిగ్రహము, ఇంద్రియార్థముల పరిత్యాగము, మిథ్యాహంకారరాహిత్యము, జన్మమృత్యుజరా
వ్యాధుల దోషమును గుర్తించుట, అనాసక్తి, పుత్రకళత్ర గృహాదుల బంధము నుండి విముక్తి, సుఖదుఃఖ సమయము
లందు సమభావము, నా యందు నిత్యమగు అనన్యభక్తి, ఏకాంతవాస కోరిక, సాధారణజనుల సహవాసమందు అనాసక్తి,
ఆధ్యాత్మ జ్ఞానపు ప్రాముఖ్యమును అంగీకరించుట, పరతత్త్వము యొక్క తాత్త్వికాన్వేషణము అనునవన్నియు జ్ఞానమని నేను
ప్రకటించుచున్నాను. వీటికి అన్యమైనది ఏదైనను అజ్ఞానమే. (13) దీనిని తెలిసికొనుట ద్వారా నీవు అమృతత్వమును
ఆస్వాదింపగలవో అట్టి తెలియదగినదానిని నేను వివరింతును. అనాదియును, నాకు అధీనమును అగు బ్రహ్మము ఈ
భౌతిక జగత్తు కార్యకారణములకు అతీతమై ఉండును. (14) సర్వత్ర అతని హస్తములు, పాదములు, నయనములు,
శిరములు, ముఖములు, కర్ణములు వ్యాపించి ఉన్నవి. ఈ విధముగా పరమాత్మ సర్వమును ఆవరించి నిలిచి ఉండును.
(15) పరమాత్ముడు సర్వేంద్రియములకు మూలాధారుడైనను ఇంద్రియరహితుడు. అతడు సర్వజీవులను పోషించువాడైనను
ఆసక్తి లేనట్టివాడు. అతడు ప్రకృతి త్రిగుణములకు అతీతుడే కాక వాటికి ప్రభువును ఐ ఉన్నాడు. (16) పరమాత్ముడు
స్థావర జంగములైన సర్వజీవుల అంతర్బాహ్యములలో నిలిచి ఉండును. సూక్ష్మత్వకారణముగా అతడు భౌతికేంద్రియములకు
అగోచరుడును, అగ్రాహ్యుడను ఐ ఉన్నాడు. అతిదూరమున ఉన్నను అతడు సర్వులకు సమీపమునే ఉండును.
(17) పరమాత్ముడు జీవులందు విభజింపబడినట్లు కనిపించినను అతడెన్నడును విభజింపబడక ఏకమై నిలిచి
ఉండును. సర్వజీవులను పోషించువాడైనను, సర్వులను కబళించునది మరియు వృద్ధినొందించునది అతడే అని
అవగాహనము చేసికొనవలెను. (18) తేజోపూర్ణములైన సర్వములందు తేజమునకు కారణుడతడే. భౌతికత్వమును
అంధకారమునకు అతీతుడైన అతడు అవ్యక్తుడు. జ్ఞానము, జ్ఞానవిషయము, జ్ఞానగమ్యము కూడా అతడే. అతడే ఎల్లరి
హృదయములందు స్థితుడై ఉన్నాడు. (19) ఈ విధముగా క్షేత్రము, జ్ఞానము, జ్ఞేయములను గూర్చి నాచే సంక్షేపముగా
చెప్పబడినది. కేవలము నా భక్తులే దీనిని పూర్తిగా అవగాహనము చేసికొని నన్ను పొందగలరు. (20) జీవులు మరియు
భౌతిక ప్రకృతి అనాది అని తెలిసికొనవలెను. వాని అందలి పరివర్తనములు మరియు భౌతికగుణములు అనునవి భౌతికప్రకృతి
నుండి ఉత్పన్నమైనవి. (21) భౌతిక కార్యకారణములన్నింటికిని ప్రకృతియే హేతువని, జగమునందలి పలు సుఖదుఃఖముల భవము
లకు జీవుడే కారణమని చెప్పబడుచున్నది (22) భౌతిక ప్రకృతి యందు త్రిగుణములను అనుభవించుచు జీవుడు ఈ
విధముగా జీవనము సాగించును. భౌతిక ప్రకృతి యందు త్రిగుణములననుభవించుచూ జీవుడు భౌతికప్రకృతితో
అతనికిగల సంగత్వము దీనికి కారణము. ఆ విధముగా అతడు ఉత్తమ, అధమ జన్మలను పొందుచుండును (23) ఐనను ఈ
దేహమునందు దివ్యప్రభువును, దివ్యయజమానుడును, పర్యవేక్షకుడును, అంగీకరించువాడును, పరమాత్మగా తెలియబడు
వాడును అగు దివ్యభోక్త మరియొకడు కలడు (24) భౌతిక ప్రకృతి, జీవుడు, త్రిగుణముల అంతర్ప్రక్రియకు సంబంధించిన

ఈ తత్త్వమును అవగాహన చేసికొనినవాడు నిశ్చయముగా మోక్షమును పొందును. అతని వర్తమానస్థితి ఎట్లున్నను అతడు తిరిగి జన్మించడు (25) పరమాత్మను కొందరు ధ్యానము చేతను, మరికొందరు జ్ఞానాభ్యాసము చేతను, ఇంకను కొందరు నిష్కామకర్మ చేతను తమ అందే దర్శింతురు (26) ఇంకొందరు ఆధ్యాత్మిక జ్ఞానముతో పరిచయము లేకున్నను ఇతరుల నుండి పరమపురుషుని గూర్చి శ్రవణము చేసి అతనిని పూజించుట ఆరంభింతురు. ప్రామాణికుల నుండి శ్రవణము చేయు ప్రవృత్తి కలవారగుటచే వారును జనన మరణ మార్గమును తరింపగలరు. (27) ఓ భరతవంశ శ్రేష్ఠుడా! స్థితిని కలిగి ఉన్నట్టి స్థావర జంగములలో నీవు చూచునది ఏదైనను క్షేత్రక్షేత్రజ్ఞుల సంయోగమేనని తెలిసికొనుము (28) సర్వదేహములందు ఆత్మను కూడి ఉండు పరమాత్మను చూచువాడు మరియు నాశవంతమైన దేహమునందలి ఆత్మ, పరమాత్మ ఇరువురిని ఎన్నడును నశింపనివారుగ తెలిసికొనగలిగినవాడు యథార్థ దృష్టిని కలిగినవాడు. (29) సర్వత్ర ప్రతిజీవి అందును సమముగా నిలిచి ఉండు పరమాత్మను దర్శించువాడు తన మనస్సుచే తనను తాను హీనపరచుకొనడు. ఆ విధముగా అతడు పరమగతిని పొందగలడు. (30) భౌతిక ప్రకృతిచే సృష్టింపబడిన దేహము చేతనే సర్వకార్యములు ఒనరింపబడుచున్నవని మరియు తాను అకర్తననియు చూడగలిగినవాడు యథార్థ దృష్టిని కలిగినవాడు (31) బుద్ధిమంతుడైనవాడు భిన్నదేహముల కారణముగా భిన్న వ్యక్తిత్వములను దర్శించుటను విరమించి, జీవులు ఏ విధముగా సర్వత్రా విస్తరించిరో చూచి నపుడు బ్రహ్మభావమును పొందును. (32) నిత్యదృష్టి కలిగినవారు అవ్యయమైన ఆత్మను దివ్యమైనదిగను, నిత్యమైనదిగను, త్రిగుణాతీతమైనదిగను దర్శింతురు. ఓ అర్జునా! అట్టి ఆత్మ దేహముతో సంపర్కము కలిగి ఉన్నను కర్మ ఒనరింపదు మరియు బద్ధము కాదు. (33) సర్వత్ర వ్యాపించి ఉన్నను సూక్ష్మత్వ కారణముగా ఆకాశము దేనితోను కలియనట్లు, బ్రహ్మభావములో నిలిచిన ఆత్మ దేహమునందు నిలిచి ఉన్నను దేహముతో కలియదు. (34) ఓ భరతవంశీయుడా! ఒక్కడే ఐనను సూర్యుడు లోకమునంతటిని ప్రకాశింపచేయునట్లు, దేహమునందలి ఆత్మ సమస్త దేహమును చైతన్యముతో ప్రకాశింపచేయును. (35) దేహము మరియు దేహము నెరిగిన క్షేత్రజ్ఞునకు నడుమగల భేదమును జ్ఞానదృష్టితో దర్శించి, ప్రకృతి బంధము నుండి మోక్షమును పొందు విధానము తెలిసినవారు పరమగతిని పొందగలరు.

14. ప్రకృతి త్రిగుణములు

(1) దేవదేవుడైన శ్రీకృష్ణుడు పలికెను: దేనిని తెలిసికొని మునులందరును పరమసిద్ధిని పొందిరో అట్టి జ్ఞానములలో కెల్ల ఉత్తమమైన ఈ దివ్యజ్ఞానమును నీకిప్పుడు నేను మరల తెలిపెదను. (2) ఈ జ్ఞానమునందు స్థిరముగా నిలుచుట ద్వారా మనుజుడు నా దివ్యత్వము వంటి దివ్యత్వమును పొందగలడు. ఆ విధముగా ప్రతిష్ఠితుడై అతడు సృష్టి సమయమున జన్మించడు లేదా ప్రళయ సమయమున వ్యథ చెందడు (3) ఓ భరతవంశీయుడా! బ్రహ్మముగా పిలువబడు మహత్తత్త్వము సమస్త జననమునకు ఆధారమై ఉన్నది. సర్వజీవుల జన్మను సంభవింపచేయుచు నేనే ఆ బ్రహ్మమునందు బీజప్రదానము కావించుచున్నాను. (4) ఓ కౌంతేయా! సర్వజీవ సముదాయము భౌతికప్రకృతి అందు జన్మించుట చేతనే సృష్టింపబడుచున్నదని మరియు నేనే వాటికి బీజప్రదాతనైన తండ్రిననియు అవగాహన చేసికొనవలెను. (5) ఓ మహాబాహుడవైన అర్జునా! భౌతికప్రకృతి సత్త్వరజస్తమోగుణములనెడి మూడు గుణములను కలిగి ఉండును. నిత్యుడైన జీవుడు ప్రకృతితో సంపర్కమును పొందినప్పుడు ఈ గుణములచే బంధితుడగును. (6) ఓ పాపరహితుడా! సత్త్వగుణము మిగిలిన రెండు గుణములు కన్నను పవిత్రమైనదగుటచే ప్రకాశమానమై యుండి మానుని సర్వపాపఫలము నుండి ముక్తుని చేయును. ఆ గుణమునందున్నవారు సుఖ భావన చేతను, జ్ఞాన భావన చేతను బద్ధులగుదురు.

(7) ఓ కౌంతేయా! అపరిమితములైన కోరికలు మరియు ఆకాంక్షల వలన రజోగుణము ఉత్పన్నమగుచున్నది. దీని కారణమున జీవుడు కామ్యకర్మలచే బద్ధుడగును. (8) ఓ భరతవంశీయుడా! అజ్ఞానము వలన పుట్టిన తమోగుణము దేహధారులకు మోహకారణమని ఎరుగుము. జీవుని బంధించునట్టి బుద్ధిహీనత, సోమరితనము, నిద్ర అనునవి ఈ తమోగుణపు ఫలములై ఉన్నవి. (9) ఓ భరతవంశస్థుడా! సత్త్వగుణము మనుజుని సౌఖ్యమునందు బంధించును, రజోగుణము అతనిని కామ్యకర్మమునందు బంధించును, తమోగుణము జ్ఞానమును కప్పివేయుట ద్వారా బుద్ధిహీనత అందు అతనిని బంధించును. (10) ఓ భరతవంశస్థుడా! కొన్నిమార్లు రజస్తమోగుణములను జయించి సత్త్వగుణము ప్రబలమగుచుండును. మరికొన్నిమార్లు రజోగుణము సత్త్వ, తమోగుణములను జయించుచుండును. మరికొన్నిమార్లు తమోగుణము సత్త్వ, రజోగుణములను జయించుచుండును. ఈ విధముగా గుణముల నడుమ ఆధిపత్యము కొరకు సదా పోటీ జరుగుచుండును. (11) దేహద్వారములన్నియును జ్ఞానముచే ప్రకాశవంతమైనప్పుడు సత్త్వగుణము యొక్క వ్యక్తీకరణము అనుభవమునకు వచ్చును. (12) ఓ భరతవంశశ్రేష్ఠుడా! రజోగుణము వృద్ధినొందినప్పుడు లోభము, కామ్యకర్మము, తీవ్రయత్నము, అదుపుసాధ్యముకాని కోరిక, తపన అను లక్షణములు వృద్ధినొందును (13) ఓ కురునందనా! తమోగుణము వృద్ధినొందినప్పుడు అంధకారము, సోమరితనము, బుద్ధిహీనత, భ్రాంతి అనునవి వ్యక్తములగును. (14) సత్త్వగుణము నందుండి మరణించినవాడు మహర్షుల యొక్క ఉన్నత పవిత్రలోకములను పొందును. (15) రజోగుణము నందుండి మరణించినవాడు కామ్యకర్మరతుల అందు జన్మించును. తమోగుణము నందుండి మరణించినవాడు జంతుజాలమున జన్మించును. (16) పుణ్యకర్మ ఫలితమైన నిర్మలత్వము సత్త్వగుణ ప్రధానమైనదిగా చెప్పబడును. కాని రజోగుణము దుఃఖమును, తమోగుణ కర్మము అజ్ఞానమును కలిగించును (17) సత్త్వగుణము నుండి వాస్తవజ్ఞానము వృద్ధినొందును. రజోగుణము నుండి లోభము వృద్ధినొందగా, తమోగుణము నుండి అజ్ఞానము, బుద్ధిహీనత, భ్రాంతి అనునవి వృద్ధినొందుచున్నవి. (18) సత్త్వగుణమునందున్నవారు క్రమముగా ఊర్ధ్వలోకములకు ఉద్ధరింపబడుదురు. రజోగుణము నందున్నవారు భూలోకమునందు నివసింతురు. హేయమైన తమోగుణమునందున్నవారు నరకలోకములకు పతనము చెందుదురు (19) సర్వకర్మలయందును ప్రకృతి త్రిగుణములకన్నను అన్యమైన కర్త వేరొకడు లేడని చక్కగా దర్శించి, త్రిగుణాతీతమైన పరమాత్మను ఎరుగగలిగినప్పుడు మనుజుడు నా దివ్యభావమును పొందగలడు. (20) దేహధారి అగు జీవుడు దేహముతో కూడి ఉన్న ఈ త్రిగుణములను దాటగలిగినప్పుడు జనన, మరణ, వార్ధక్యముల నుండియు మరియు వాని దుఃఖముల నుండి విడివడి ఈ జన్మమునందే అమృతత్వమును పొందును. (21) అర్జునుడు ప్రశ్నించెను: హే ప్రభూ! ఈ త్రిగుణములకు అతీతుడైనవాడు ఏ లక్షణముల ద్వారా తెలియబడును? అతని ప్రవర్తనమెట్టిది? ప్రకృతి త్రిగుణములను అతడు ఏవిధముగా అధిగమించును? (22-25) దేవదేవుడైన శ్రీకృష్ణుడు పలికెను: పాండుపుత్రా! ప్రకాశము, ఆసక్తి, మోహము కలిగినప్పుడు వాటిని ద్వేషింపనివాడును మరియు అవి లేనప్పుడు ఆకాంక్షింపనివాడును; గుణములే పనిచేయుచున్నవని తెలిసి వాని ద్వారా కలుగు ఈ ప్రకారముల అందు నిశ్చయత్వమును మరియు స్థిరత్వమును కలిగి ఉదాసీనునిగను, దివ్యునిగాను నిలుచువాడును; ఆత్మ అందే స్థితుడై సుఖదుఃఖములు ఏకమని భావించెడివాడును; మట్టి ముద్ద, రాయి, బంగారములను సమముగా వీక్షించెడివాడును; ప్రియ అప్రియములందు సమముగా వర్తించెడివాడును; నిందాస్తుతుల అందు, మానావమానముల అందు సమత్వమున నిలుచు ధీరుడును; శత్రుమిత్రులను సమముగా చూచువాడును; సర్వములైన భౌతిక కర్మలను విడిచిన వాడును అగు మనుజుడు ప్రకృతి త్రిగుణములను దాటినవాడుగా చెప్పబడును. (26) అన్ని పరిస్థితుల అందును అకుంఠితముగా నా పూర్ణమగు భక్తియుత సేవ అందు నియుక్తుడగువాడు శీఘ్రమే

ప్రకృతి త్రిగుణములను దాటి బ్రహ్మభావమును పొందును (27) అమృతమును, అనశ్వరమును, శాశ్వతమును, చరమ సుఖపు సహజస్థితి అగు నిరాకార బ్రహ్మమునకు నేను మూలాధారమును.

15. పురుషోత్తమ యోగము

(1) పురుషోత్తముడగు శ్రీకృష్ణ భగవానుడు పలికెను: వ్రేళ్ళు ఊర్ధ్వముగను, శాఖలు క్రిందుగను, వేదఋక్కులే ఆకులుగను కలిగిన శాశ్వతమైన అశ్వత్థవృక్షమొకటి కలదని చెప్పబడును. ఆ వృక్షము నెరిగినవాడే వేదములనెరిగినవాడు (2) ఈ వృక్ష శాఖలు ప్రకృతి త్రిగుణములచే పోషింపబడి ఊర్ధ్వ, అధో ముఖములుగా వ్యాపించి ఉన్నవి. దీని చిగుళ్ళే ఇంద్రియార్థములు, అధో ముఖముగను ఉన్న ఈ వృక్షపు వ్రేళ్ళు మనుష్యలోకపు కామ్యకర్మలకు సంబంధించినవై ఉన్నవి. (3-4) ఈ వృక్షపు యథార్థ రూపము ఈ జగమునందు తెలియబడదు. దాని ఆదిగాని, అంతముగాని లేదా మూలముగాని ఎవ్వరును అవగతము చేసికొనజాలరు. కాని స్థిరముగా నాటుకొని ఉన్న ఈ సంసారవృక్షమును మనుజుడు దృఢచిత్తముతో అసంగమను శస్త్రముచే ఖండించి వేయవలెను. ఆ పిదప పునరావృత్తి రహితమైన దివ్యపదమును పొందుటకు ప్రయత్నించి, అనాదికాలము నుండి ఎవ్వని వలన సమస్తము ఆరంభమయ్యెనో మరియు వ్యాప్తినొందెనో అట్టి పరమపురుషుని అతని శరణు పొందవలెను. (5) మిథ్యాహంకారము, భ్రాంతి, దుస్సాంగత్యముల నుండి విడివడినవారును, శాశ్వతత్వమును అవగతము చేసికొనినవారును, కామవర్జితులును, సుఖదుఃఖములనెడి ద్వంద్వముల నుండి బయటపడినవారును, భ్రాంతి రహితులై ఏ విధముగా పరమపురుషుని శరణువేడవలెనో తెలిసినవారు అగు మనుజులు అట్టి అవ్యయపదమును పొందగలరు. (6) అట్టి నా దివ్యధామము సూర్యునిచే గాని, చంద్రునిచే గాని లేదా అగ్నివిద్యుత్తులచే గాని ప్రకాశింపబడదు. దానిని చేరినవారు తిరిగి ఈ భౌతిక జగమునకు మరలిరారు. (7) ఈ బద్ధ భౌతిక జగమునందలి జీవులందరును నా శాశ్వతాంశములు, బద్ధజీవనము కారణముగా మనస్సుతో కలిపి ఆరైన ఇంద్రియములను గూడినవారు తీవ్ర సంఘర్షణ కావించుచున్నారు. (8) వాయువు గంధమును మోసుకొనిపోవునట్లు, జీవుడు ఈ భౌతిక జగమున తన వివిధ భావములను ఒక దేహము నుండి వేరొక దేహమునకు కొనిపోవుచుండును. ఈ విధముగా అతడు ఒక దేహమును గ్రహించి, తిరిగి వేరొక దేహమును పొందుటకై దానిని విడుచుచుండును. (9) ఈ విధముగా జీవుడు వేరొక స్థూలదేహమును గ్రహించి మనస్సుతో కూడి ఉన్న ఒకానొక రకమైన కర్ణములు, నయనములు, జిహ్వ, నాసిక, స్పర్శను పొందును. ఆ విధముగా అతడు ఒక ప్రత్యేకరకమగు ఇంద్రియార్థములను అనుభవించును. (10) జీవుడు ఏ విధముగా తన దేహమును విడుచుననిగాని, గుణముల కారణముగా అనుభవార్థమై ఏ దేహమును పొందబోవుననిగాని మూఢులు ఎరుగజాలరు. కాని జ్ఞానచక్షువులు కలిగినవారు ఈ విషయమును చక్కగా చూడగలరు (11) ఆత్మానుభవమునందు స్థితిని పొందిన యత్నశీలురైన యోగులు దీనినంతటిని స్పష్టముగా చూడగలరు. కాని అచేతనులు మరియు ఆత్మానుభవమునందు స్థితిని పొందనివారు ప్రయత్నించినను ఏమి జరుగుచున్నదో చూడలేరు. (12) సమస్త జగమునందలి అంధకారమును నశింపచేయు సూర్యుని తేజస్సు నా నుండియే ఉద్భవించుచున్నది. అదే విధముగా చంద్రుని తేజస్సు మరియు అగ్నితేజము కూడా నా నుండియే కలుగుచున్నవి. (13) నేను ప్రతిగ్రహము నందును ప్రవేశింతును. నా శక్తిచేతనే అవి తమ కక్ష్యయందు నిలిచి ఉన్నవి. నేనే చంద్రుడనై సర్వఓషధులకు జీవరసమును సమకూర్చుచున్నాను. (14) ప్రాణుల దేహములందలి జఠరాగ్నిని నేను. ప్రాణాపాన వాయువులతో కూడి నేను నాలుగువిధములైన ఆహారములను పచనము చేయుచున్నాను. (15) సర్వుల

హృదయములందు నేను నిలిచి ఉన్నాను. నా నుండియే స్మృతి, జ్ఞానము, మరుపు అనునవి కలుగుచున్నవి. నేనే సమస్త
వేదముల ద్వారా తెలియదగినవాడను. వాస్తవమునకు వేదాంతకర్తను, వేదముల నెరిగినవాడను నేనే. (16) నశ్వరులు
మరియు అనశ్వరులని జీవులు రెండు రకములు. భౌతిక జగమునందలి ప్రతి జీవియు నశ్వరము కాగా, ఆధ్యాత్మిక జగము
నందు ప్రతి జీవియు అనశ్వరమని చెప్పబడినది. (17) ఈ ఇరువురుగాక మూడు లోకములందును ప్రవేశించి వాటిని
భరించు సాక్షాత్తు అవ్యయ ప్రభువును, పరమాత్ముడను అగు ఉత్తమపురుషుడు కలడు. (18) క్షర, అక్షర పురుషులకు
అతీతుడను, ఉత్తమోత్తముడను అగుటచే నేను జగమునందును మరియు వేదములందును పురుషోత్తముడనిగా
ప్రసిద్ధినొందితిని. (19) ఓ భారతా! సంశయరహితముగా నన్ను పురుషోత్తముడని తెలియగలిగినవాడే సర్వము తెలిసినవాడు.
అందుచే అతడు నా సంపూర్ణమగు భక్తియుత సేవలో నిమగ్నుడగును. (20) ఓ పాపరహితుడా! వేదములందలి అత్యంత
రహస్యమైన ఈ భాగమును నీకిప్పుడు నేను వెల్లడించితిని. దీనిని అవగాహన చేసికొనినవాడు బుద్ధిమంతుడు కాగలడు.
అతని ప్రయత్నములు పూర్ణవిజయమును పొందగలవు

16. దైవాసుర స్వభావములు

(1-3) శ్రీకృష్ణ భగవానుడు పలికెను: ఓ భరతవంశీయుడా! భయరాహిత్యము, స్వీయస్థితి, పవిత్రీకరణము, ఆధ్యాత్మిక జ్ఞాన
సముపార్జనము, దానగుణము, ఆత్మనిగ్రహము, యజ్ఞాచరణము, వేదాధ్యయనము, తపస్సు, సరళత్వము, అహింస, సత్యసంధత,
క్రోధరాహిత్యము, త్యాగము, శాంతి, ఇతరుల దోషములనెన్నకుండుట, జీవులయెడ దయ, లోభరాహిత్యము, మృదుత్వము, సిగ్గు,
దృఢ నిశ్చయము, తేజము, క్షమ, ధైర్యము, శుచిత్వము, అసూయారాహిత్యము, గౌరవవాంఛ లేకుండుట అను దివ్యగుణములు
దైవీ స్వభావము కలిగిన దివ్యులందుండును. (4) ఓ పార్థా! గర్వము, పొగరు, దురహంకారము, కోపము, పరుషత్వము, అజ్ఞానము.
లనెడి లక్షణములు అసురస్వభావము కలిగినవారికి చెందినవి. (5) దైవీగుణములు మోక్షమునకు అనుకూలములై ఉండగా
అసురగుణములు బంధకారకములగుచున్నవి. ఓ పాండుపుత్రా! నీవు దైవీగుణములతో జన్మించినందున శోకింపకుము.
(6) ఓ పృథాకుమారా! ఈ లోకమునందు దైవాసురులనెడి రెండు రకముల జీవులు కలరు. దైవీగుణములను ఇదివరకే నేను వివరముగా
తెలిపి ఉంటిని. ఇక అసురస్వభావము గలవారి గుణములను నా నుండి ఆలకింపుము. (7) అసురీగుణములు గలవారు చేయవలసి
నదేదియో, చేయరానిదేదియో ఎరుగకుందురు. శుచిత్వముగాని, సదాచారముగాని, సత్యముగాని వారి యందు కనిపించదు.
(8) ఈ జగము అసత్యమనియు, ఆధారము లేనిదనియు, నియామకుడెవ్వడును దీనికి లేడనియు, సంగమాభిలాష
చేతనే ఉత్పన్నమైనట్టి దీనికి కామము తప్ప వేరొక్కటి కారణము కాదనియు వారు పలుకుదురు. (9) నష్టాత్ములును,
అల్పబుద్ధులును అగు అసురస్వభావము గలవారు ఇట్టి అభిప్రాయములనే అనుసరించుచు అహితములును,
జగద్వినాశకరములును అగు ఘోరకర్మలలో నియుక్తులగుదురు. (10) తృప్తిపరచ శక్యము కానటువంటి కామము
నాశ్రయించి గర్వము ఇంకా మిథ్యాహంకారములను కూడినవారై భ్రాంతినొందినటువంటి అసురస్వభావులు అశాశ్వతములు
ఐనవాని ఎడ ఆకర్షితులై సదా అపవిత్రవ్రతులగుదురు. (11-12) ఇంద్రియతృప్తియే మానవుల ముఖ్యావసరమని వారు
విశ్వసింతురు. ఆ విధముగా జీవితాంతము వరకును వారి దుఃఖము అపరిమితముగా నుండును. వేలాది ఆశా
పాశములచే బద్ధులై, కామక్రోధములందు మగ్నులై ఇంద్రియభోగము కొరకు వారు అధర్మమార్గము ద్వారా
ధనమును గడింతురు. (13-15) అసురస్వభావుడగు మనుజుడు ఇట్లు తలచును: "ఈనాడు నావద్ద ఇంత ధనమున్నది.
నా ప్రణాళికలచే నేను మరింత ధనమును పొందుదును. ఇది అంతా నాది. భవిష్యత్తులో ఇది మరింతగా వృద్ధి

నొందగలడు. అతడు నా శత్రువు. అతనిని నేను వధించితిని. ఇతర శత్రువులు కూడా వధింపబడుదురు. నేనే సర్వమునకు ప్రభువును. నేనే భోక్తను. పూర్ణుడను, శక్తిమంతుడను మరియు సుఖిని నేనే. భాగ్యవంతులైన బంధువులతో కూడి ఉండు నేనే అత్యధిక ధనశాలిని. నన్ను మించిన శక్తిమంతుడుగాని, సుఖవంతుడుగాని వేరొకడు లేడు. నేను యజ్ఞముల నాచరింతును. దానమొసగుదును మరియు ఆనందము నొందుదును" ఈ విధముగా అట్టివారు అజ్ఞానముచే భ్రాంతికి లోనగుదురు. (16) వారు ఈ విధముగా అనేక చిత్త విభ్రాంతులచే కలతనొంది, మోహజాలముచే బద్ధులై ఇంద్రియ భోగమునెడ మిగుల అనురక్తిని పొంది నరకమున పడుదురు (17) ధనము మరియు మిథ్యాహంకారములచే మోహితులై కృతార్థులమని భావించుచు, సదా గర్వితులై వారు కొన్నిమార్లు విధి, నియమములను పాటింపకనే దంభముతో నామకర్మము యజ్ఞములను ఒనరింతురు (18) మిథ్యాహంకారము, బలము, గర్వము, కామము, క్రోధములచే భ్రాంతులైన అసుర స్వభావులు తమ దేహమునందు మరియు ఇతరుల దేహములందు నిలిచి ఉన్న దేవదేవుడనైన నా పట్ల అసూయ కలవారై నిజమైన ధర్మమును దూషింతురు. (19) అసూయకలవారును, క్రూరులును అగు నరాధములను వివిధ అసుర జన్మలనెడి సంసారసాగరమున నేను శాశ్వతముగా పడద్రోయుచున్నాను. (20) ఓ కౌంతేయా! అసురయోనుల యందే మరల మరల జన్మించి అట్టివారు నన్నెన్నడును పొందజాలక క్రమముగా అతి హేయమైన జన్మలకు పతనము చెందుదురు. (21) కామము, క్రోధము, లోభము అనునవి మూడు నరక ద్వారములై ఉన్నవి. అవి ఆత్మనాశకరములు కావున బుద్ధిమంతుడైన ప్రతిమనుజుడు వాటిని త్యజించి వేయవలెను. (22) ఓ కుంతీపుత్రా! ఈ మూడు నరక ద్వారముల నుండి తప్పించుకొనినవాడు ఆత్మోద్ధారమునకు అనుకూలములైన కర్మముల నొనరించి క్రమముగా పరమగతిని పొందగలడు. (23) శాస్త్రవిధులను త్యజించి తోచినరీతిని వర్తించువాడు పూర్ణత్వమునుగాని, సుఖమునుగాని, పరమగతిని గాని పొందజాలడు (24) కనుక ప్రతి ఒక్కరు శాస్త్రనియమముల ద్వారా కార్యమనేమో, అకార్యమనేమో అవగాహనము చేసికొనవలెను. అట్టి విధి నియమములను తెలిసియే మనుజుడు కర్మము ఒనరించవలెను. తద్ద్వారా అతడు క్రమముగా ఉద్ధరింప బడగలడు.

17. శ్రద్ధాత్రయ విభాగములు

(1) అర్జునుడు ప్రశ్నించెను : ఓ కృష్ణా! శాస్త్రనియమములను పాటింపక తమ మానసిక కల్పనలననుసరించి పూజలు ఒనర్చు వారి స్థితి ఎట్టిది? వారు సత్త్వగుణులా, రజోగుణులా లేక తమోగుణులా? (2) శ్రీకృష్ణభగవాను డిట్లు పలికెను : దేహధారి పొందిన త్రిగుణముల ననుసరించి శ్రద్ధ సాత్త్వికము, రాజసము, తామసము అనుచు మూడు విధములుగా ఉన్నది. ఈ విషయమును ఇప్పుడు ఆలకింపుము (3) ఓ భారతా! మనుజుడు వివిధ గుణముల యందలి తన స్థితిని అనుసరించి తత్సంబంధితమైన శ్రద్ధను పొందుచుండును. అతడు పొందిన గుణములను అనుసరించి అతడు ఒకానొక శ్రద్ధను కూడి ఉన్నాడని చెప్పబడును. (4) సత్త్వగుణము నందు నిలిచినవారు దేవతలను, రజోగుణమునందు నిలిచినవారు యక్షరాక్షసులను, తమోగుణమునందు నిలిచినవారు భూతప్రేతములను పూజింతురు. (5-6) శాస్త్రవిహితములు కానటువంటి తీవ్రమగు తపస్సులను దంభాహంకారములతో ఒనరించువారును, కామరాగములచే ప్రేరేపింపబడినవారును దంభాహంకారములతో ఒనరించువారును, కామరాగములచే అచేతనులై దేహమును మరియు దేహమందున్న పరమాత్మను కూడా

కష్టపెట్టువారును-అగువారలు -అసురులుగా తెలియబడుదురు. (7) త్రిగుణములననుసరించి మనుజుడు భుజించు ఆహారము కూడా మూడు విధములుగా నున్నది. అట్లే యజ్ఞము, దానము, తపస్సులు కూడా మూడు విధములుగా ఉన్నవి. ఇప్పుడు వాటి నడుమగల భేదమును ఆలకింపుము. (8) ఆయుఃప్రమాణమును పెంచునవి, జీవనమును పవిత్రమొనర్చునవి, బలమును, ఆరోగ్యమును, ఆనందమును, తృప్తిని కలిగించునవి-అగు ఆహారములు సత్త్వగుణ ప్రధానులకు ప్రియమైనవి. అట్టి ఆహారములు రసపూర్ణములును, పుష్టికరములును, ఆరోగ్యకరములును, మనో ప్రీతికరములును అయి ఉండును. (9) మిక్కిలి చేదైనవి, అతిపుల్లనైనవి, ఉప్పగా ఉన్నట్టివి, అతి వేడివి, అతికారమైనవి, ఎండి నట్టివి, మంటను కలిగించునట్టివి అను ఆహారములు రజోగుణమునందున్నవారికి ప్రియమైనట్టివి. అట్టి ఆహారములు దుఃఖమును, క్లేశమును, రోగమును కలిగించును. (10) భుజించుటకు మూడు గంటలకు ముందు తయారుచేయబడినవి, రుచి రహితములైనవి, చెడిపోయినవి మరియు క్రుళ్ళినవి, ఎంగిలి మరియు నిషిద్ధ పదార్థములను కలిగినట్టివైన ఆహారములు తమోగుణులకు ప్రియమైనవి. (11) శాస్త్రనిర్దేశానుసారము తమవిధి అని తలంచుచు ఫలములు కోరనివారిచే చేయబడు యజ్ఞము యజ్ఞములందు సాత్త్విక యజ్ఞమనబడును.

(12) ఓ భరతశ్రేష్ఠా! ఏదేని ఒక భౌతిక లాభము కొరకు లేదా ఆడంబరము కొరకు నిర్వహింపబడు యజ్ఞము రజోగుణప్రధానమైనదని ఎరుగుము (13) శాస్త్రనిర్దేశముల ఎడ గౌరవము లేకుండా, ప్రసాదవితరణము కాని, వేద మంత్రోచ్చారణము కాని, బ్రాహ్మణ దక్షిణలు కాని లేకుండా శ్రద్ధారహితముగా ఒనర్చబడు ఏ యజ్ఞమైనను తామస గుణప్రధానమైనదిగా భావింపబడును. (14) దేవదేవుడు, బ్రాహ్మణులు, ఆధ్యాత్మిక గురువు, పూజనీయులైన తల్లిదండ్రులు మొదలగువారిని పూజించుట, శుచిత్వము, సరళత్వము, బ్రహ్మచర్యము, అహింస అనునవి శారీరక తపస్సని చెప్పబడును.

(15) సత్యమును, ప్రియమును, హితకరమును, అనుద్వేగకరమును అగు వచనములను పలుకుట మరియు నిత్యము వేద పారాయణము చేయుట అనునవి వాక్కునకు సంబంధించిన తపస్సనబడును. (16) తృప్తి, సరళత్వము, మౌనము, ఆత్మ నిగ్రహము, అస్తిత్వమును పవిత్రమొనర్చుట అనునవి మానసిక తపస్సనబడును. (17) దివ్యమైన శ్రద్ధతో కేవలము భగవానుని నిమిత్తమే భౌతికవాంఛారహితులైన వారిచే ఒనర్చబడు ఈ త్రివిధ తపస్సులు సాత్త్విక తపస్సనబడును.

(18) గౌరవము, సన్మానము, పూజలనందుట కొరకు గర్వముచే ఒనర్చబడు తపస్సు రజోగుణ ప్రధానమైనదిగా చెప్పబడును. అది స్థిరముగాని, శాశ్వతముగాని కాజాలదు. (19) తనను తాను హింసించుకొనుటచే గాని, ఇతరులకు హాని లేదా నష్టమును గూర్చు నిమిత్తముచే గాని, మూర్ఖత్వముతో చేయబడు తపస్సు తమోగుణమునకు సంబంధించినదని చెప్పబడును. (20) ప్రతిఫలవాంఛ లేకుండా సరియైన ప్రదేశమున మరియు సరైన సమయమున తగినవానికి స్వధర్మము అనెడి భావముతో ఒనర్చబడు దానము సత్త్వగుణమును కూడినదిగా భావింపబడును. (21) ప్రతిఫలవాంఛతో గాని, సకామఫలవాంఛతో గాని, అయిష్టతతో గాని ఒసరింపబడు దానము రజోగుణమును కూడినట్టిదని చెప్పబడును.

(22) అపవిత్ర ప్రదేశమునందు తగని సమయమున అపాత్రులకు ఒసగబడునటువంటిది లేదా తగిన శ్రద్ధ మరియు గౌరవము లేకుండా ఒసగబడు నట్టిదైన దానము తమోగుణప్రధానమైనదని చెప్పబడును. (23) సృష్టి ఆరంభము నుండి "ఓం, తత్, సత్" అను మూడు సంజ్ఞాపదములు పరతత్త్వమును సూచించుటకు వాడబడినవి. వేద మంత్రములను ఉచ్చరించునపుడును, పరబ్రహ్మ ప్రీత్యర్థమై యజ్ఞాచరణము కావించునపుడును ఈ మూడు సంజ్ఞాపదములు బ్రాహ్మణులచే ఉపయోగింపబడుచుండెడివి. (24) కనుకనే శాస్త్రనియమానుసారము యజ్ఞము, దానము, తపములను చేపట్టు తత్త్వజ్ఞులు పరమపురుషుని పొందుటకై వానిని ఓంకారముతో ప్రారంభింతురు.

(25) ఫలాపేక్షారహితముగా ప్రతివారును యజ్ఞము, తపస్సు, దానములను "తత్" అను పదమును కూడి ఒనరింప వలెను. భౌతికబంధము నుండి విడుదలను పొందుటయే అట్టి ఆధ్యాత్మిక కర్మల ముఖ్యప్రయోజనము.

(26-27). భక్తియుతసేవా యజ్ఞమునకు పరమలక్ష్యమైన పరతత్త్వము "సత్" అను పదముచే సూచింపబడును. ఓ పృథాకుమారా! దివ్యములై ఉండి పరమపురుషుని ప్రీత్యర్థమై ఒనరింపబడు సర్వయజ్ఞ, తపో, దానకర్మలవలె అట్టి యజ్ఞకర్మ కూడా "సత్" అనబడును. (28) ఓ పార్థా! పరమపురుషుని యందు శ్రద్ధ లేకుండా ఒనర్చునటువంటి యజ్ఞము, దానము లేదా తపస్సు అనునది అశాశ్వతమైనది. "అసత్" అని పిలువబడు అట్టి కర్మ ప్రస్తుత జన్మము నందును, రాబోవు జన్మము నందును నిరుపయోగమే.

18. ఉపసంహారము - సన్న్యాసము యొక్క పూర్ణత్వము

(1). అర్జునుడు పలికెను: ఓ మహాబాహో! కేశి సంహారా! ఇంద్రియాధీశా! త్యాగము, సన్న్యాసము అనువాని ప్రయోజనమును నేను తెలిసికొనగోరుచున్నాను. (2) శ్రీకృష్ణభగవానుడు పలికెను: విషయకోరికల పరమగు కర్మలను త్యజించుటయే సన్న్యాసమని విజ్ఞులు పలుకగా, సర్వకర్మల ఫలమును విడుచుటయే త్యాగమని బుద్ధిమంతులు పలుకుదురు. (3) సర్వకామ్యకర్మలు దోషము వలె త్యాజ్యములని కొందరు విజ్ఞులు పలుకగా, యజ్ఞము, దానము, తపస్సు అనే కర్మలు ఎన్నడును విడువరానివని మరికొందరు మునులు పలుకుదురు. (4) ఓ భరతశ్రేష్ఠా! పురుషవ్యాఘ్రా! త్యాగమును గూర్చిన నా నిర్ణయమును ఇప్పుడు ఆలకింపుము. శాస్త్రములందు అట్టి త్యాగము మూడు విధములని తెలుపబడినది. (5) యజ్ఞము, దానము, తపస్సు అనెడి కర్మలను ఎన్నడును త్యజింపరాదు. వానిని తప్పక ఒనరింపవలెను. వాస్తవమునకు యజ్ఞ, దాన, తపములు మహాత్ములను కూడా పవిత్రమొనర్చును. (6) ఓ పార్థా! ఈ కర్మలన్నింటిని సంగత్వముగాని, ఎట్టి ఫలాపేక్ష గాని లేకుండా స్వధర్మమనెడి భావనలో ఒనరింపవలెను. ఇదియే నా తుది అభిప్రాయము. (7) విధ్యుక్త ధర్మములను ఎన్నడును విడువరాదు. మోహ కారణమున ఎవ్వరేని తన విధ్యుక్త ధర్మమును విడిచినచో అట్టి త్యాగము తమోగుణమునకు సంబంధించినదిగా చెప్పబడును. (8) దుఃఖకరములనిగాని, దేహమునకు అసౌఖ్యకరములని గాని భావించి విధ్యుక్తధర్మములను విడుచువాడు రజోగుణమునందు త్యాగమొనర్చిన వాడగును. అట్టి కర్మమెన్నడును త్యాగమువలని ఉన్నత స్థితిని కలుగచేయలేదు. (9) ఓ అర్జునా! తప్పక ఒనరింపవలసియే ఉన్నదని తన స్వధర్మమును నిర్వహించుచు, సమస్త భౌతికసంగమును మరియు ఫలాసక్తిని విడుచువాని త్యాగము సాత్త్విక త్యాగమనబడును.

(10) అశుభకర్మల ఎడ ద్వేషముగాని, శుభకర్మల ఎడ సంగత్వముగాని లేనట్టి సత్త్వగుణస్థితుడగు బుద్ధిమంతుడైన త్యాగికి కర్మ ఎడ ఎట్టి సంశయములు ఉండవు (11) దేహధారుడైనవానికి సర్వకర్మలను త్యజించుట నిక్కముగా అసాధ్యమైన విషయము. కాని కర్మఫలములను త్యాగమొనర్చినవాడు మాత్రము నిజమైన త్యాగి అనబడును. (12) ఇష్టము, అనిష్టము, ఇష్టానిష్ట మిశ్రితము అనెడి మూడు విధములైన కర్మఫలములు త్యాగికానటువంటి వానికి మరణాంతము పిదప కలుగుచున్నవి. కాని సన్న్యాసాశ్రమము నందున్న వారికి మాత్రము సుఖదుఃఖములను కలిగించు అట్టి ఫలములు కలుగుటలేదు.

(13) ఓ మహాబాహుడవైన అర్జునా! వేదాంతము ననుసరించి కర్మలు సిద్ధించుటకు ఐదు కారణములు గలవు. వానిని నానుండి

ఆలకింపుము (14) కార్యస్థానము (దేహము), కర్త, వివిధేంద్రియములు, వివిధములైన యత్నములు, చివరగా పరమాత్ముడు అనెడి ఈ ఐదును కార్యమునకు కారణములై ఉన్నవి. (15) దేహముచే గాని మనస్సుచే గాని, వాక్కుచే గాని మనుజుడు ఒనరించు న్యాయాన్యాయ కర్మలన్నింటికిని ఈ ఐదు అంశములే కారణములు. (16) కనుక ఈ ఐదు అంశములను గుర్తింపక తననే కర్తగా భావించువాడు నిక్కముగా బుద్ధిహీనుడు. అట్టి మూఢుడు విషయములను యథార్థదృష్టితో గాంచలేడు. (17) మిథ్యా అహంకారముచే ప్రభావితుడు కానివాడును, సంగత్వరహిత బుద్ధిని కలిగినవాడును అగు మనుజుడు జగమునందు జనులను సంహరించినను సంహారమొనర్చనట్లే అగును. అతడెన్నడును తన కర్మలచే బద్ధుడు కాడు. (18) జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాత అనెడి మూడు అంశములు కర్మకు ప్రేరణములు కాగా, ఇంద్రియములు, కార్యము, కర్త అనునవి కర్మ యొక్క మూడు అంశములై ఉన్నవి. (19) ప్రకృతిజన్య త్రిగుణముల ననుసరించి జ్ఞానము, కర్మము, కర్త అనునవి మూడు రకములు. ఇక వానిని గూర్చి నానుండి ఆలకింపుము. (20) జీవులు అసంఖ్యాక రూపములుగా విభజింపబడినను వారి యందు అవిభక్తమై ఉన్నట్టి ఏకమైన ఆధ్యాత్మిక స్వభావము ఏ జ్ఞానము ద్వారా గాంచబడునో అట్టి జ్ఞానము సత్త్వగుణ ప్రధానమైనదని తెలిసికొనుము. (21) ఏ జ్ఞానము ద్వారా భిన్న శరీరములందు భిన్న జీవులు ఉన్నట్లు మనుజుడు గాంచునో అట్టి జ్ఞానము రజోగుణ సంబంధమైనదని నీవెరుగుము (22) ఏ జ్ఞానము ద్వారా మనుజుడు అల్పమైనట్టి ఒకానొక కార్యమునందు కారణము మరియు సత్యమగాహనము అదియే సర్వస్వమనెడి భావనలో ఆసక్తుడగునో అట్టి జ్ఞానము తమోగుణ సంబంధమైనదని చెప్పబడును. (23) నియమబద్ధమైనదియు, రాగద్వేషరహితముగా ఒనరింపబడునది, ఫలాపేక్ష లేనటువంటిదియు ఐన కర్మము సత్త్వగుణము నందున్నట్టిదిగా చెప్పబడును. (24) కాని కోరికలను ఈడేర్చుకొనవలెనని భావించువానిచే మిథ్యాహంకార భావనలో అతి ప్రయాసతో ఒనర్చబడు కర్మ రజోగుణ ప్రధానమైనదని చెప్పబడును.
(25) శాస్త్రనిర్దేశములను నిరసించి భవిష్యద్బంధమును గాని, పరహింసను, పరదుఃఖమును గాని లెక్కపెట్టక భ్రాంతియందు ఒనర్చబడు కర్మము తమోగుణమునకు సంబంధించినదని చెప్పబడును. (26) త్రిగుణ సంగత్వరహితముగా మిథ్యాహంకారము లేకుండా నిశ్చయము మరియు ఉత్సాహములను గూడి, జయాపజయములందు నిర్వికారుడై తన ధర్మమును నిర్వర్తించువాడు సాత్త్వికకర్త అనబడును. (27) కర్మఫలములను అనుభవింపగోరుచు కర్మ మరియు కర్మ ఫలముల ఎడ ఆసక్తుడై ఉండువాడును, లోభియును, అసూయాపరుడును, శుచిరహితుడును, సుఖదుఃఖములచే చలించువాడును అగు కర్త రజోగుణకర్త అనబడును. (28) భౌతికాసక్తుడును, మొండితనము కలవాడును, మోసము చేయు వాడును, ఇతరులను అవమానించుట యందు దక్షుడును, సోమరియును, సదా చింతాక్రాంతుడును, వ్యర్థకాలహరణము చేయు వాడును నైన సదా శాస్త్రనిర్దేశములకు విరుద్ధముగా కర్మ ఒనరించువాడు తమోగుణకర్త అని చెప్పబడును. (29) ఓ ధనంజయా! ఇక త్రిగుణముల ననుసరించి ఉన్న వివిధములైన బుద్ధి మరియు నిశ్చయములను విశదముగా నానుండి ఆలకింపుము.
(30) ఓ పార్థా! ఏ బుద్ధి ద్వారా మనుజుడు ఏది చేయదగినదో ఏది చేయరానిదో, దేనికి భయపడవలెనో దేనికి భయము నొందరాదో, ఏది బంధకరమో ఏది ముక్తిదాయకమో తెలిసికొనగలుగునో అట్టి బుద్ధి సత్త్వగుణప్రధానమైనది.
(31) ఓ పార్థా! ధర్మము మరియు అధర్మము నడుమగల భేదమునుగాని, చేయవలసిన కార్యము మరియు చేయదగని కార్యము నడుమగల భేదమును గాని తెలియలేనటువంటి బుద్ధి రాజసిక బుద్ధి అనబడును. (32) ఓ పార్థా! అజ్ఞానము మరియు భ్రాంతి కారణముగా అధర్మమును ధర్మముగాను మరియు ధర్మమును అధర్మముగాను భావించుచు, ఎల్లప్పుడును తప్పుదోవను పోవునట్టి బుద్ధి తామసగుణమును కూడినట్టిది. (33) ఓ పృథాకుమారా! అవిచ్ఛిన్నమైనదియు, యోగాభ్యాసముచే స్థిరముగా కొనసాగునదియు, తత్కారణముగా ఇంద్రియ, మనో, ప్రాణములు

కార్యములను నియమించునది అయిన నిశ్చయము సత్త్వగుణప్రధానమైనది. (34) ఓ అర్జునా! కాని ఏ నిశ్చయముచే మనుజుడు ధర్మము, అర్థము, కామము నందలి ఫలముల ఎడ ఆసక్తిని వహించునో అట్టి నిశ్చయము రజోగుణ ప్రధానమైనట్టిది. (35) ఓ పార్థా! ఇక స్వప్నము, భయము, శోకము, విషాదము, భ్రాంతి అనువానిని దాటలేనటువంటి మందబుద్ధితో కూడిన నిశ్చయము తమోగుణమునకు సంబంధించినట్టిది. (36) భరతవంశీయులలో శ్రేష్ఠుడా! ఇక సుఖమునందలి మూడురకములను గూర్చి నానుండి ఆలకింపుము. వాని ద్వారా బద్ధజీవుడు సుఖమును అనుభవించుట మరికొన్నిమార్లు సర్వదుఃఖముల అంతము చేరుట జరుగుచుండును. (37) ఆది యందు విషప్రాయముగా నుండి అంత్యమున అమృతముతో సమానమగునది మరియు ఆత్మానుభూతి ఎడ మనుజుని జాగృతుని చేయునది అయిన సుఖము సత్త్వగుణప్రధానమైనదని చెప్పబడును. (38) ఇంద్రియములు ఇంద్రియార్థములతో సంపర్కము నొందగా లభించునటువంటిది మరియు ఆది అమృతమువలె, అంత్యమున విషమువలె తోచునది అయిన సుఖము రజోగుణ ప్రధానమైనదని భావింపబడును. (39) ఆత్మానుభవదృష్టి లేనిదియు, ఆదినుండి అంత్యము వరకు మోహకారణమైనదియు, నిద్ర, సోమరితనము, భ్రాంతులనుండి ఉత్పన్నించినదియు అయిన సుఖము తమోగుణప్రధానమైనదని చెప్పబడును. (40). ప్రకృతిజన్య త్రిగుణములనుండి విడివడినట్టి జీవుడు భూలోకమునగాని, ఊర్ధ్వలోకములలోని దేవతలందుగాని ఎచ్చోటను లేడు. (41) ఓ పరంతపా! ప్రకృతి త్రిగుణములచే కలిగిన గుణస్వభావముల ననుసరించి బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు విభజింపబడుదురు. (42) శాంతి, ఇంద్రియనిగ్రహము, తపస్సు, పవిత్రత, సహనము, నిజాయితీ, జ్ఞానము, విజ్ఞానము, ధార్మిక చింతనమనెడి సహజలక్షణములను గూడి బ్రాహ్మణులు కర్మ ఒనరింతురు. (43) శౌర్యము, శక్తి, దృఢనిశ్చయము, దక్షత, యుద్ధమునందు ధైర్యము, ఔదార్యము, నాయకత్వమనునవి క్షత్రియులకు సహజమైన కర్మ స్వభావములు. (44) వ్యవసాయము, గోరక్షణము, వాణిజ్యములు వైశ్యులకు సహజకర్మస్వభావకర్మలు కాగా, పనిచేయుట మరియు పరులసేవ శూద్రులకు సహజ స్వభావకర్మలై ఉన్నవి. (45) మనుజుడు తన గుణమునకు సంబంధించిన కర్మను చేయుట ద్వారా పూర్ణత్వమును పొందగలడు. ఇక దీనిని ఏ విధముగా ఒనరింపవచ్చునో నా నుండి ఆలకింపుము. (46) సర్వజీవులకు కారణమైనవాడును మరియు సర్వత్ర వ్యాపించి ఉన్నవాడును అగు భగవానుని అర్చించుచు, తన విధ్యుక్తకర్మను ఒనరించుటద్వారా మనుజుడు పూర్ణత్వమును పొందగలడు (47) పరధర్మమును స్వీకరించి దానిని సమగ్రముగా ఒనరించుటకన్నను అసమగ్రముగా ఒనరించినను స్వధర్మమునందే నియుక్తమగుట మేలైనది. గుణములననుసరించి నిర్దేశింపబడిన కర్మలు ఎన్నడును పాపఫలముచే ప్రభావితములు కావు. (48) అగ్ని పొగచే ఆవరింపబడినట్లు ప్రతి యత్నము కూడా ఏదో ఒక దోషముచే ఆవరింపబడి ఉండును. అందుచే ఓ కౌంతేయా! దోషపూర్ణమైనను తన సహజకర్మను ఎవ్వడును త్యజింపరాదు. (49) ఆత్మనిగ్రహము కలవాడును, అనాసక్తుడును, భౌతికసుఖములను త్యజించువాడును అగు మనుజుడు సన్న్యాసము ద్వారా కర్మఫలవిముక్తి అనెడి అత్యున్నత పూర్ణత్వస్థాయిని పొందగలడు (50) ఓ కుంతీపుత్రా! ఇట్టి పూర్ణత్వమును పొందినవాడు నేను ఇప్పుడు సంగ్రహముగా చెప్పబోవురీతి వర్తించుచు అత్యున్నత జ్ఞానస్థితియైన పరమపూర్ణత్వస్థితిని ఏ విధముగా పొందగలడో నీవు ఆలకింపుము (51-53) బుద్ధిచే పవిత్రుడైనందునను మరియు రాగద్వేషముల నుండి విడివడి ఉన్న కారణముగా ఇంద్రియార్థములను త్యజించి దృఢనిశ్చయముచే మనోనిగ్రహము కలిగి ఉన్నందునను ఏకాంత స్థానమున నివసించువాడును, సమాధిస్థితి యందున్నవాడును, అసంగుడును, మిథ్యాహంకారము, మిథ్యాబలము, మిథ్యాగర్వము, కామము, క్రోధము, విషయవస్తుస్వీకారము అనువాని నుండి విడివడిన

వాడును, మమత్వరహితుడును, శాంతియుతుడును అగు మనుజుడు నిశ్చయముగా ఆత్మానుభవ స్థాయికి ఉద్ధరింప బడగలడు. (54) ఈ విధముగా దివ్యస్థితి యందు ప్రతిష్ఠితుడైనవాడు శీఘ్రమే పరబ్రహ్మానుభవమును పొంది ఆనందపూర్ణుడగును. దేనికొరకు శోకించక, దేనిని వాంఛింపక అట్టివాడు సర్వజీవుల ఎడ సమభావమును కలిగి ఉండును. అటువంటిస్థితి యందే అతడు నా శుద్ధభక్తియుత సేవను పొందుచున్నాడు. (55) కేవలము భక్తియుత సేవచేతనే మనుజుడు నన్ను యథారూపముగా దేవదేవునిగా అవగాహన చేసికొనగలడు. అటువంటి భక్తిచే నన్ను సంపూర్ణముగా ఎరిగినప్పుడు అతడు నా ధామమును చేరగలడు. (56) అన్ని రకములైన కర్మల యందు నియుక్తుడైనను నా శుద్ధభక్తుడు నా రక్షణలో నిలిచి శాశ్వతమును, అవ్యయమును అగు పదమును నా అనుగ్రహముచే పొందగలడు. (57) సర్వకర్మల యందు నా పైననే ఆధారపడి సదా నా రక్షణమునందే కర్మ ఒనరింపుము. అట్టి భక్తియుత సేవలో సంపూర్ణముగా నా యందే చిత్తము కలవాడవగుము. (58) నా యందు చిత్తము కలవాడవైనచో నా కరుణచే బద్ధజీవనపు అటంకములను అన్నింటిని దాటగలవు. కాని ఒకవేళ నా మాటవినక అట్టి భావనలో గాక మిథ్యాహంకారముతో వర్తించితివేని తప్పక వినాశనమును పొందగలవు (59) ఒకవేళ నా నిర్దేశము ననుసరించి వర్తించక యుద్ధము చేయకుందువేని నీవు తప్పు మార్గమును పట్టినవాడవగుదువు. నీ స్వభావము ననుసరించి నీవు యుద్ధమునందు నియుక్తుడవు కావలసియే ఉన్నది. (60) మోహకారణముగా నీవిప్పుడు నా నిర్దేశానుసారము వర్తించుటకు అంగీకరింపకున్నావు. కాని ఓ కౌంతేయా! నీ స్వభావము వలన పుట్టిన కర్మచే అవశుడవై నీవు దానిని ఒనరింపగలవు. (61) ఓ అర్జునా! పరమపురుషుడు ఎల్లరి హృదయములందు విరాజమానుడై ఉండి, భౌతిక శక్తి యంత్రముపై ఆసీనులైనట్లుగా నున్న సర్వజీవుల గతులను నిర్దేశించుచున్నాడు. (62) ఓ భారతవంశీయుడా! అతనికే సంపూర్ణముగా శరణము నొందుము. అతని కరుణచే పరమశాంతిని, దివ్యశాశ్వత స్థానమును నీవు పొందగలవు (63) ఈ విధముగా గుహ్యతరమైన జ్ఞానమును నీకు నేను వివరించితిని. దీనిని సంపూర్ణముగా విమర్శన కావించి, పిదప తోచిన రీతి ఒనరింపుము. (64) నీవు నాకు ప్రియమిత్రుడవు అగుటచే జ్ఞానములలో కెల్ల గుహ్యతమమైనట్టి నా దివ్యోపదేశమును నీకు ఒసగుచున్నాను. ఇది నీ హితము కొరకై ఉన్నందున దీనిని ఆలకింపుము. (65) సర్వదా నన్నే చింతింపుము. నా భక్తుడవగుము. నన్ను అర్చింపుము మరియు నాకు నమస్కారము కావింపుము. ఈ విధముగా నీవు తప్పక నన్ను చేరగలవు. నీవు నా ప్రియమిత్రుడవగుటచే నీకిది నేను వాగ్దానము చేయుచున్నాను. (66) సర్వవిధములైన ధర్మములను త్యజించి కేవలము నన్నే శరణు పొందుము. నిన్ను సర్వపాపఫలముల నుండి నేను ముక్తుని గావింతును. భయమును నొందకుము. (67) ఇట్టి గుహ్యతమ జ్ఞానమును తపస్సంపన్నులు కాని వారికి గాని, భక్తులు కానివారికి కాని, భక్తియుత సేవలో నిలువనివారికి గాని, నా ఎడ అసూయను కలిగినవారికి గాని ఎన్నడు వివరింపరాదు. (68) పరమ రహస్యమును భక్తులకు వివరించువానికి శుద్ధభక్తి యోగము నిశ్చయముగా కలుగును. అంత్యమున అతడు నన్ను చేరగలడు (69) నాకు అతనికన్నను ప్రియమైన సేవకుడు మరొక్కడు ఈ ప్రపంచమున లేడు. అతనికి మించిన ప్రియుడైనవాడు వేరొక్కడు ఉండబోడు. (70) మన ఈ పవిత్రమగు సంవాదమును శ్రద్ధతో అధ్యయనము చేయువాడు జ్ఞానయజ్ఞముచే నన్ను పూజించినవాడగునని నేను ప్రకటించుచున్నాను. (71) శ్రద్ధను అసూయారాహిత్యమును గూడి శ్రవణము చేయువాడు సర్వపాపఫలముల నుండి విడుదలను పొంది, పుణ్యకర్ములైనవారు నివసించు పుణ్యలోకములను

పొందగలరు. (72) ఓ పార్థా! ధనంజయా! ఏకాగ్ర మనస్సుతో దీనినంతటిని నీవు శ్రవణము చేసితివా? నీ అజ్ఞానము మరియు మోహము ఇప్పుడు నశించినవా? (73) అర్జునుడు పలికెను: ఓ అచ్యుతా! నా మోహము ఇప్పుడు నశించినది. నీ కరుణచే నా స్మృతిని తిరిగి పొందితిని. ఇప్పుడు నేను స్థిరుడను, సందేహరహితుడను అయి నీ ఆజ్ఞానుసారము వర్తించుటకు సిద్ధముగా ఉన్నాను. (74) సంజయుడు పలికెను: ఈ విధముగా మహాత్ములైన శ్రీకృష్ణుడు మరియు అర్జుని నడుమ జరిగిన సంవాదమును నేను శ్రవణము చేసితిని. అద్భుతమైన ఆ సంవాదముచే నాకు రోమాంచమగుచున్నది. (75) అర్జునునితో స్వయముగా సంభాషించుచున్న యోగేశ్వరుడైన శ్రీకృష్ణుని నుండి ఈ పరమగుహ్య వచనములను వ్యాసదేవుని కరుణచే నేను ప్రత్యక్షముగా వినగలిగితిని. (76) ఓ రాజా! శ్రీకృష్ణార్జునుల నడుమ జరిగిన అద్భుతమును, పవిత్రమును అగు సంవాదమును స్మరించిన కొలది ప్రతిక్షణము పులకించుచు ఆనందము నొందుచున్నాను. (77) ఓ రాజా! అత్యద్భుతమైన శ్రీకృష్ణ భగవానుని రూపమును స్మరించిన కొలది నేను అత్యంత విస్మయము నొందుచు మరల మరల ఆనందమును అనుభవించుచున్నాను. (78) యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు మరియు మేటి ధనుర్ధారియైన అర్జునుడు ఎచ్చట ఉందురో అచ్చట సంపద, విజయము, అసాధారణ శక్తి, నీతి నిశ్చయముగా నుండును. ఇదియే నా అభిప్రాయము.